ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 213 | విజయవాడ, గురువారం 3 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



సబ్‌కలెక్టర్ ఆదర్శం సర్కారు ఆస్పత్రిలో ప్రసవం

ప్రజాశక్తి-రంపచోడవరం (తూర్పుగోదావరి)

ఆ ఐఎఎస్ అధికారి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కల్గించాలనే ఉద్దేశ్యంతో ముందడుగు వేశారు. పండంటి శిశువును కనడానికి ప్రభుత్వాస్పత్రినే ఎంపిక చేసుకున్నారు. సర్కారు ఆసుపత్రులను ఒక పథకం ప్రకారం ప్రభుత్వమే నీరుగార్చుతున్న సమయంలో తూర్పుగోదావరి జిల్లా సబ్‌కలెక్టర్ విజయకృష్ణన్ తీసుకున్న ఈ నిర్ణయం అందరి ప్రశంసలకు నోచుకుంది. బుధవారం తెల్లవారు జామున 5.30 గంటలకు రంపచోడవరం ప్రభుత్వాస్పత్రిలో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ విజయకృష్ణన్ ప్రసవం నిమిత్తం చేరారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన డాక్టర్లు ఇందిర, రమేష్‌కిషోర్, ఎనస్థీషియన్ విష్ణువర్ధిని, స్థానిక వైద్యులు వీరబ్బాయి, రాములు ఆమెకు వైద్యసేవలందించారు. సిజేరియన్ చేశారు. ఉదయం 6.30 గంటలకు మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చారు. ఆమె భర్త ఐటిడిఎ పిఒ దినేష్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం కలిగించడానికే తమ దంపతులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

రుణాలు మరింత చౌక



- కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన ఆర్‌బిఐ

6

దిగజారిన బిజెపి

- కర్నాటకలో ఐటి సోదాలపై సర్వత్రా విమర్శలు
- ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంటులో ప్రకంపనలు
- పావులుగా మారిన దర్యాప్తు సంస్థలు



ప్రజాశక్తి – న్యూఢిల్లీ బ్యూరో, బెంగళూరు ప్రతినిధి

కర్నాటక విద్యుత్ శాఖ మంత్రి డికె శివకుమార్ నివాసాలపై ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా సోదాలు నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం పార్లమెంట్ ఉభయసభల్లోనూ ఈ వ్యవహారం ప్రకంపనలు సృష్టించింది. రాజ్యసభలో మెజార్టీ కోసం బిజెపి దిగజారుడుతనంతో విలువలకు పాత్ర వేస్తుందని పార్లమెంటు వెలుపలా పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో తమ పార్టీ ఎమ్మెల్యేలకు రక్షణ కల్పించి రాజ్యసభ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి కూడా కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో గుజరాత్ నుంచి మూడో సీటును చేజిక్కించుకునేందుకు బిజెపి ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్‌ను పోటీలో నిలపడంతో ఆయన ప్రత్యర్థి గ్రూపుకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకునేందుకు బిజెపి ప్రలోభాల ఎత్తుగడలు రచించింది. 'ఆపరేషన్ అహ్మద్ పటేల్' పేరుతో గుజరాత్‌లో కాంగ్రెస్‌ను గుల్ల చేసేందుకు వ్యూహాన్ని పన్నింది. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాషాయ గూటికి చేరారు. బిజెపి వలలో పడకుండా 43 మంది ఎమ్మెల్యేలను వారం రోజుల నుంచి బెంగళూరులోని ఓ రిసార్టులో కాంగ్రెస్ మకాం వేయించింది. వీరికి శివకుమార్ ఆతిథ్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంరక్షిస్తున్నాడన్న ఏకైక కారణంతోనే రాజకీయ కక్షబూని శివకుమార్, ఆయన బంధువులకు చెందిన బెంగళూరు, న్యూఢిల్లీ నివాసాల్లోనూ, కార్యాలయాల్లోనూ ఐటి, ఇడి శాఖలు ఉన్నపలంగా దాడులు చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.

ఉభయసభల్లోనూ కాంగ్రెస్ ఆందోళన

సోదాలకు వ్యతిరేకంగా ఉభయసభల్లో కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దని నినదించింది. ఫలితంగా రాజ్యసభా కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. బుధవారం రాజ్యసభ ప్రారంభమైన తరువాత మొదట ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభా ఉపనేత ఆనంద్‌శర్మ లేవనెత్తారు. 'గుజరాత్ ఎమ్మెల్యేలు ఆశ్రయం పొందుతున్న బెంగళూరులో.. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై, మంత్రిపై ఉదయం నుంచి ఆదాయపు పన్ను శాఖ, ఇడి సోదాలు నిర్వహిస్తున్నాయి' అని ఆరోపించారు. కేంద్ర సర్కారు ఐటి, సిబిఐ, ఇడి శాఖలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. గుజరాత్ ఎమ్మెల్యేలను సురక్షితంగా సంరక్షిస్తున్న మంత్రిపై ఈ సమయంలోనే సోదాలు నిర్వహించడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు.

ఈ సమయంలోనే ఎందుకు : నిలదీసిన ఆజాద్

ఇదే అంశంపై రాజ్యసభా ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, భయం లేకుండా జరగాలని, కానీ గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో ఇవేవీ జరగడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భయోత్పాతానికి గురి చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యేలను

మిగతా 8లో




వంటగ్యాస్ సబ్సిడీ ఎత్తివేతను నిరసిస్తూ విజయవాడ బీసెంట్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సిపిఐ(ఎం) కార్యకర్తలు, నాయకులు

7

'బెల్టు' తీయండి

- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి
- టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

అవినీతికి పాల్పడితే వ్యవస్థపై నమ్మకం పోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బెల్టు షాపుల నిర్మూలన, ఇసుక తవ్వకాలపై తన నివాసం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లు, మైనింగ్, ఎక్సైజ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో తొలగించిన బెల్టు షాపులు, నమోదు చేసిన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు జవాబుదారీతనంగాగా ఉంటేనే పాలకులు, అధికార యంత్రాంగంపై గౌరవం పెరుగుతుందన్నారు. బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, అధిక ధరలకు ఇసుకను అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకోవాలని, త్వరితగతిన స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒక శాతం ఉన్న అవినీతిని నియంత్రించడం అసాధ్యమేమీ కాదన్నారు. ఇసుక రవాణాపై చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలని, పొరుగు రాష్ట్రాలకు

మిగతా 9లో



విక్రమ్‌గౌడ్‌పై కాల్పులకు ఉపయోగించిన తుపాకీని మీడియాకు చూపెడుతున్న సిపి మహేందర్‌రెడ్డి

ఎ-1 అతడే..!

- వీడిన కాల్పుల చిక్కుముడి
- తనపైనే హత్యాయత్నం చేయించుకున్న విక్రమ్ గౌడ్
- రూ.14.50 లక్షలు చెల్లింపు
- అడ్డొస్తే భార్యపైనా కాల్పులకు ఆదేశం

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

సంచలనం సృష్టించిన విక్రంగౌడ్ కాల్పుల కేసు చిక్కుముడి వీడింది. సినిమా ఫక్కీలో సాగిన ఈ కాల్పుల కేసును, అదే రీతిలో పోలీసులు ఛేదించారు. జనంలో సానుభూతి పొందడానికి సొంతంగా విక్రంగౌడే తనపైనే కాల్పులు జరిపించుకున్నట్టుగా పోలీసుల దర్యాప్తులో స్పష్టమైంది. ఈ కేసులో సూత్రధారి, పాత్రధారి, బాధితుడు, చివరకు నిందితుడిగా కూడా విక్రంగౌడే కావడం

మిగతా 9లో

టిడిపికి శిల్పా గుడ్‌బై

- నేడు వైసిపిలో చేరిక
- నంద్యాలలో కీలక పరిణామం..

ప్రజాశక్తి – నంద్యాల/ అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అధికార తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి షాకిచ్చారు. టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమను కొద్దికాలంగా టిడిపి నేతలు అవమానిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇంతవరకు టిడిపిలోకి వెళ్లిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తే తానూ ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఆయన సోదరుడు మోహన్‌రెడ్డి వైసిపి అభ్యర్థిగా నంద్యాల ఉప ఎన్నికల బరిలో దిగిన నేపథ్యంలో చక్రపాణిరెడ్డి రాజీనామా చేయడం టిడిపిని రాజకీయంగా ఒక కుదుపు కుదిపింది. వెంటనే సిఎం నేరుగా రంగంలోకి దిగారు. జిల్లా నాయకత్వంతో మాట్లాడారు. చక్రపాణి రాజీనామా వ్యవహారం ఎన్నికలపై పడకుండా చూడాలని ఆదేశించారు. ఈ పరిణామంపై ఇన్‌ఛార్జి మంత్రి కాలువ శ్రీనివాసులు, ఎంపి రమేష్‌పైనా సిఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీకి రాజీనామా అనంతరం ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, రాజీనామ లేఖను



జేబులో పెట్టుకొని తిరుగుతున్నా నని తెలిపారు. అయితే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తే, అంతా కలిసి ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ చేశారు. శిల్పా చక్రపాణిరెడ్డి సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి ఇటీవల వైసిపిలో చేరి ఆ పార్టీ నంద్యాల అభ్యర్థిగా బరిలో నిలిచిన విషయం తెలిసిందే. సోదరుడు వైసిపిలో చేరినా బంధుత్వం వేరు, రాజకీయాలు వేరు టిడిపిలోనే ఉంటానని శిల్పా చక్రపాణిరెడ్డి ప్రకటించినా పార్టీ నుంచి సరైన ఆదరణ లేకపోవడంతో ఆయన టిడిపిని వీడేందుకు నిర్ణయించుకున్నారు. శిల్పా వైసిపిలోకి వెళ్లకుండా నివారించేందుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్ చేసిన యత్నాలు ఫలించలేదు. శిల్పా మోహన్‌రెడ్డి స్వయంగా శిల్పాచక్రపాణిరెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు

మిగతా 9లో

ఇలా ఎందుకు జరిగింది : బాబు

నంద్యాలలో టిడిపి ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణి రెడ్డి రాజీనామా చేయడంతో నంద్యాల ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉందని జిల్లా టిడిపి నాయకత్వంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చక్రపాణిరెడ్డి రాజీనామాపై బుధవారం కర్నూలు జిల్లా నేతలతో సిఎం నేరుగా మాట్లాడారు. నాయకత్వం దీనిపై ఒకసారి ఆలోచించాలని, చక్రపాణిరెడ్డి పార్టీని వీడటం మంచి పరిణామం కాదని అన్నట్లు సమాచారం. ముఖ్యంగా జిల్లా నాయకత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంపైనా సిఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన తరువాత ఆయన్ను కలుపుకొనిపో వడం వెనుక కారణాలు ఏమిటో వెంటనే తెలపా లని ఆదేశించారు. చక్రపాణిరెడ్డి కూడా చంద్ర బాబుతో తనకు విభేదాలు లేవని, పార్టీ స్థానిక నాయకత్వం అవమానించిందని రాజీనామా అనంతరం విలేకరుల సమావేశంలో తెలిపారు. గతంలో కర్నూలు జిల్లాలో

మిగతా 9లో



విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

10న విద్యా సంస్థల బంద్

- సమస్యలు పరిష్కరించాలని విదార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఆగస్టు పదో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థులకు ఆయా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఎంబివికెలో బుధవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహ్మద్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర

మిగతా 9లో

ప్రకాశంలో కరువు తాండవం

- ఎండిపోతున్న బోర్లు..
- అడుగంటిన తాగునీటి చెరువులు..
- రెండో ఏడాదీ కూడా ప్రశ్నార్థకమే!
- సాగర్ జలాలపైనే రైతుల ఆశలు

పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పల్లెసీమలు కళావిహీనంగా మారాయి. అన్నదాత ముంగిట హరిత చందనం పండాల్సి ఉండగా ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. చిరుదరహాసంతో ఉత్సాహంగా ఉండాల్సిన రైతు బిక్కుబిక్కుమంటున్నాడు. నిండుకుండల్లా పొంగి పొర్లాల్సిన వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి. చినుకు జాడలేక వ్యవసాయ బోర్లు, చెరువులు నెర్రెలిస్తున్నాయి. ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఇవే పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. వరుస కరువుతో రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. సాగు కోసం ఖర్చయిన రూ.600 కోట్లు చేజారాయి. దిగుబడులూ పతనమయ్యాయి.

3



ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చాకిరాలలోని వెంకటేశ్వరరెడ్డికి చెందిన ఏడెకరాలు బత్తాయి తోట ఇది

ప్రజ్ఞ

1. డిజిటల్ ఎవల్యూషన్ సూచిలో భారత్ స్థానం ఎంత?
2. 2024 ఒలంపిక్స్‌కు ఆతిథ్యమిస్తున్న నగరం ఏది?
3. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో భారత్ బాక్సర్ విజేందర్‌తో పోటీ పడనున్న చైనా క్రీడాకారుడు ఎవరు?
4. ఇటీవల మృతిచెందిన శాస్త్రవేత్త పి.ఎం భార్గవ ఏ రంగంలో పరిశోధనలు చేశారు?
5. నీతిఆయోగ్ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసిందెవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వాతావరణం

ఉత్తర కోస్తాలో వర్షాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణం కేంద్ర అధికారులు వెల్లడించారు. రుతుపవనాలు క్రియాశీలకంగా లేనందున ఎపి, తెలంగాణలో పెద్దగా వర్షాలు పడడం లేదని తెలిపారు. నార్త్ ఈస్టర్స్ రీజియన్‌లోనూ, ఒడిశా, బీహార్‌లోనూ వర్షాలు ఒక మోస్తరుగా కురిసే అవకాశాలున్నాయన్నారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఆయా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగాయని వివరించారు.

అమరావతి కేంద్రంగా సిఐడి కార్యకలాపాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంతవరకు ఉమ్మడి రాజధాని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) ఇకపై ఎపి రాజధాని అమరావతి కేంద్రంగా విధులు నిర్వహించనున్నది. ఈమేరకు బుధవారం జీవో ఎంఎస్ నంబరు129 విడుదలైంది. అగ్రిగోల్డ్, అభయగోల్డ్ వంటి సంస్థల కేసులతో పాటు, అసెంబ్లీ లీకేజ్ వ్యవహారాన్నీ సిఐడి దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే. సిఐడి అధికారులు ఇకనైనా వేగవంతంగా పనిచేసి, తమకు ఉపశమనం కల్గించాలని ఆర్థిక సంస్థల్లో నష్టపోయిన బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కరువు రహిత రాష్ట్రమే లక్ష్యం

మంత్రి సుజయ కృష్ణ రంగారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరువు రహిత రాష్ట్రమే లక్ష్యంగా టిడిపి ప్రభుత్వం ముందుకెళుతోందని మంత్రి సుజయ కృష్ణ రంగారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరువును ఎదుర్కొనేందుకు అక్టోబరులోగా రాష్ట్ర వ్యాప్తంగా 28 ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో 13 ప్రాజెక్టులు రాయలసీమకు చెందినవే ఉన్నాయని తెలిపారు. పట్టిసీమను వ్యతిరేకించిన ప్రతిపక్షాలు ఇప్పుడు పట్టిసీమ తమ వల్లే వచ్చిందని చెప్పుకోవడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కరువు జిల్లాల రైతులకు 2016లో రూ.1608.06 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ, రూ.534.22 కోట్లు క్రాప్ ఇన్సూరెన్స్‌ను ఆధార్ లింకేజ్ ఖాతాలకు నేరుగా వారి బదిలీ చేశారన్నారు.

గుర్తింపు కార్డుంటేనే ఆర్టీసి బస్సుల్లో పిల్లలకు రాయితీ


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే పిల్లలకు ప్రస్తుతం అందిస్తున్న రాయితీ టికెట్టు పొందేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి చేసినట్లు ఎపిఎస్‌ఆర్టీసి ఇడి జయరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులు ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని, ఐదు నుంచి పన్నెండేళ్ల లోపు చిన్నారులకు ఎసి బస్సుల్లో 25 శాతం, ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీ అందిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లల టికెట్ల విషయంలో తలెత్తుతున్న సమస్యల్ని అధిగమించేందు ఈ నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. ప్రయాణించేటప్పుడు చిన్నారుల పుట్టిన తేదీని తెలిపే ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, బస్సు పాసుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పని సరిగా చూపించాలన్నారు.

మూడేళ్లలో రూ. 30 వేల కోట్లు

- ఏడు మార్గాల్లో నిధుల సమీకరణ
- బెజవాడలో లైట్ మెట్రో రైల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధానిలో సదుపాయాల కల్పనకు రానున్న మూడేళ్లలో రూ.30 వేల కోట్లు అవసపరం అవుతాయని అంచనా వేస్తున్నామని, దీంట్లో లోటుగా ఉన్న రూ.7300 కోట్లు సమకూర్చుకునేందుకు సన్నద్ధం అవుతున్నామని సిఆర్‌డిఏ సిఎంకు నివేదిక సమర్పించింది. రాజధాని అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిధుల సమీకరణకు పలు అంశాలను సిఆర్‌డిఏ అధికారులు సిఎంకు వివరించారు. హడ్కో ద్వారా రూ.7500 కోట్లు, బహుళ సంస్థల ద్వారా రూ.3200 కోట్లు, కేంద్ర ప్రభుత్వగ్రాంటుగా రూ. 2500, స్మార్ట్‌సిటీ నిధులు రూ.100 కోట్లు, విట్, ఎస్‌ఆర్ఎం వంటి సంస్థలకు భూముల అందజేత ద్వారా రూ.400 కోట్లు సమకూరాయని తెలిపారు.

ఇవిగాక రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు రూ.3800 కోట్లు, మొత్తం రూ.22,700 కోట్లు వచ్చాయని మరో రూ.7300 కోట్లు కోసం అన్వేషిస్తున్నామని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏడు రకాల మార్గాల్లో ఈ నిధుల సమీకరణ కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ అధికారుల ఇంటి అద్దె భత్యం ద్వారా సమకూరేనిధుల ప్రాతిపదికగా తీసుకొచ్చే స్ట్రక్చరల్ బాండ్లు రూ.1000 కోట్లు, పిపిపి పద్ధతిలో సమకూర్చుకునే రూ.1600 కోట్లు, అదనపు బడ్జెట్ కేటాయింపులు రూ.1500 మొత్తం కలిపి రూ.7600 కోట్లు ఉంటాయని తెలిపారు.

ఇవి గాక కలెక్టివ్ ఇన్వెస్టుమెంట్లు స్కీమ్ కింద రూ.2000 కోట్లు, కన్వర్టబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.500 కోట్లు, మసాలా బాండ్ల ద్వారా రూ.1000 కోట్లు చొప్పున మరో రూ.3500 కోట్లు సమకూర్చుకునే వీలుందని తెలిపారు. తొలి 11 ఏళ్లకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏటా రూ.1500 కోట్లు మేర బడ్జెట్ కేటాయింపులు అవసరమని తెలిపారు. న్యాయమూర్తులు, శాసనసభ్యులు, ఉభయ సభల అధిపతులు, మంత్రులు, అఖిలభారత సర్వీసు అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల నివాసం భవంతులపై సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన న్యాయమూర్తికి 8550 చదరపు అడుగులు, డిజిపికి 5000 నుండి 8000 చదరపు అడుగుల మేర ఉండాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల నివాస భవనాల సముదాయం కూడా సిఎం నివాస సముదాయంలో భాగంగా ఉండాలని ప్రతిపాదించారు.

కిలోమీటరుకు రూ.164 కోట్లు

విజయవాడ నగరంలో రెండు ప్రధాన రహదారుల్లో లైట్‌మెట్రో రైలు నిర్మించాలని నిర్ణయించారు. మెట్రోరైలు నిర్మాణంలో ఉన్న ప్రతికూల, అనుకూల అంశాలపై జర్మనీకి చెందిన ప్రజా రవాణా రంగ నిపుణులు ఎడ్వర్డ్ డాట్సన్ రెండు వారాలుగా సర్వే నిర్వహించి వివరాలను సమీక్షలో సమర్పించారు. లైట్‌మెట్రోరైల్ ఏర్పాటుకు రూ.4273 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. లైట్‌మెట్రోలో ఆరుకోచ్‌లు ఉంటాయి. కిలోమీటరుకు రూ.164 కోట్ల వ్యయం ఖర్చవుతుందని నిర్ణయించారు. రానున్న కాలంలో దీన్ని విమానాశ్రయం వరకూ పొడిగించే వీలుగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. లైట్‌మెట్రో వల్ల రూ.600 కోట్ల విలువైన రూ.60 ఎకరాల భూ సమీకరణ భారం తగ్గుతుందని అంచనా వేశారు. కేంద్రం కూడా లైట్‌మెట్రోకు అంగీకరిస్తుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలనకు డ్రోన్లు

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ఎన్టీర్ నగర్-పిఎంఎవై పథకం కింద నిర్మిస్తున్న పేదల గృహ సముదాయాలను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పక్షం రోజులకు ఒక పర్యాయం డ్రోన్ కెమెరాలతో గృహ సముదాయాల పనుల పురోగతిని చిత్రీకరించి, తనకు వివరించాలని సూచించారు. పురపాలక-పట్టణాభివృద్ధి శాఖపై సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల తుది జాబితాను సత్వరమే రూపొందించాలన్నారు.

ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలను అందజేయాలన్నారు. గృహ సముదాయాల పనులు ప్రారంభించిన పట్టణాలో పనుల పురోగతి, మిగిలిన చోట్ల ఎప్పుడు ప్రారంభించే విషయాన్ని అధికారులు సిఎంకు వివరించారు. క్రిడా పరిధిలో మొత్తం 5,024 ఇళ్ల నిర్మాణాన్ని కెఎంవి ప్రాజెక్టు సంస్థ చేపట్టిందని తెలిపారు. ప్రకాశం జిల్లా దొనకొండలో కన్‌స్ట్రక్షన్ సిటీని నిర్మిస్తున్నామని, అక్కడ నిర్మాణ రంగానికి సంబంధించి అవసరమైన సకల సామగ్రి అందుబాటులోకి తెస్తామని సిఎం చెప్పారు. ఇది పూర్తయితే గృహ నిర్మాణ రంగానికి మరింత ఊతం లభిస్తుందన్నారు. గృహ సముదాయాల్లో నాణ్యతను పరిశీలించేందుకు, పనుల పర్యవేక్షణకు నియమించిన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ వారం, వారం నివేదిక సమర్పించాలన్నారు. అంగన్వాడీల ప్రీ స్కూళ్లలో బోధనకు అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల సంఖ్య 10 శాతం, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల సంఖ్య 7.5 శాతం పెరిగిందని అధికారులు సిఎంకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినప్పటికీ తప్పనిసరి చేయరాదని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాలలో 45 రోజుల్లో వీధి కుక్కలు, పందుల నియంత్రణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పందుల పెంపకంపై ఆధారపడి ఉన్న 4,752 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపాలని ఆదేశించారు. పోస్టర్లు, ప్లెక్సీలు, బ్యానర్లు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేయకుండా ప్రత్యేక ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు పాదయాత్రకు సిద్ధమైన ముద్రగడ

మరోసారి బలగాల మోహరింపు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం గురువారం నుంచి పాదయాత్ర ప్రారంభించ డానికి సిద్ధమయ్యారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముద్రగడ గత నెల 26న ప్రారంభించాల నుకున్న పాదయాత్రకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకుని ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలకు గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. దీంతో గురువారం పాదయాత్ర మొదలు పెడతామని కాపు జెఎసి, ముద్రగడ ప్రకటించారు. నిన్నటివరకూ బల గాలను వెనక్కి పంపిన పోలీసులు మళ్లీ కిర్లంపూడిలో మళ్లీ బలగాలను మోహరి స్తున్నారు. ఇప్పటికే రెండు బస్సులతో పోలీసులు తరలివ చ్చారు. పాదయాత్రకు పోలీసులు అనుమతించని పక్షంలో ముద్రగడ ఇంటికే పరిమితమయ్యే అవకాశా లున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేసేందుకు కాపు నేతలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 31 వరకూ జిల్లాలో సెక్షన్ 30 అమలులో ఉంటుందని ఎస్‌పి విశాల్ గున్నీ ప్రకటించారు. జిల్లాలో ధర్నాలు, నిరసనలు, బహిరంగ సభలు తమ అనుమతి లేకుండా పెట్టకూడదని పేర్కొన్నారు.

సిఎంకు వినిపించేవి సింగపూర్ మాటలే

- రాజేంద్రసింగ్ వ్యాఖ్య
- కృష్ణా తీర పరిరక్షణ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సింగపూర్ మాటలే వినపడుతున్నాయని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్ వ్యాఖ్యానించారు. విజయవాడ కనక దుర్గఘాట్ వద్ద కృష్ణా నది పరిరక్షణ, పరిశీలన యాత్ర బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రసింగ్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎవరూ చెప్పినా వినడం లేదని, జగ్గీవాసుదేవ్ చెబితే వింటారేమో చూడాలని అన్నారు. అమరావతిలో కృష్ణానదిని ఆక్రమించి అనేక నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించాలని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా కృష్ణానది పరివాహక చట్టాన్ని ఉల్లంఘించి నిర్మించిన అక్రమ నిర్మాణంలోనే ఉంటున్నారని స్పష్టం చేశారు. నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనా, ప్రభుత్వాలపైనా ఉందని సూచించారు. చంద్రబాబుకు మాత్రం అవేమీ పట్టడం లేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరువల్ల బోరుల్లో నీరూ కూడా కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు సింగపూర్ చుట్టూ తిరుగుతున్నారని, ఆ దేశం మాటలే వింటున్నారని తెలిపారు. అక్కడి ప్రజలు గాల్లో ప్రయాణాలు చేస్తారని, భారతదేశ ప్రజలు ఇప్పటికీ భూమినే నమ్ముకుని ఉన్నారని విశ్లేషించారు. నిపుణులు విక్రం సోనీ మాట్లాడుతూ అత్యంత విలువైన నీటి వనరులున్న భూములను రాతి నిర్మాణాలు చేపట్టడానికి కేటాయించడం అత్యంత ప్రమాదకమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ నదీ పరిరక్షణ చట్టాన్ని ఉల్లంఘించి నిర్మించిన భవనంలో చంద్రబాబు నివాసం ఉంటున్నారని, బిజెపి ఎంపి గోకరాజు గంగరాజు కూడా అదే తరహాలో నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మించారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చట్టాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని ఉల్లంఘిస్తోందని విమర్శించారు. అడిగిన వారిపై కేసులు నమోదు చేయిస్తోందని తెలిపారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటి వనరులను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

పచ్చని పంటలు పండే భూములు రాజధానికి తీసుకున్నారని, ఇందువల్ల ఆహార సమస్య వస్తుందని చెప్పినా వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు వక్తలను రాజధాని పరిక్షణ సమితి నాయకులు అనుమోలు గాంధీ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పి.వి.రాజగోపాల్, బొలిశెట్టి సత్యనారాయణ, దూశర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కనకదుర్గా ఘాట్ నుండి బయలుదేరిన యాత్ర అవనిగడ్డ మీదుగా గుంటూరు జిల్లాలో ప్రవేశించింది.

కాన్వాయ్‌లతో కష్టాలు

- ఇరుకు రోడ్లలో ఇబ్బందుల పర్వం
- లోకేష్ కాన్వాయ్‌కీ ట్రాఫిక్ ఆంక్షలే
- కరకట్ట రోడ్లపై ప్రజల కందగండ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి అమరావతి పరిధిలో రాజువెడలె రవి తేజములలరగ.. అన్నట్లు మంత్రులు, అధికారుల కార్ల కాన్వాయ్‌లు జనాలను కకావికలం చేస్తున్నాయి. ఒకటీ అరా కాదు.. అర్హత లేని వారూ కాన్వాయ్‌లపై మోజు చూపిస్తుండడంతో రోడ్లపై వాహనాల వరుసలు బెంబేలెత్తిస్తున్నాయి. ఎక్కువ ఇరుకు రోడ్లున్న విజయవాడ నగరం సహా సచివాలయం ఉన్న వెలగపూడికి వెళ్లే రహదారులన్నీ కాన్వాయ్‌ల సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల ప్రజలైతే కాన్వాయ్ వస్తోందంటేనే భయబ్రాంతులవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో కేవలం ముఖ్యమంత్రి, గవర్నర్ కాన్వాయ్‌లు తిరిగే సమయంలో మాత్రమే ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తారు. కానీ అమరావతి కొత్త రాష్ట్రంలో మాత్రం ముఖ్యమంత్రి కాన్వాయ్‌కే కాదు.. ఉప ముఖ్యమంత్రులు, డిజిపి వంటి ఉన్నత స్థాయి అధికారుల కాన్వాయ్‌లు తిరిగే సమయంలో కూడా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. తాజాగా మంత్రి లోకేష్ కాన్వాయ్ పేరిట కూడా ఆంక్షలు విధిస్తున్నారు. ఈ ఆంక్షల వల్ల విజయవాడ నుంచి వెలగపూడికి వెళ్లే కట్ట రోడ్డుపై ప్రజలు తరచు తమ రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కాన్వాయ్‌లు వెళ్లే సమయంలో దాదాపు ఐదారు కిలోమీటర్లకుపైగా వాహనాలు నిలిపివేస్తున్నారు. కట్టపైకి కాన్వాయ్ వస్తోందంటే చాలు.. ఇటు ప్రకాశం బ్యారేజి సమీపంలో అటు మంతెన ఆశ్రమం సమీపంలోను ఇతర వాహనాలను ఆపేస్తున్నారు. రెండో వైపు మందడం వద్ద అమరావతి వైపు వెళ్లే రోడ్డు వద్ద, వెలగపూడి సచివాలయం వద్దా ట్రాఫిక్ ఆపేస్తుండటం పరిపాటైంది. ఇది ఒక సమస్య అయితే... ట్రాఫిక్ ఆపివేసిన తరువాత ఎంతోసేపటికి గానీ కాన్వాయ్ రాకపోవడంతో, నిలిచిపోయిన ఇతర వాహనాల్లోని జనం అసహనానికి గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో 20 నుంచి 30 నిముషాల వరకు వారు మార్గమధ్యలో ఆగిపోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

లెక్కకు మించిన వాహనాలు

కాన్వాయ్ అంటే నిర్దిష్టంగా వాహనాలు ఉండాలి. ఏ వాహనం ఏ వరుస సంఖ్యలో ప్రయాణించాలన్నది కూడా సెక్యూరిటీ అధికారులు ముందే ఖరారు చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి కాన్వాయ్‌ల్లో మాత్రం పెద్ద సంఖ్యలో ప్రయివేటు నేతల వాహనాలూ చొరబడుతున్నాయి. ఇటీవల లోకేష్ వాహన శ్రేణిలో 20కి పైగా వాహనాలు కనిపించడం, అవన్నీ వెళ్లేంతవరకు ఇతర వాహనాలను రోడ్డు పక్కన ఆపేయడం తో పలువురు ఇబ్బంది పడ్డారు.

రైతుపై పోలీసుల దౌర్జన్యం

టిడిపి కార్యకర్తల నిరసన

వెంకటపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం కాన్వాయ్ వస్తుందనే పేరుతో పోలీసులు పెద్దఎత్తున హంగామా సృష్టించారు. గ్రామంలో ఓ రైతుపై చేయి చేసుకున్నారు. దీంతో గ్రామస్తులు ఎదురుతిరిగారు. రోడ్డుపై ట్రాక్టర్ ట్రక్కు అడ్డంగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సిఎం కాన్వాయ్ వస్తుందనే పేరుతో గ్రామంలో ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాల్జేస్తున్నారని, కాన్వాయ్ వచ్చే గంట ముందు నుండి గ్రామంలో ప్రజలను కదలనివ్వడం లేదని రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం వెంకటపాలానికి చెందిన రైతు ఉన్నం శంకర్ పొలం నుండి వెళుతుండగా సిఎం భద్రతా విధుల్లో ఉన్న ఎస్ఐ ఆయన్ను పక్కకు పోవాలంటూ దూషించాడు. తాను వెళుతున్నానని శంకర్ చెప్పడంతో ఎదురు చెబుతావా అంటూ చేయి చేసుకున్నాడు. చొక్కా పట్టుకుని కొట్టాడు. శంకర్ స్థానికంగా వెంకటపాలెంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కూడా అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. అదే సమయంలో సిఎం కాన్వాయ్ వస్తుందనే సమాచారంతో పోలీసు ఉన్నతాధికారులు నానా హైరానా పడ్డారు. వెంటనే తుళ్లూరు సిఐ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులకు సర్దిచెప్పారు. రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కును పక్కనపెట్టించారు. అయితే చేయి చేసుకున్న ఎస్ఐ వచ్చి క్షమాపణ చెప్పేదాకా తాము ఆందోళన విరమించబోమని రోడ్డుపైనే బైఠాయించారు. పోలీసు ఉన్నతాధికారులొచ్చి వారికి సర్దిచెప్పి నిరసన విరమింపజేశారు.

సెప్టెంబరు 15 వరకు ప్రత్యేక ప్రజాసాధికార సర్వే

- మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజా సాధికార సర్వే ద్వారా నమోదు కాకుండా మిగిలి ఉన్న 5.90 లక్షల మంది కోసం సెప్టెంబరు 15 వరకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడించారు. సర్వే ప్రగతిపై వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని సర్వేలో నమోదు చేసేలా అన్ని జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. నమోదు కోసం ప్రతి మండలం, మున్సిపల్ కేంద్రాల్లో ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు నోడల్ అధికారులుగా సర్వే ప్రక్రియను వేగవంతం చేసి జాబితా పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. త్వరలోనే కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. చంద్రన్న బీమాకు కూడా ప్రత్యేక డ్రైవ్‌లో నమోదు చేయాలని కార్మిక శాఖ అధికారుల్ని ఆదేశించారు. ప్రజాసాధికార సర్వేపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సిన అవసరముందని సిసిఎల్ఎ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు. సర్వే పూర్తి చేయాల్సిన అంశాల్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎపి ఫైబర్ గ్రిడ్ సిఇఒ బాబు.ఎ వివరించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ వర ప్రసాద్, రెవిన్యూ శాఖ అదనపు కార్యదర్శి జగన్నాథం, పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగు లోటు 18 శాతం

- నూనెగింజలు సగమే
- అనంతపురం, కర్నూలులో వేరుశనగకు గడ్డు
- వ్యవసాయశాఖ తాజా నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సాగు కావాల్సిన పంటల విస్తీర్ణంలో 3.77 లక్షల హెక్టార్లు తగ్గింది. రెండు మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించినప్పటి కంటే బుధవారానికి సాగు మరింత తగ్గింది. సాధారణంగా ఖరీఫ్ సీజను జూన్ రెండో వారం నుంచి మొదలవుతుంది. ఇప్పటికి నెలన్నర గడిచిపోయింది. అయినా పంటల సాగు ఊపందుకోకపోగా ఇప్పటికి సాగు కావాల్సిన దాని కంటే కూడా తగ్గింది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఖరీఫ్‌లో అన్ని పంటలూ కలుపుకొని 42.07 లక్షల హెక్టార్లలో సాగు చేయించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్ణయించింది. ఆగస్టు 2 నాటికి 21.31 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా 17.54 లక్షల హెక్టార్లలోనే సాగయ్యాయి. లోటు 18 శాతం.వరి, మొక్కజొన్న, మినుము, పత్తి పంటల సాగు ఆశాజనకంగా ఉండగా తతిమ్మా అన్ని పంటల సాగులోనూ లోటు కనిపిస్తోంది. ముఖ్యంగా నూనెగింజల సేద్యం సగానికి పడిపోయింది. అందులో వేరుశనగ వాటాయే అధికం. వేరుశనగ ఎక్కువగా సాగయ్యే అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో వర్షాభావం నెలకొనడంతో ఆ ప్రభావం నూనెగింజల సాగుపై పడింది. రాష్ట్ర వ్యాప్తంగా నూనెగింజల సాగు 49 శాతం తగ్గింది. అనంతపురంలో వేరుశనగ 37 శాతమే సాగైంది. ఆగస్టు రెండో వారం వరకు వేరుశనగ వేయడానికి సమయం ఉందని చెబుతున్నా అప్పటిక్కూడా వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో ఈ ఏడాది వేరుశనగపై ఆశలు వదులుకున్నట్లేనన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. కాగా తొలకరి వానలకు అనంతపురం, కర్నూలులో సాగు చేసిన వేరుశనగ ఎండిపోతోంది. కర్నూలులో పత్తి, మొక్కజొన్న, మినుము పంటలు ఎండుముఖం పట్టాయి.

అబద్ధాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

అసెంబ్లీ సీట్లపై కేంద్రం నిర్ణయంతో టిడిపిలో ప్రకంపనలు

వైఎస్ఆర్ సిపి అధికార ప్రతినిధి తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోసం, అబద్ధాలకు చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్ఆర్ సిపి అధికార ప్రతినిధి తమ్మినేని సీతారాం అన్నారు. 21 మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించకుండా చంద్రబాబు అనైతిక రాజకీయాలకు పాల్పడుతుంటే, జగన్ మాత్రం తన వద్దకు వస్తున్న టిడిపి ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డితో రాజీనామా చేయించిన తరువాతే పార్టీలో చేర్చుకుంటున్నారన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన నియోజకవర్గాల పెంపుపై కేంద్రం స్పష్టత ఇవ్వడంతో టిడిపిలో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. అసెంబ్లీ సీట్ల పెంపు కోసం ముఖ్యమంత్రి ఏకంగా రాష్ట్ర ప్రయోజనాలనే తాకట్టు పెట్టారన్నారు. సీట్లు పెంచితే చాలు హోదా ఇవ్వక పోయినా పర్వాలేదన్నట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. సీట్ల పెంపు ఆశ చూపించే 21మంది వైసిపి ఎమ్మెల్యేలను తనవైపుకు తిప్పుకున్నారన్నారు. పార్టీ విధానాలు నచ్చకపోతే పార్టీ మారే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే ఆ పార్టీ సభ్యత్వంతో పాటు పదవులకు రాజీనామా చేశాకే బయటకు రావాలన్నారు. ఇప్పటికైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు బాబును నిలదీయాలన్నారు. ఎన్నికల్లో గెలవలేక అడ్డదారిలో మంత్రి అయిన లోకేష్ రెండో పులకేసిలా తయారయ్యారని తమ్మినేని ఎద్దేవా చేశారు. ఉద్యోగుల పదవీ కాలాన్ని 60 ఏళ్లు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఫెర్ఫామెన్స్ పేరుతో ఉద్యోగాల నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టారన్నారు. బాబు, లోకేష్‌లకు ప్రచార పిచ్చి తారా స్థాయికి చేరుకుందన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల్ని వెంటనే సవరించాలి

ఐదేళ్లకోసారి వేతన సవరణ జరగడంలేదు

కార్మిక శాఖ కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే సవరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంఎ గఫూర్ బుధవారం కార్మిక శాఖ కమిషనర్ డి వరప్రసాద్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను 2017 జనవరి నుంచి సవరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఐదేళ్లకోసారి వేతన సవరణ జరగాలన్నారు. 2017 జనవరితో జివో 11 కాలపరిమితి ముగిసిందని, అప్పట్నించి కొత్త వేతనాలు అమలు చేయాలని, కానీ అలా జరగడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సవరించాలని, సవరించిన వేతనాలు 2017 జనవరి నుంచి అమలు చేయాలని ఆయన కోరారు. జివో నెంబర్ 11లో కార్మిక శాఖ నిర్ణయించిన వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని, 2017 ఏప్రిల్ 1 నుంచి విడిఏతో కలిపి ఇప్పటికి అన్‌స్కిల్డ్ కార్మికునికి నెలకు రూ. 8,054.90 మాత్రమే చెల్లిసున్నారని పేర్కొన్నారు. కార్మిక సంఘాలు చాలా కాలం నుంచి కోరుతున్న విధంగా కింది స్థాయి కార్మికుల (అన్‌స్కిల్డ్/అటెండర్) కనీస వేతనాన్ని రూ. 18వేలుగా నిర్ణయించాలని, ఆపై స్థాయి కార్మికులకు తదనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. అదేవిధంగా విడిఎను రూ. 10.50ను కనీస స్థాయిలో పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యామ్నాయ కూటమి అవసరం

ప్రపంచ బ్యాంక్ షరతులతోనే గ్యాస్ సబ్సిడీ రద్దు

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి అవసరమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. కలసి వచ్చే లౌకిక శక్తులతోపాటు ఇతర రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నాలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ షరతులను ఒకప్పుడు వ్యతిరేకించిన బిజెపి నేడు అదే ఆదేశాల మేరకు గ్యాస్ సబ్సీడీని రద్దు చేసిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా కబేళాలను తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకే మతోన్మాదాన్ని పురిగొల్పుతోందన్నారు. కేరళలలో కమ్యూనిస్టులు, ఆర్ఎస్ఎస్ మధ్య నెలకొన్న చిన్న ఘర్షణపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జోక్యం చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. రెండు రాష్ట్రాల్లోనూ అధికారం కోసం పోట్లాడుకునే అధికార, ప్రతిపక్ష పార్టీలు, కేంద్రస్థాయిలో ఒకే చెంతకు చేరటం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయంగా టిడిపితో రాజీ పడతారని తాను భావించటంలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ పాల్గొన్నారు.

టిడిసిని విశాఖకు కేటాయించడం పట్ల మంత్రి శిద్ధా హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ సెంటర్ (టిడిసి)ని కేంద్రం విశాఖపట్నంకు కేటాయించడం పట్ల పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక, అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సెంటర్‌ను రాష్ట్రానికి కేటాయించినందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు, సహాయ మంత్రి సుజనా చౌదరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కేంద్రాలు దేశంలో పంజాబ్, గుజరాత్, కర్నాటకలో మాత్రమే ఉన్నాయన్నారు. గతంలో దీని కోసం ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. దీని నిర్మాణానికి కావలసిన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుండగా, నిర్మాణ బాధ్యతలను కేంద్రం చేపట్టనుందన్నారు. మొదటి విడతగా రూ. 25 కోట్లు విడుదల చేసిందన్నారు. తక్కువ సాంకేతిక వ్యయంతో స్కిల్ డెవలప్‌మెంట్, సోలార్, విండ్ పవర్, వాటర్ హార్వెస్టింగ్ టెక్నాలజీ వంటి సాంకేతిక అంశాలకు చెందిన ప్రదర్శనలు ఈ సెంటర్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ప్రకాశంలో కరువు తాండవం

పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పల్లెసీమలు కళావిహీనంగా మారాయి. అన్నదాత ముంగిట హరిత చందనం పండాల్సి ఉండగా ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. చిరుదరహాసంతో ఉత్సాహంగా ఉండాల్సిన రైతు బిక్కుబిక్కుమంటున్నాడు. నిండుకుండల్లా పొంగి పొర్లాల్సిన వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి. చినుకు జాడలేక వ్యవసాయ బోర్లు, చెరువులు నెర్రెలిస్తున్నాయి. ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఇవే పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. వరుస కరువుతో రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. సాగు కోసం ఖర్చయిన రూ.600 కోట్లు చేజారాయి. దిగుబడులూ పతనమయ్యాయి.


ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ఎండిపోతున్న సజ్జ పంట

- ఎండిపోతున్న బోర్లు..
- అడుగంటిన తాగునీటి చెరువులు..
- రెండో ఏడాదీ ఖరీఫ్‌లో పంటలు ప్రశ్నార్థకం
- గతేడాది రైతులు కోల్పోయిన పెట్టుబడి రూ.600 కోట్లుపైనే
- బోర్ల కోసం వెచ్చిస్తున్న సొమ్ము రూ.200 కోట్లకుపైనే

ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి

జిల్లాలో గతేడాది 1.73 లక్షల టన్నుల వరి, 2.42 లక్షల టన్నుల ఆహారధాన్యాల దిగుబడి తగ్గింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దిగుబడులపైనే ఆధారపడాల్సి వచ్చింది. కరువు సహాయక చర్యలను చేపట్టాల్సిన ప్రభుత్వం మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. రెండు పర్యాయాలు కేంద్ర బృందం జిల్లాకు వచ్చినప్పటికీ ఏ సాయమూ అందలేదు. కేటాయించిన సాయం ఖజానాలోనే మూలుగుతోంది.

కనిపించని వాన జాడ

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో మాత్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 58 మిల్లీమీటర్లు కాగా గతేడాది 96.7 మి.మీ కురవగా, ఈ ఏడాది 85.7 మిల్లీ మీటర్లు నమోదైంది. జులైలో సాధారణ వర్షపాతం 72.3 మిల్లీ మీటర్లు కాగా, గతేడాది 23.4 మి.మీ, ఈ ఏడాది 52.1 మిల్లీమీటర్లుగా నమోదైంది. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెల కొన్నాయి.

అక్కరకు రాని నీరు-చెట్టు పథకం

ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి చేపట్టిన నీరు-చెట్టు పథకం కరువులో అక్కరకు రాలేదు. చెరువుల్లో మట్టి తీశారు. వర్షాల్లేక అవి నిండలేదు. ఈ పథకం ప్రస్తుతానికి మాత్రం టిడిపి నేతలకు ఉపయోగపడింది. మట్టి తీసి అమ్ముకున్నారు. ఈ ఏడాది 3,241 పనులు చేపట్టారు. వీటి విలువ రూ.201.16 కోట్లు. ఈ స్థాయిలో వెలుగొండ ప్రాజెక్టుకూ ఖర్చు చేయలేదు. వీటిల్లో ఇప్పటి వరకూ 2000 పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు ఇంకా జరుగు తున్నాయి. వర్షాలు కురిటస్తే ఈ పనులు చేయకుం డానే బిల్లులు పొందడం మినహా ఏమీలేదు.

అడుగంటిన భూగర్భజలాలు.. కొత్త బోర్లకు రూ.200 కోట్లు

జిల్లాలో 1.35 లక్షల వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయి వీటిల్లో 59 వేల బోర్లు పైగా ఎండిపోయాయి. వర్షాలు సక్రమంగా కురిస్తే సగటున ఒక్కో బోరు కింద ఐదు లేదా ఆరెకరాలు సాగవుతుంది. ప్రధానంగా వ్యవసాయ బోర్ల కింద పత్తి, మిరప, ఉల్లి వంటి వాణిజ్య పంటలతో పాటు వివిధ కూరగాయాల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఓవైపు వరుసగా కరువు సంభవిస్తున్నా రైతులు ఎన్నో ఆశలతో రూ.లక్షలు ఖర్చు చేసి భగీరథ యత్నం చేస్తున్నారు. కనిగిరి, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గంలో 2010లో 80 నుంచి 120 అడుగులలో భూగర్భజలాలు ఉండగా ఇప్పుడు 600 నుంచి 1000 అడుగులకు భూగర్భ జలాలు చేరాయి. గడిచిన ఐదారు నెలల్లోనే రైతులు బోర్ల కోసం సుమారు రూ.200 కోట్లు వెచ్చించినట్లు సమాచారం.

సాగర్ జలాలే ప్రత్యామ్నాయం

ప్రస్తుతం ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా నీటి కష్టాలు అధికమయ్యాయి. డీప్‌బోర్లు, చేతిపంపులు మరమ్మత్తులకు గురయ్యాయి. సీపీఎస్ స్కీములు మరుగున పడ్డాయి. 36 మండలాల్లోని 425 గ్రామాల్లో 672 ట్యాంకర్ల ద్వారా 3131 ట్రిప్పుల నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు వస్తేనే నీరు లేకుంటే కన్నీరే. ముఖ్యంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నీటి సమస్య అధికంగా ఉంది. ఇక సాగర్ జలాలే ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో నోటిఫైడ్ చెరువులు 231 ఉన్నాయి. నాన్‌నోటిఫైడ్ చెరువులు 60 ఉన్నాయి. వీటిని ఇటీవలే నింపారు. 5 టిఎంసిలు నీరు అవసరం కాగా జిల్లాకు 4.8 టిఎంసిలు కేటాయించారు. జిల్లాకు మాత్రం 2.8 టిఎంసిలు వచ్చింది. ఇపుడు చెరువులు ఖాళీ అవుతున్నాయి. మళ్లీ సాగర్ జలాలు అవసరం ఉంది.

రూ.84 కోట్లు పరిహారం ఖజానాలోనే

రెండేళ్లపాటు రైతులు తీవ్ర కోరల్లో చిక్కి నష్టపోగా వారికి లభించిన పరిహారం మాత్రం స్వల్పంగా లభించింది. మళ్లీ ఈ ఏడాది రైతులు కరువు కోరలకు చేరువవుతున్నారు. 2015లో 26,558 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 33,200 మంది రైతులకు రూ. 33.7 కోట్లు ఇన్‌పుట్ రాయితీ పంపిణీ చేశారు. 2016లో 70,251 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. 84,112 మంది రైతులకు రూ.72.18 కోట్లు పరిహారం విడుదల చేశారు. బీమా కింద కొంత వచ్చింది. మొత్తం రూ.84 కోట్లు ఇపుడు జిల్లాకు వచ్చింది. ఇదంతా ఖజానాలోనే ఉంది. రైతులకు బ్యాంకు ఖాతాల్లో వేసే పని ఇంకా మొదలు కాలేదు

నష్టపరిహారం కోసం తిరిగితిరిగి.. అలసిపోయా



ఉన్న 2.30 ఎకరాల్లో సాగుచేసిన బత్తాయి తోట వర్షాభావంతో ఎండిపోయింది. 230 చెట్లలో 200కుపైగా ఎండిపోయాయి. మూడేళ్లుగా నష్టపరిహారం అందడం లేదు. కలెక్టర్‌ను కలిసినా ప్రయోజనం లేదు. అధికారులచుట్టూ తిరగటం మానుకున్నా. అనారోగ్యంతో కొంతకాలం ఆస్పత్రిలో ఉన్నాను. బత్తాయి చెట్లను నరికేశాను. నిమ్మచెట్లు నాటుకున్నాను. ఉన్న ఒక్క బోరు అడుగంటిపోయింది. ఏమిచేయాలో దిక్కుతోచటం లేదు.

- వెంకటేశ్వరరెడ్డి,చాకిరాల,కనిగిరి మండలం

వ్యాపారం చేసుకుంటూ జీవనం



రెండు ఎకరాల పొలం ఉంది. బోరు ఎండిపోయింది. వేసిన పంటల కూడా ఎండిపోయింది. రూ. 40 వేలు అప్పు మిగిలింది. గత్యంతర లేక ఇంట్లో ఆడవాళ్లు అరకొరగా దొరికే వ్యవసాయ కూలీ పనులకు వెళుతుండగా నేను మాత్రం దానిమ్మ కాయలు కొని యర్రగొండపాలెం ప్రాంతంలో వాటిని అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

- కాయకాకుల అంజి, మూల్యవంతునిపాడు

కరువు పనులే ఆధారం



మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. దానికోసం రూ.60 వేలు పెట్టుబడి రూపంలో ఖర్చు చేశా. ఉన్న రెండు బోర్లు ఎండిపోవడంతో రూ.70 వేల పెట్టుబడితో మరో రెండు కొత్త బోర్లు వేశా. అయినా ప్రయోజనం లేదు. చుక్క నీరూ పడలేదు. వేసిన పత్తిపైరు వాడుముఖం పట్టింది. పంట వస్తుందన్న ఆశలు వదులుకున్నా. గత్యంతరం లేక కుటుంబం మొత్తం ఉపాధి పనులకు పోతున్నాం. ప్రస్తుతం ఆ కూలి డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

- గోసుల సుబ్బరాయుడు, వీరాయిపాలెం

పంట వాడుముఖం పట్టింది



ఉన్న ఐదు ఎకరాల పొలంలో మూడు ఎకరాల్లో పత్తి పంటను వేశా. ఎకరంలో మిర్చి మొక్కలను నాటా. పత్తి పంటకు రూ. 90 వేలు దాకా పెట్టుబడి పెట్టా. మిర్చి పంటకు దుక్కులు, ఎరువులు, మిరప నారు కొనుగోలు, కూలీలు ఇలా మొత్తం కలుపుకొని ఇప్పటికే రూ. 70 వేలు దాటింది. తీరా బోరు నుంచి అరకొరగా నీరు వస్తుంది. పత్తి పంటను వదిలేసి మిరప పంటకు నీరు పెడుతున్నా. ఒకసాలు తడవాలంటేనే రెండు రోజులు పడుతోంది. బోరులో గతుకుతూ నీళ్ళు వస్తున్నాయి. మిర్చి పంట కూడా బతికేలా లేదు. గత ఏడాది అప్పులే తీరలేదు. తిరిగి ఈ ఏడాది అప్పులు బారమయ్యాయి

- మూల శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెం

ఖరీఫ్ సాగు తీరు ఇలా..

ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.28 లక్షల హెక్టార్లు. ఇప్పటివరకు 30 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. వరి పంట 46 వేల హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ప్రస్తుతం 28 వేల హెక్టార్లలో మాత్రమే సాగైంది. సజ్జ 18 వేల హెక్టార్లు కాగా 5,800 హెక్టార్లలో సాగైంది. పెసర 4,500 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం కాగా 1700, మినుములు 5,500లకు గాను 1000, కంది 64 వేలకు గాను 8,600, నువ్వులు 6,700లకు గాను 3 వేలు, పత్తి 58 వేలకు గాను 7 వేలు, మిరప 26,600లకు గాను 300, వేరుశనగ 3 వేలకుగాను 1700 హెక్టార్లలో సాగైంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఇతర పంటల సాగు నామమాత్రంగానే ఉంది. పత్తి సాగుకు ఈనెలాఖరు వరకు గడువు ఉండడంతో మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. కనిగిరి నియోజ కవర్గంలోని ఆరు మండలాల్లో 5,547 హెక్టార్లు బత్తాయి తోటలు, 1,273 హెక్టార్లు నిమ్మతోటలు విస్తరించి ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 1,540 హెక్టార్ల బత్తాయి, 100 హెక్టార్లు నిమ్మతోటలు ఎండిపోయయని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి 50 శాతానికి పైగానే బత్తాయి, నిమ్మతోటలు ఎండిపోయినట్లు తెలిసింది. ట్యాంకర్లతో అరకొరగా నీళ్లుపెట్టినా బతికే పరిస్థితి లేదు. తోటలను నరికేస్తున్నారు. ఆ కట్టెలను వంటచెరకుకు ఉపయోగిస్తున్నారు.


కనిగిరి మండలం చాకిరాలలో ఎండిన బత్తాయిచెట్లను నరికివేస్తున్న రైతు

తెలుగు మాధ్యమానికి తిలోదకాలు

వచ్చే ఏడాది నుంచి గిరిజన ప్రాంతాల్లోనూ ఆంగ్ల విద్య

ప్రభుత్వ తీరుతో గిరిజన విద్యారంగం నిర్వీర్యమయ్యే ప్రమాదం

ప్రజాశక్తి- పార్వతీపురం (విజయనగరం జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం తెలుగు మాధ్యమానికి తిలోదకాలు ఇస్తోంది. ఇటీవల మున్సిపల్ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలో 150 గిరిజన గురుకుల పాఠశాలలు, 516 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు కస్తూర్బి పాఠశాలలు కూడా నడుస్తున్నాయి.

ఇప్పటికే గిరిజన విద్యార్థులకు ప్రాథమిక సూత్రాలు కూడా రావని ఒకపక్క ఉన్నతాధికార్లు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడితే గిరిజన విద్యార్థులంతా చదువుకు దూరమయ్యే ప్రమాదముంది. ఇటీవల రాష్ట్ర రాజధానిలో జరిగిన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారుల సమావేశంలో గిరిజన విద్యారంగంలో కూడా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. రాబోయే విద్యాసంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమం అమలు చేస్తున్నట్లు ఇప్పుడే ప్రకటిస్తే, విద్యార్థులు మానసికంగా సిద్ధపడతారని, ఒక్కసారిగా ప్రవేశపెడితే భయందోళన చెందుతారని అధికారులు సూచించినట్లు తెలిసింది.

ఉపాధ్యాయుల మాటేంటి?

ఒక్కసారిగా తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్ల మాధ్యమానికి గిరిజన విద్యారంగాన్ని మళ్లిస్తే ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల మాటేమిటో తెలియడం లేదు. ప్రతి ఉపాధ్యాయుడూ ఇంగ్లీషులోనే అన్ని సబ్జెక్టులూ చెప్పాల్సి ఉంటుంది. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తేగాని ఇంగ్లీషులో చెప్పే నైపుణ్యం రాదు. ఇప్పటికే రెగ్యులర్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయి. వాటి స్థానంలో సిఆర్‌టిలను నియమించి నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 561 మంది ఉపాధ్యాయులకుగానూ 401 మంది మాత్రమే ఉన్నారు. 160 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. గతంలో ప్రత్యేక డీఎస్సీలో 19 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. 349 గిరిజన ప్రాథమిక పాఠశాలలకుగానూ 289 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇంకా 60 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలే కావడంతో గిరిజన విద్య ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు.


గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

ఆపరేషన్ ముస్కాన్-3 విజయవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లాలో గత నెల ఏడో తేదీ నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-3 విజయవంతంగా ముగిసిందని ఎస్‌పి త్రివిక్రమవర్మ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. డిజిపి ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ఉమ్మడిగా నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-3లో 376 మంది బాలబాలికలను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో బాలకార్మికులు 334 మంది, వీధి బాలలు 37 మంది, యాచక వృత్తిలో ఉన్న బాలలు ఐదుగురు ఉన్నారని చెప్పారు. వారిలో 126 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని, 195 మందిని ఐసిడిఎస్‌కు, 22 మందిని పాఠశాలకు, 33 మందిని షెల్టర్ హోంకు తరలించామని తెలిపారు. షెల్టర్ హోంకు తరలించిన వారిలో ఆరుగురు బాలలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని చెప్పారు.

పశుపోషణతో ఆర్థిక ఇబ్బందులు దూరం

ప్రజాశక్తి-రాజుపాలెం (గుంటూరు)

ఆర్థిక ఇబ్బందులు తొలగిపోవాలంటే పశుపోషణ ఉత్తమ మార్గమని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. గుంటూరు జిల్లా రాజుపాలెం మండలంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల లబ్ధిదార్లకు రుణాల చెక్కులను అందజేశారు. కోడెల మాట్లాడుతూ.. ఎస్సీలకు రాయితీపై గేదెలను ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. సమాజానికి అంగన్వాడీ కేంద్రాలు గుండెకాయలని, ఒక్కో కేంద్రానికి రూ.7 లక్షలు వెచ్చించి సత్తెనపల్లి నియోజకవర్గంలో 165 కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇవి చాల కుంటే ఒక్కో కేంద్రానికి తాను సొంతంగా రూ.50 వేలు ఇస్తానని ప్రకటించారు. రాజు పాలెం మండలంలో 553 గృహాలను ఎన్‌టిఆర్ గృహ నిర్మాణం కింద చేపడతామని చెప్పారు. అనంతరం సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పింగళికి ఘన నివాళి

ప్రజాశక్తి - మొవ్వ (విజయవాడ)

జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య 139వ జయంతిని కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం చిలకలపూడిలోని పింగళి విగ్రహానికి రాష్ట్ర క్రీడలు, న్యాయ, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోటమర్రి బాబాప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పింగళి స్వగ్రామమైన మొవ్వ మండలం భట్లపెనుమర్రులో సర్పంచ్ కొడాలి దయాకర్ ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఎఎన్‌యులో పాలకమండలి సమావేశం

పలు అంశాలపై నిర్ణయాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు)

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి బుధవారం నిర్వహించిన పాలకమండలి సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వివరాలను విసి ఎ.రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మాత్రం గైడ్‌లైన్స్ ప్రకారం కామన్ స్క్రీన్‌టెస్ట్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. సాంఘిక సంక్షేమ శాఖ అనుమతి అనంతరం నోటిఫికేషన్ ఇస్తామన్నారు. అక్రమాల ఆరోపణలపై చక్రపాణి కమిటీ గతంలో నివేదించిన దృష్ట్యా దాన్ని పాలకమండలి ఆమోదించింది. సబ్ కమిటీ వేసి ప్రత్యేకమైన ప్రతిపాదనల ద్వారా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఉద్యోగులు, పెన్షన్లు తదితరాలపై పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు కారుణ్య నియామకాలకు ఆమోదం తెలిపారు. ఎంఎస్ యోగా రెండేళ్ల కోర్సును ప్రారంభించాలని, లీగల్ రీసెర్చ్ సెంటర్ భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 20ఏళ్లు పైబడిన కాంట్రాక్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 50 శాతం వేతనాలు పెంచుతున్నట్లుగా చెప్పారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో నాన్ టీచింగ్ నియామకాలపై అభ్యంతరాలను పరిశీలించేందుకు సబ్ కమిటీని వేసి నియామకాలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే వర్సిటీ స్నాతకోత్సవాన్ని సెప్టెంబరులో నిర్వహించనున్నట్లు చెప్పారు. అవసరమైతే మరో స్నాతకోత్సవాన్ని మార్చిలో నిర్వహిస్తామన్నారు.

తిరుపతిలో కలకలం రేపిన రివాల్వర్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ఓ చిన్నపాటి రివాల్వార్ తిరుపతి నగరంలో కలకలం రేపింది. పూణెకు చెందిన కొందరు యాత్రికులు రివాల్వార్, బుల్లెట్లతో తిరుమలకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అలిపిరి వద్ద విజిలెన్స్ సిబ్బంది అడ్డుకున్నారు. వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేసి వారు ఎవ్వరు, ఎక్కడి నుంచి వచ్చారో విచారించారు. పూర్తి సమాచారం తీసుకున్న తర్వాత తిరుమల టుటౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో సుమారు 3 గంటల పాటు అలిపిరి చెక్‌పోస్టు వద్ద భయాందోళన చోటు చేసుకుంది. విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. మహారాష్ట్రలోని పూణెకు చెందిన విజయమణె(40), తల్లి సుభద్ర, సోదరుడు సౌరజ్, మరిదితో కలిసి తిరుమలకు వెళ్లేందుకు ఎంహెచ్21ఎపి 8055 కారులో బుధవారం అలిపిరి వద్దకు చేరుకున్నారు. చెక్‌పోస్ట్ వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా విజయమణె వాహనాన్ని తనిఖీ చేపడతుండగా తాను పోలీసని, వాహనం దిగనని, అవసరమైతే మీరు అలాగే చెక్‌చేసుకోండి.. అంటూ విజిలెన్స్ సిబ్బందిని గదమాయించారు. దీంతో విజిలెన్స్ సిబ్బంది అతన్ని పూర్తిగా తనిఖీ చేశారు. ఓ చిన్నిసైజ్ ప్యాకెట్లో 14 బుల్లెట్లు లభ్యమయ్యాయి. అనుమానం వచ్చిన సిబ్బంది కారు మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారు లోపల సరికొత్త మోడల్‌కు చెందిన రివాల్వర్, మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకుని ఉన్నతాధికారులకు సమాచారమందించారు. ఉన్నతాధికారులు అక్కడికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించారు. మహారాష్ట్రలో పారిశ్రామికవేత్తగా ఉంటున్న విజయమణె తనకు ప్రాణహాని ఉందని, స్వీయరక్షణ కోసం లైసెన్సు తుపాకీని తీసుకున్నట్లు చెప్పాడు. అది కేవలం పూణె చుట్టుపక్కల పరిధిలో మాత్రమే వినియోగించాల్సి ఉంది. అవగాహన రాహిత్యం, తిరుమల భద్రత విషయాలు తెలియకపోవడంతో వాటిని అలిపిరి చెక్‌పోస్టు వరకు తీసుకుని వచ్చి ఉంటారని, సంబంధిత లైసెన్స్ తదితర వాటిని పరిశీలించిన తర్వాత విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అనుమతిలేని వస్తువులను తీసుకొచ్చినందుకు, తదుపరి లోతైన విచారణ కోసం పూణెకు చెందిన యాత్రికులను తిరుమల టుటౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా జ్యోతుల నవీన్‌కుమార్, వైస్ చైర్మన్‌గా పెండ్యాల నళినీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి మాత్రమే ఈ పదవులకు పోటీ చేశారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

- ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చు

సివిల్స్ 6వ ర్యాంకర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-తిరువూరు (కృష్ణా)


దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

సివిల్స్‌లో ర్యాంక్ సాధించడం అసాధ్యమేమి కాదని, అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చని సివిల్స్‌లో ఆల్ ఇండియా 6వ ర్యాంక్ సాధించిన కొత్తమాసు దినేష్‌కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా తిరువూరులోని శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం దినేష్‌కుమార్‌ను కళాశాల ప్రాంగణంలో బుధవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం, అబ్రహం లింకన్ వంటివారు అనేక కష్టాలు, అపజయాల నుంచి పాఠాలు నేర్చుకొని విజయాలను సాధించారని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని శ్వాసగా మార్చుకోవాలని అన్నారు. రోజూ పడుకునే ముందు ఈరోజు నా సమయాన్ని లక్ష్యసాధనలో 100 శాతం ఉపయోగించానా లేదా అనే ప్రశ్న వేసుకుంటే తప్పకుండా విజయం వరిస్తుందని చెప్పారు.

టిడిపి మాజీ కార్పొరేటర్ ఇంట్లో సిట్ సోదాలు

ప్రజాశక్తి-మధురవాడ, విశాఖ



విశాఖ భూకుంభకోణంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు టిడిపికి చెందిన మాజీ కార్పొరేటర్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మధురవాడకు చెందిన మాజీ కార్పొరేటర్, టిడిపి నేత మన్యాల సోంబాబును అదుపులోకి తీసుకుని వివిధ అంశాలపై విచారించారు. భూ అవకతవకలపై సిట్ అధికారి రామచంద్రరావు ఆధ్వర్యంలో ద్వారకా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యారావు సోంబాబు ఇంట్లో సోదాలు చేపట్టి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం ఏడు బృందాలు స్థానికంగా పలు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో భూకుంభకోణాలపై ఆరా తీశాయి. సిట్ అధికారులు అధికార పార్టీకే చెందిన నాయకులపై వరుసగా కేసులు నమోదు చేస్తుండడంతో ఆ పార్టీ నేతల్లో గుబులు రేగుతోంది.

14 మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు

ప్రజాశక్తి- నర్సీపట్నం, ముంచంగిపుట్టు (విశాఖ)

విశాఖ జిల్లాలోని నర్సీపట్నంలో ఎనిమిది మంది, ముంచంగిపుట్టులో ఆరుగురు మావోయిస్టు మిలీషియా సభ్యులు బుధవారం లొంగిపోయారు. కొయ్యూరు మండలం మఠంభీమవరం పంచాయతీ పరిధి పెద్దకొత్తలంక గ్రామానికి చెందిన నరియ సుబ్బారావు, వంతల సుబ్బారావు, కాకురి జోగిరాజు అలియాస్ జోగారావు, నరియా సోన్నూ, పుట్టకోట గ్రామానికి చెందిన జర్తా తెల్లనయ్య అలియాస్ తెల్లన్న, పోతూరి రవితేజ, మట్టం దొన్ను, మైనకోట గ్రామానికి చెందిన మట్టం నీలకంఠం తదితరులు నర్సీపట్నం ఎఎస్‌పి ఐశ్వర్యరస్తోగి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ మావోయిస్టులు గిరిజనులను బలవంతంగా మిలీషియా సభ్యులుగా నియమించారని తెలిపారు. వీరు మావోయిస్టులకు భోజనాలు పెట్టడం, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి దారి చూపించడం, గిరిజనులను మావోయిస్టుల సమావేశాలకు తరలించడం వంటి పనులు చేస్తుంటారని చెప్పారు. అలాగే ముంచంగిపుట్టు మండలం మారుమూల రంగబయలు పంచాయతీ బుడ్డపనస గ్రామానికి చెందిన మండి సునీల్, పూజారి సుబ్బారావు, మండి లొబ్బి, సీసా పంతులు, మండి అప్పారావు, సీసా చిరంజీవు తదితర మిలీషియా సభ్యులు బుధవారం ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అరుణ్‌కిరణ్ ఎదుట లొంగిపోయారు.

సంపాదకీయం

బిజెపి వికృత క్రీడ

అతడికంటె ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు పార్టీలను చీల్చడంలోనూ, ఫిరాయింపులను ప్రోత్సహించడంలోనూ బిజెపి కాంగ్రెస్‌ను మించిపోయింది. ఆయారాం, గయారాంలకు పెద్దపీట వేసిన పార్టీగా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ గుర్తింపు దక్కించుకుంది. కమలనాథుల ధాటికి ఇప్పుడు ఆ కాంగ్రెస్ పార్టీ నేతలే విలవిలలాడుతున్న తీరు విస్మయాన్ని కలిగిస్తోంది. గుజరాత్‌లో రాజ్యసభ స్థానం కోసం మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం పన్నుతున్న వ్యూహాలు చూస్తే ప్రజాస్వామ్య విలువలు ఏ స్థాయికి పతనమయ్యాయో అర్థమవుతుంది. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అహ్మద్ పటేల్‌ను ఎలాగైనా ఓడించాలన్న లక్ష్యంతో బిజెపి ఈ కపట వ్యూహానికి తెరతీసింది. కాంగ్రెస్‌కు 57 మంది సభ్యులుండగా, పటేల్ విజయానికి 47 ఓట్లు సరిపోతాయి. ఈ లెక్కలు చూస్తే ఆయన గెలుపు నల్లేరుపై నడకే! అయితే, వాస్తవ పరిస్థితి దానికి భిన్నం! ఇప్పటికే ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్‌ఏలను ప్రలోభపచురుకుని కమలనాథులు తమవైపు తిప్పేసుకున్నారు. మరో ఐదుగురితోనూ రాయబేరాలు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఈ దశలో కళ్లు తెరచిన కాంగ్రెస్ పార్టీ తమ ఏలుబడిలో ఉన్న కర్నాటక లోని ఒక ఖరీదైన హోటల్‌కు శాసనసభ్యులను తరలించింది. ఈ విషయం బయటకు పొక్కగానే ఆ హోటల్‌తో పాటు, కర్నాటకలోని కాంగ్రెస్ నాయకుల ఇళ్లపైనా ఆదాయపన్ను శాఖ దాడులు ప్రారంభమైనాయి. తమ ఎంఎల్‌ఏలను బయటకు రప్పించడానికే ఒక వ్యూహం ప్రకారం ఈ దాడులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను తోసివేయలేం. ఫిరాయింపులు దేశంలో కొత్త కాదు. అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ సంస్థలను ఇంతగా బరితెగించి దుర్వినియోగం చేయడం మాత్రం బిజెపికే చెల్లింది! పాముకి పాలు పోసి పెంచినా, కాటు వేయడం దాని సహజ లక్షణం! ఫిరాయింపుల వంటి విషసంస్కృతి ఫలాలూ ఇలాగే ఉంటాయి. అధికారంలో ఉన్ననాళ్లు తమ కెదురులేదని విర్రవీగి, అధికారం ఊడిన తరువాత నీతి వాక్యాలు వల్లె వేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు!

ఎన్నికల సమయంలో తమది భిన్నమైన పార్టీ అని బిజెపి నేతలు దేశ ప్రజలకు నమ్మబలికారు. ఇప్పుడు ఆ వంచనాశిల్పంలోని వాస్తవాలు ఒకటొకటిగా బయటపడుతున్నాయి. అసమానతలు పెంచి, ప్రజలకు కష్టాలను మిగిల్చే ఆర్థికవిధానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ కన్నా బిజెపి ఒక అడుగు ముందే ఉందన్న విషయం ఇప్పటికే స్పష్టమైంది. అధికారం కోసం అంగలార్చే కుహనా రాజకీయ విన్యాసాల్లోనూ కాషాయ పరివారం కాంగ్రెస్ కన్నా రెండాకులు ఎక్కువ తిందన్న విషయమూ ఇప్పుడు తేటతెల్లమవుతోంది. పదవులు ఎర చూపి, డబ్బు వెదజల్లి కాంగ్రెస్ పెంచి పోషించిన ఫిరాయింపుల సంస్కృతిని బిజెపి మరి కొన్ని అడుగులు ముందుకు తీసుకువెళ్లింది. నయాన లొంగని వారిని భయానైనా తన దారికి తెచ్చుకుంటోంది. దీనికోసం సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, ఆదాయపన్ను శాఖ ఇలా అన్ని ప్రభుత్వ సంస్థలను అడ్డగోలుగా వినియోగిస్తున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి కుర్చీ కోసం బిజెపి చేసిన కపట విన్యాసాన్నీ, రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించిన తీరును దేశ ప్రజలు ఇప్పుడప్పుడే మరచిపోలేరు. గోవాలో ప్రజాతీర్పును తుంగలో తొక్కి అధికారాన్ని చేజిక్కించుకున్నదీ ఇటీవల పరిణామమే! బీహార్‌లో నితీష్ అనూహ్యంగా మోడీ భజన చేయడానికీ కేసుల భయమే కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి. జయలలిత మరణంతో గందరగోళంగా మారిన తమిళ రాజకీయాల్లో పాగా వేయడానికీ ప్రభుత్వ సంస్థలను బిజెపి దుర్వినియోగం చేస్తోందన్న విమర్శలూ ఉన్నాయి. మన రాష్ట్రంలో ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని తెగేసి చెప్పినా అధికారపార్టీ తానా తందానా అనడానికీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షమూ బిజెపి జెండా మోయడానికీ ఈ తరహా బెదిరింపులు, ప్రలోభాలూ కారణమన్న వాదనలూ ఉన్నాయి.

మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, ప్రజల మధ్య చీలికలు తేవడం, ఆ ఘర్షణల ఆధారంగా అధికార అందలానికి ఎగబాకడం కాషాయ శక్తులకు వెన్నతో పెట్టిన విద్య. ఆ అధికారం అండతో ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులను వెంటాడటానికి, ప్రతిపక్షాల ఉనికి లేకుండా చేయడానికి ప్రభుత్వ సంస్థలను గతంలో ఎన్నడూలేని విధంగా దుర్వినియోగం చేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో బిజెపి ఆడుతున్న ఈ వికృత క్రీడ దేశానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏ మాత్రం మంచిది కాదు. దేశ వ్యాప్తంగా మేధావులు, ప్రజాస్వామ్య వాదులు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహనీయుల మాట




మనిషి సామాజిక వికాసానికి తోడ్పడేవి మంచి పుస్తకాలే.

- కందుకూరి వీరేశలింగం


ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వ యంత్రాంగం

డాక్టర్ చుక్కా రామయ్య



చర్చ

మనది ప్రజాస్వామిక దేశం. అత్యధిక జనాభా కల్గిన రెండో దేశం. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం కలిగిన ఈ దేశంలో అవినీతి, నిరుద్యోగం, పేదరికం, ఆశ్రిత పక్షపాతం, అధికార దుర్వినియోగం, బంధు ప్రీతి ఇలా అనేక సమస్యలు ప్రజల్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. ఏ పని కావాలన్నా ఇదివరకైతే సంబంధిత కార్యాలయాలకు వెళ్లడం.. అక్కడి ఆఫీసర్‌ను /సిబ్బందిని కలిసి తమ పనులు కానిచ్చుకోవడం సాఫీగా జరిగిపోయేది. కార్పొరేట్‌రంగం విస్తరణకు ముందునాటి మాటిది. కానీ కార్పొరేట్ సంస్థలు యథేచ్ఛగా దేశంలో విస్తరించాక లాబీయింగ్ ఇన్‌ఫ్లూయెన్స్ అనే పదాలకే అధికంగా ప్రాధాన్యం ఏర్పడింది. తద్వారా శాఖా పరంగా జరగాల్సిన ముఖ్య పనులన్నీ ఈ రోజు కేవలం వ్యక్తుల పలుకుబడి ఆధారంగా కొనసాగుతుండటం ఆందోళనకర పరిణామం. బర్త్ సర్టిఫికేట్ జారీ దగ్గర నుంచి చివరకు నగరాల్లో శ్మశానవాటికలో దహన సంస్కారాలకు కావల్సిన ఆరడుగుల నేల వరకు.. ఇలా అన్ని పనులూ ఏ రాజకీయ నాయకుడో/ అధికారో/ డబ్బున్న పెద్దమనిషో తన పలుకుబడిని వాడటం ఆధారంగానే అవి సాధ్యమవుతున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అధికార యంత్రాంగంలో కొందరు అలాంటి పెద్ద మనుషుల ప్రభావానికి లోనై వ్యవస్థలను బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టమవుతోంది. దీంతో దేశంలో అధిక శాతంగా ఉన్న ప్రజలు తమ పనులు చేసుకోలేక, ఎవరితోనూ చేయించుకొనే అవకాశం లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారం కలిగిన వారి మెహర్బానీల కోసం పనిచేసే వారితో ప్రజలకు కొంత అన్యాయం జరుగుతుంటే.. మరోవైపు నిజాయితీ, వృత్తి పట్ల నిబద్ధత కలిగిన ఎందరో నాయకులు, అధికారులు ఉన్నచోట పేదలకు న్యాయం జరుగుతోంది. కానీ, విశేష అధికారాలు, పటిష్టత కలిగిన మన ప్రభుత్వరంగ వ్యవస్థలు బలహీనపడుతుండటం అత్యంత ఆందోళనకరమైన పరిణామం.



ప్రస్తుత కాలంలో బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా.. దస్త్రాలపై ముఖ్యమైన అధికారుల సంతకాలు కావాలన్నా ఎవరో ఒక పెద్దమనిషి ఓ మాట చెబితే పని జరిగిపోతోందనే ఆలోచన ప్రజల్లో బలంగా నాటుకు పోయింది. ఆ తర్వాత జరిగే పరిణామాలు, వ్యవస్థకు అదెంత ముప్పు తెస్తుందనేది వారు ఆలోచించడం లేదు. అప్పటికి వారి పని అయిపోవాలనే చందంగా పరిస్థితి తయారైంది. వ్యవస్థలో కొందరు ఉద్యోగులు కూడా అలాగే తయారయ్యారు. లంచాలకు అలవాటుపడిన వారు కొందరైతే.. ఎవరైనా పెద్దమనిషితో చెప్పిస్తేనే పనిచేసే వారు మరికొందరు. దీంతో సామాన్య పేద ప్రజలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తమ పనుల కోసం ఎటువెళ్లాలో, ఎవరితో చెప్పించాలో తెలియక నరకయాతన అనుభవించేవారు మనకెందరో తారసపడుతుంటారు. ఎవరితోనైనా చెప్పిస్తే మీ పని క్షణాల్లో జరిగిపోతుందని ఆయా కార్యాలయాల్లోనే కొందరు చెబుతుండటం నిజంగా సిగ్గుచేటు. ఇక అవినీతి విషయం చెప్పనక్కర్లేదు. వికృతరూపం దాల్చి సమాజంలో తీవ్రమైన అసమానతలను తీసుకొచ్చిన మహమ్మారి అది. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు ఓ బలమైన యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. వ్యక్తుల కంటే వ్యవస్థలకు, వారి నిబంధనలకు ఎక్కువ విలువ ఇవ్వాలి. ప్రతి అధికారిని తన విధుల్ని స్వేచ్ఛగా నిర్వర్తించే అవకాశం ఇచ్చినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుంది. ఇప్పటికీ ఎందరో నిజాయితీ గల అధికారులు రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామిక వ్యవస్థకే పెను ప్రమాదం.

ఉద్యోగులకు కొంత మంది నాయకులు చెప్పిన విధంగా తలలు వూపే విధంగా కాకుండా నిబంధనల ప్రకారం పనిచేసే అధికారాన్ని, స్వేచ్ఛను వారికి సమకూర్చాలి. పేద, ధనిక, కులం, మతం తేడాల్లేకుండా పనిచేసే అధికార యంత్రాంగం రూపొందాలి. అప్పుడే సామాజిక మార్పు సాధ్యమవుతుంది. ప్రజలకు జవాబుదారీగా పనిచేసే అధికారులు కావాలే తప్ప ప్రజలపై పెత్తనం చెలాయించేవారు కాదు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా దాన్ని కూలంకుషంగా అధ్యయనం చేసి వారి సమస్యలపై నిరంతరం పనిచేసే అధికారులతోనే సమాజం మరింత ముందుకెళ్తుంది. అట్టడుగు వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అహర్నిశలు పనిచేసిన ఎస్‌ఆర్ శంకరన్ లాంటి గొప్ప అధికారుల అవసరం ఈ సమాజానికి ఎంతో ఉంది. అలాంటి గొప్ప వ్యక్తిత్వం, పరిస్థితులతో రాజీపడకుండా నిత్యం ప్రజలతో మమేకమై పని చేసిన మహనీయుల గురించి నేటి ఉద్యోగులకు తెలియజెప్పాలి. ఆ దిశగా వారిలో ఉత్సాహాన్ని పెంపొందించాలి. వ్యక్తిగత ప్రయోజనాల కన్నా.. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలనే సంకల్పాన్ని వారిలో నూరిపోయాలి. అప్పుడే మెరుగైన సమాజం సాకారమవుతుంది. ప్రజలకు విధేయులుగా కాకుండా అధికారానికి విధేయులుగా ఉండే వారిని ప్రోత్సహిస్తే ఈ సమాజంలో మార్పు ఎండమావే అవుతుంది. ప్రభుత్వ వ్యవస్థల్ని పటిష్ట పరిచి వాటిని పరిరక్షించుకొనే చర్యలతో... అందరికీ సమానంగా సేవలు అందించినప్పుడే వాటి స్ఫూర్తి నెరవేరుతుంది.

ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు .

భక్తులపై జిఎస్‌టి భారం



రూ. 20 లక్షలు కంటే ఎక్కువ ఆదాయం వున్న దేవాలయాలన్నీ ఇప్పుడు జిఎస్‌టి కిందకు రానున్నాయి. అంటే పరోక్షంగా ప్రజలపై భారం పడనుంది. ఇక నుంచి ఆలయాల్లో నిర్వహించే అన్ని సేవలూ ప్రియం కాబోతున్నాయి. ప్రపంచంలో ఎన్నో దేశాలు మత సంస్థలకు జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇచ్చాయి. కాని మన దేశంలో మాత్రం ఆలయాల్లో నిర్వహించే సేవలను వస్తువులుగా పరిగణించి పన్ను విధించనున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలయాలపై వున్న జిఎస్‌టి విధానాన్ని రద్దు చేయాలి.

ఉప్పలపు శేషునాథ్, నైనవరం

గోరక్షక దళాలను వెంటనే నిషేధించండి

సీతారాం ఏచూరి



విశ్లేషణ


నేను సిగ్గుతో నిలబడి తల దించుకుంటు న్నాను. మన గణతంత్ర రాజ్యం ఎక్కడి దాకా వచ్చింది? 70 సంవత్సరాల కిందట ప్రపంచంలో ఏ పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశానికి చెప్పే ధైర్యం లేనపుడు... మన దేశంలో ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని సగర్వంగా చెప్పాం. కులం, మతం, లింగ భేదం లేకుండా అందరికీ ఓటు హక్కు కల్పించాం. అప్పుడు ఇదో విప్లవాత్మకమైన ముందడుగు. సమానత్వాన్ని గుర్తించడమే దీనికి పునాది. ఈ సమానత్వమే నేడు ప్రశ్నార్థకమైంది. చట్ట వ్యతి రేకంగా జరిగే హత్యల ద్వారా తీవ్ర అణచివేతకు గురవుతోంది.

ఇంట్లో భోజనం చేస్తున్న అఖ్లాక్‌ను గొడ్డు మాంసం తింటున్నాడన్న ఆరోపణతో హత్య చేశారు. ఇది 2015లో జరిగింది. జార్ఖండ్‌లోని లాతేహార్‌లో సంతకు తమ పశువులను తీసుకెళ్తున్న ఇద్దరు యువకులను ఉరి తీశారు. అల్వార్‌లో పాడి రైతు పెహ్లూఖాన్‌ను హత్య చేశారు. ఊనాలో చనిపోయిన ఆవు చర్మాన్ని వలుస్తున్న దళితులను తీవ్రంగా కొట్టి హత్య చేశారు. వీడియో కూడా తీశారు. ఇదంతా సామాజిక మాధ్యమంలో బాగా చర్చనీయాంశమైంది. ఇవేకాక మన ముందు జునైద్, అతని సోదరుని ఉదంతం వుంది. బహిర్భూమికి వెళ్తున్న మహిళలపై వీడియో తీయవద్దన్న జాఫర్‌ను రాజస్థాన్ అధికారులు హత్య చేశారు. మన దేశంలో పెరిగిపోతున్న అసహనం కారణంగా చోటు చేసుకున్న భయానక ఘటనలు ఇవన్నీ.

అమానవీయత ఆ స్థాయికి పెరిగిపోయింది. మనం ఈ స్థితికి ఎందుకు చేరుకున్నామో అర్థం చేసుకోవాలి. చర్చించాలి. ఈ సభలో ఆ విషయమై మనం ఒక నిర్ధారణకు రావాల్సి వుంది. స్పానిష్ విచారణ సమయంలో 'పంది మాంసం ఎవరు తింటారు?' అని ప్రశ్నించి ముస్లింలెవరో, యూదులెవరో గుర్తించారు. ఇప్పుడు 2017లో 'గొడ్డు మాంసం ఎవరు తింటారు?' అని ప్రశ్నించి హిందువు ఎవరో, హిందూయేతరులు ఎవరో గుర్తించే పద్ధతిని అనుసరించేదాకా మన దేశం వచ్చింది.

ఇప్పుడు మన చుట్టూ వీరంగం వేస్తున్న ప్రయివేటు సైన్యం సంగతి ఏంటి? అది రాష్ట్రాలకు సంబంధించిన శాంతిభద్రతల సమస్యగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటున్న, చట్టాన్ని అమలు చేయమని ఒత్తిడి చేస్తున్న ఈ ప్రయివేటు సైన్యాన్ని కేంద్ర ప్రభుత్వమే నిషేధించాలి. ఏ అధికారమూ లేని ప్రయివేటు సైన్యాన్ని నిలువరించే మార్గం ఇది మాత్రమే. అందుకని అనేక పాశవిక చర్యలకు పాల్పడుతున్న గోరక్షక దళ సభ్యులను వెంటనే నిషేధించాలని మనం ప్రభుత్వాన్ని అడగాలి.

అయితే ఇదంతా ఎందుకు జరుగుతోంది? దేశంలో నేరాల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతున్నందున ఇదంతా జరగడం లేదు. ఒక విధమైన భావజాలమే ఇందుకు కారణం. మనందరం దీనిని అర్థం చేసుకోవాలి. మనందరం స్వతంత్ర్య భారత దేశాన్ని, అది అవలంభిస్తున్న రాజ్యాంగాన్ని వారసత్వంగా పొందాం. ఇది మూడు దార్శనికతల మధ్య జరుగుతున్న యుద్ధ పర్యవసానం. స్వాతంత్ర్య పోరాట కాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దార్శనికత ప్రధాన స్రవంతిలో వుంది. స్వతంత్ర భారతదేశం భవిష్యత్తులో ఒక లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా వుండాలని వారు పేర్కొన్నారు.



ఈ అల్లరి మూకలు చేసే హత్యలు... శాంతిభద్రతల లోపం వల్ల... ఎక్కడో ఒకటి లేదా రెండు ఘటనలుగా జరిగినవి కాదు. ఆధునిక భారతదేశంలో లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య లక్షణాన్ని కూల్చివేసి దాని స్థానంలో 'హిందూ రాజ్యాన్ని' ఏర్పాటు చేసే భావజాలంలో భాగమే ఈ హత్యలు. ఇది చాలా ప్రమాదకరమైన అంశం కాబట్టి గోరక్షక దళాలను చట్టబద్ధంగా నిషేధించాలి.

వామపక్షీయులమైన మాకు వారితో విభేదం వున్నది. మనం అక్కడే నిలిచిపోకూడదని మేం చెప్పాం. మన రాజకీయ స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛగా మారడానికి ఇంకొంత ముందుకెళ్ళాలని, అది సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే జరుగుతుందని, లేకుంటే సామాజిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం నిస్సహాయంగా తయారవుతుందని మేం కాంగ్రెస్ వారితో చెప్పాం. రెండు రకాల వ్యక్తీకరణలున్న మూడవ దార్శనికత మరొకటి వుంది. ఇస్లామిక్ భారతదేశం గురించి మాట్లాడిన ముస్లిం లీగ్, హిందూ రాజ్యం గురించి మాట్లాడుతున్న ఆర్.ఎస్.ఎస్ ఆ రెండు వ్యక్తీకరణలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం రావాలని, దేశ ప్రజలు ఆచరిస్తున్న మతం ఆధారంగా మత నాయకులచే ఈ దేశ పాలన జరగాలని ఆ రెండు వ్యక్తీకరణలు కోరాయి. దురదృష్టవశాత్తు బ్రిటిష్‌వారి సహకారం పొందడంలో ముస్లిం లీగ్ విజయం సాధించింది. తద్వారా దేశ విభజన జరిగింది. రాజ్య పాలన మత ప్రాతిపదిక ఆధారంగా వుండాలన్న ఈ భావం ఇతర రెండు దార్శనికతలకు వ్యతిరేకమైనది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ఏర్పడింది. హిందూ రాజ్య ఏర్పాటును సుసాధ్యం చేయలేదన్న కోపంతో గాంధీని హత్య చేశారు. ఆ తరువాత, సర్దార్ పటేల్ చొరవతో ఆర్.ఎస్.ఎస్.పై నిషేధం విధించబడింది. 1948 ఫిబ్రవరి 4, పటేల్ స్వయంగా రూపొందించిన నిషేధపు ఆజ్ఞ ఏం చెప్పింది? 'సంఘ్ యొక్క అభ్యంతరకరమైన, అపాయకరమైన కార్యకలాపాలు అడ్డూ అదుపూ లేకుండా సాగాయి. సంఘ్ కార్యకర్తలు ప్రేరేపించిన హింసాత్మక చర్యలతో అనేక మంది క్షతగాత్రులయ్యారు. తాజాగా గాంధీజీ ప్రాణాలను బలి తీసుకున్నారు'. కొంతమంది చెబుతున్నట్లు గో రక్షకులందరూ ఆర్.ఎస్.ఎస్. వారేనని నేను చెప్పడంలేదు. వారు జాతి వ్యతిరేకులు, నేరస్తులని కొంతమంది అంటున్నారు. ప్రధానమంత్రి కూడా అలానే చెప్పారు. వారు రాత్రంతా నేరస్తులు, పగలంతా మరింకేదైనా అయి వుండవచ్చు. కానీ, వారు ఇలా చేయడానికి ధైర్యం ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది? హింసా విధానం వ్యాప్తి చెందడం వల్లనే అలా జరుగుతుంది. అయితే దార్శనికతల మధ్య వున్న యుద్ధం గాంధీజీ హత్యతో నిలిచిపోలేదు.

దురదృష్టవశాత్తు అది నిలిచిపోయిందని అనేక మంది ఉపశమనం పొందారు. కానీ, అలా జరగలేదు. ఆతర్వాత మనం ఏం చూశాం? గాంధీ హత్యానంతరం, రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత కూడ మనం జాతీయవాదం ముద్రను సంపాదించాం. ఆ సమయంలో ఒక ఆర్.ఎస్.ఎస్. ముఖ్యుడు పేర్కొన్న విషయాన్ని ఉదహరిస్తాను. 'ఇస్లాం, క్రైస్తవ మతాలలోకి మారిన వారి వైఖరి ఏంటి? వారు ఈ దేశంలోనే జన్మించినారు, సందేహం లేదు. కానీ వారు ఈ దేశానికి విశ్వాసంగా వున్నారా? వారిని పెంచిన ఈ దేశానికి వారు కృతజ్ఞతగా వున్నారా? వారు ఈ దేశపు, సాంప్రదాయపు బిడ్డలని, దానికి సేవ చేయడం తమ అదృష్టం అని వారు భావిస్తున్నారా? ఈ దేశానికి సేవ చేయడం వారి విధి అనుకుంటున్నారా? లేదు! వారి విశ్వాసంలో వచ్చిన మార్పుతోనే ఈ జాతిపట్ల వారికున్న ప్రేమ, శ్రద్ధలు పోయాయి'. స్వాతంత్ర్యం పొందాక, రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాక కూడ నీవు వ్యాప్తి చేస్తున్న ఈ విధమైన భావజాలపు విలువల అర్థం ఏమిటి? కులం, జాతి, లింగ బేధం లేకుండా ఇది సమానత్వపు హక్కును కాదంటుంది.

ఈ భావజాలం ప్రస్తుతం మన కంటి ముందున్న స్థితికి ఎదిగింది. అందువల్ల జాతీయవాదం అంటే హిందూ జాతీయతావాదం లేదా హిందూత్వ జాతీయతావాదంతో సమానం చేయబడుతుంది. దేశభక్తుడంటే దేశభక్తుడే. అది భారతీయ దేశభక్తుడు. అందుకే మనం కోరుకున్నది భారతీయ దేశభక్తి. హిందూత్వ దేశభక్తి లేదా హిందూత్వ జాతీయతావాదం కాదు. పోషించవలసింది భారత జాతీయవాదం. అది మన విధి. దానిని పోషించకపోవడం వల్లనే మనకు ఇక్కడ హత్యలు చేసే అల్లరిమూకలు ఏర్పడ్డాయి. ఆ ద్వేష భావంలోంచే ఈ అల్లరి మూక తయారైంది.

నేడు మనం చూస్తున్న ఈ రక్షక దళాల గురించి సర్దార్ పటేల్ చాలా తీవ్రంగా వ్యాఖ్యానించారు. వీరు వ్యాప్తి చేస్తున్న హింసా విధానం అనేక మందిని పాశవిక చర్యలకు పాల్పడేలా పురికొల్పుతోంది. మన రాజ్యాంగ పునాదులపై చేస్తున్న దాడుల ఫలితంగా సమానత్వపు హక్కు కాలరాయబడుతోంది. కాబట్టి మన రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలంటే అల్లరిమూకల, రక్షక దళాలకు వ్యతిరేకంగా పోరాడటం అవసరం.


ఈ వారాంతపు 'ఫైనాన్షియల్ టైమ్స్' ఏం చెప్తోంది? 'ప్రధానమంత్రి హిందూత్వవాదుల దుర్మార్గాలకు సహాయపడడం ఆపివేయాలి. గొడ్డు మాంసం తిన్నారని, గొడ్డు మాంసం వ్యాపారం చేస్తున్నారని అనుమానంతో హిందూత్వ రక్షక దళాలు చేస్తున్న దాడుల సంఖ్య పెరిగిపోతున్నది. ఈ దాడులలో 28 మందికి పైగా హత్యకు గురయ్యారు...'. ఇది నేడు మీ అంతర్జాతీయ స్థాయి. మన రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా మన దేశంలో జరుగుతున్న చర్యలను వారు గుర్తిస్తున్నారు.

సంస్కరణలు, ఆర్థిక విధానాలపై ప్రధానమంత్రి కేంద్రీకరిస్తున్నారు. కానీ హిందూత్వ ఎజెండాపై కేంద్రీకరించడంలేదు. కాబట్టి దేశం హిందూత్వవైపు వెళ్ళడాన్ని ఆపుచేయాలి. ఈ అల్లరి మూకలు చేసే హత్యలు... శాంతిభద్రతల లోపం వల్ల... ఎక్కడో ఒకటి లేదా రెండు ఘటనలుగా జరిగినవి కాదు. ఆధునిక భారతదేశంలో లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య లక్షణాన్ని కూల్చివేసి దాని స్థానంలో 'హిందూ రాజ్యాన్ని' ఏర్పాటు చేసే భావజాలంలో భాగమే ఈ హత్యలు. ఇది చాలా ప్రమాదకరమైన అంశం కాబట్టి గోరక్షక దళాలను చట్టబద్ధంగా నిషేధించాలి. మనందరం కలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేద్దాం.

(గత నెల 19న రాజ్యసభలో చేసిన ప్రసంగానికి వ్యాస రూపం)

యంత్రాలు : మనిషి

సంగిరెడ్డి హనుమంత రెడ్డి



సమీక్ష

'ఆదిమ కాలపు నిగూఢ భయం ఆధునిక యుగంలో నిరుద్యోగ భీతిగా మారింది. సమాజంలో మనిషికి ఉపాధి లేదంటే ప్రాణం లేనట్లే' అని బ్రిటిష్ ఆర్థిక శాస్త్రవేత్త, రచయిత్రి, 'ఎకనమిస్ట్' పత్రిక సహాయ సంపాదకురాలు బార్బరా వార్డ్ బాధపడ్డారు. బార్బరా 1981లో మరణించారు. ఆ తర్వాతి 36 ఏళ్ళ యాంత్రికీకరణ పేదలకు నరకం, సంపన్నులకు స్వర్గంగా తయారైంది.

యంత్రాల పుణ్యమే


పని రెండు విధాలు. ఆలోచన అవసరమైన మేధో శ్రమ. అది అక్కరలేని శారీరక శ్రమ. శారీరక శ్రమకు తక్కువ కూలీ, మేధో శ్రమకు ఎక్కువ జీతం లభిస్తాయి. భారీ శారీరక శ్రమను యంత్రంతో ఒక్క మనిషి చేయవచ్చు. మేధో శ్రమలో యంత్రాలను వాడినా మానవ మేధస్సు అవసరం. యాంత్రికీకరణ గురించి చాలా వింటున్నాం. ఇది భారీ నిరుద్యోగానికి, వేతన కోతలకు, సాంఘిక అసమానతల పెరుగుదలకు, చైతన్య రాహిత్యానికి దారితీయడం గమనిస్తున్నాం. కంప్యూటర్, ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఉద్యోగులు, సాంకేతిక ప్రవక్తలు, మేధావులు, సామాజిక విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక ప్రగతి ఆదాయాలను, జీవన ప్రమాణాలను పెంచింది. ఆధునిక సాంకేతికతతో ఉపాధి తగ్గింది. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ మేధావులు యాంత్రికీకరణ దుష్ఫలితాలపై వందలాది అధ్యయన విశ్లేషణ పత్రాలు సమర్పించారు. 702 వృత్తులను పరిశీలించి వేతనాలు, విద్యార్హతల లక్ష్యాలపై కంప్యూటరీకరణ వ్యతిరేక ప్రభావం చూపుతుందని నిర్ధారించారు. యంత్రాల వల్ల రాబోయే 20 ఏళ్ళలో అమెరికాలో 47 శాతం, ఐరోపాలో 54 శాతం ఉద్యోగాలు ఊడే ప్రమాదముంది. రెండు శతాబ్దాల నుండి యాంత్రికీకరణ ఉధృతంగా జరుగుతూనే ఉంది. ప్రభుత్వాలు, యాజమాన్యాలు కొత్త ఉద్యోగాల వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. 1800 లో 74 శాతం అమెరికన్లు వ్యవసాయ దారులే. ఈ సంఖ్య 1900 లో 31 శాతానికి, 2000లో 3 శాతానికి పడిపోయింది. అయినా ఇంతటి నిరుద్యోగ మెప్పుడూ లేదు. 1990 నుండి కంప్యూటరీకరణ ఉద్యోగాలను మింగేసింది. 2030 నాటికి వారానికి 15 గంటల పని మాత్రమే దొరుకు తుందని ప్రఖ్యాత ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ అంచనా వేశారు. కాని పెరిగిన చదువులు, జనాభా, నిరుద్యోగాల కారణంగా 1980 ల నుండి లభించిన కొద్ది ఉద్యోగాలలో రోజుకు 15 గంటలు బానిసల్లా పని చేస్తున్నారు. రేయిం బవళ్ళు సాగే పని భార్యాభర్తల విడాకుల కూ దారితీస్తోంది.

జీవచ్ఛవాల్లా...

2013 లో 'హార్వర్డ్ బిజినెస్ రివ్యూ' 12,000 మంది వృత్తి నిపుణులను సర్వే చేసింది. సగం మంది తమ ఉద్యోగం ప్రాముఖ్యత లేనిదన్నారు. సగం మంది యాజమాన్య లక్ష్యాలకు తమ ఉద్యోగానికి పొంతన లేదన్నారు. 42 దేశాలలో 2,30,000 మందితో ఇంకొక సర్వే జరిగింది. ఇందులో 13 శాతం మంది మాత్రమే తమ ఉద్యోగం మీద మక్కువ చూపారు. ఈ మధ్యనే జరిగిన బ్రిటిష్ ఉద్యోగుల సర్వేలో 37 శాతం మంది తమ పని ప్రపంచ అవసరాలను తీర్చడం లేదన్నారు. అద్భుతమైన ఉద్యోగాలు, ఆకర్షణీయమైన జీతాలు కలిగిన విజయవంతమైన వృత్తి నిపుణులు తమ పని వల్ల తమకు కలిగే ప్రయోజనం శూన్యమన్నారు. ఈ ప్రస్తావనంతా ఎ.సి. గదుల్లో కూర్చొని విధి నిర్వహణార్థం కూడా బయటకు రాని కన్సల్టెంట్లు, బ్యాంకర్లు, పన్ను సలహాదార్లు, మేనేజర్ల గురించి. వీళ్ళు వ్యూహాత్మకంగా నియమాలను అడ్డదిడ్డంగా అనువదిస్తూ... కంప్యూటర్లతో ఆడుకుంటూ సంపాదించు కుంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇలాంటి ఉద్యోగాలనే సృష్టిస్తారు. పారిశ్రామిక కార్మికులు, పారిశుధ్య శ్రామికులు, ఉపాధ్యాయు లు ఒప్పంద ఉద్యోగులే. వీళ్ళు సమ్మె చేస్తే జన జీవితం నరకమే. ఒప్పంద ఉద్యోగాలతో అధికారులు, దళారీలు ధనవంతులవుతున్నారు. ఉద్యోగులు జీవచ్ఛవాల్లా బతుకు తున్నారు. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ లక్షలాది ఉద్యోగాలను ఊడబీకాయి. ఆంధ్రలో ఉద్యోగుల సేవా నిబంధ నలను సవరిస్తూ చంద్రన్న ఉత్తర్వులిచ్చారు. సేవలను 30 ఏళ్ళకు కుదించారు. 50 ఏళ్ళ తర్వాతి సేవను సంశయాత్మకం చేశారు. ప్రజలు పట్టని స్వార్థపరులు, కార్పొరేట్ సంస్థల పక్షపాతులు, మత మదాంధులు, మెదళ్ళు కుళ్ళిన రాజకీయ నాయకులు చచ్చేదాకా దేశ భవిష్యత్తును నిర్ణయించే పదవుల్లో కొనసాగుతారు. ఉద్యోగులు మాత్రం 50 ఏళ్ళకే చిన్న పనులకే అనర్హులు! వదంతులు వదలడం! స్పందనను గమనించి చర్యలను పరిమితం చేయడం లేదా వేగవంతం చేయడం ప్రభుత్వాలకు పరిపాటి. 'నాది' కాదనుకోకుండా ప్రజలంతా స్పందించవలసిన సమయమిది.

సంతోషాన్ని పెంచాలి

'భవిష్యత్తులో విద్య లక్ష్యం నిరర్థక వ్యాపక కల్పన కాక జీవిత సార్థకతను పెంచేదిగా ఉండాలి. పని, జీతాలను నిర్ణయించేది కాక జీవిత సంతోషాలను, మానవత్వ విలువలను పెంచేదిగా ఉండాలి' డచ్ చరిత్రకారుడు, పాత్రికేయులు, రచయిత రట్గర్ బ్రెగ్మన్ అభిప్రాయం. ప్రపంచాన్ని సుందరంగా, సంతోషకరంగా, ఆసక్తిదాయకంగా తీర్చిదిద్దడమే జీవితమని ప్రముఖులు వక్కాణిస్తారు. ఇది శ్రమశక్తితోనే సాధ్యం. మన పని నిర్వచనం సంకుచితం. డబ్బును సంపాదించే పనులనే స్థూల జాతీయోత్పత్తిలో చేర్చారు. పొట్ట నింపడమే చదువు లక్ష్యంగా భావిస్తారు. ధనమే జీవితమనుకుంటారు. సమాజ నిర్మాణానికి మూలమైన జ్ఞాన సంపదను గుర్తించరు. పెరిగిన సాంకేతికత ఈ సమస్యను మరింత తీవ్రం చేసింది. యాంత్రికీకరణ యుగంలో సామర్థ్యం పెరిగి ఉత్పత్తులు అధికమైనా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో మానవ శ్రమకు విలువ లేదు. సంపన్నుల సంఖ్య, వారి వృథా సమయం పెరిగాయి. సాంకేతికాభివృద్ధి ఫలితాలను పేదలు పొందాలంటే శ్రమ సంస్కృతి మారాలి. అమెరికన్ చిత్రం 'ఫైట్ క్లబ్'లో కథానాయకుడు బ్రాడ్ పిట్ అన్నట్టు 'మనం అసహ్యించుకునే ఉద్యోగాలనేచేస్తూ... అనవసర వస్తువులను కొంటూ ఉంటాం'.



కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు మనం సృష్టించిన సాంకేతికతల ప్రయోజనమేంటి? ఈ సమస్యకు పరిష్కారంగా ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, కెనడాలలో సార్వత్రిక ప్రాథమిక ఆదాయ పథకాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ ఆదాయం

ఉత్పత్తిలో శ్రామిక భాగస్వామ్యం తగ్గితే సామాజిక అస్థిరత్వానికి దారి తీస్తుంది. కొనుగోలు శక్తి నశించి వినియోగదారులు తగ్గితే ఆర్థిక అస్థిరత్వం నెలకొంటుంది. కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు మనం సృష్టించిన సాంకేతికతల ప్రయోజనమేంటి? ఈ సమస్యకు పరిష్కారంగా ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, కెనడాలలో సార్వత్రిక ప్రాథమిక ఆదాయ పథకాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పనితో సంబంధం లేకుండా, ఎలాంటి షరతులు లేకుండా ప్రతి పౌరునికీ ఎంతో కొంత నెలసరి ఆదాయాన్నిచ్చే విధానం ఇది. దీనితో యాంత్రికీకరణ దుష్ఫలితం కొంత తగ్గవచ్చు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల లాభాల నుండి ఈ పథకానికి ఆర్థిక సాయం అందుతుంది. మన దేశంలో ఈ సంస్థల రాజకీయ అధికారులు ఆర్థికంగా పుంజుకున్నారు. సంస్థలు ఆదాయం లేని రోగగ్రస్థ పరిశ్రమలుగా మార్చబడ్డాయి. నూతన ఆర్థిక విధానాల ఉచ్చులో ఇరుక్కున్న ప్రభుత్వాలు ఆస్తులు కలిగిన ఈ సంస్థలను అమ్ముతున్నాయి. పన్నుల ద్వారా వనరులు చేకూర్చుకొని అనేక పెట్టుబడిదారీ దేశాలు ఈ సార్వత్రిక ఆదాయ పథకాన్ని అమలు చేశాయి. వస్తు సేవల పన్నుల ద్వారా మన ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అయితే ఈ డబ్బును అమెరికా ఆదేశాల అమలుకు కేటాయించారు. వివిధ సేవల పన్నులు, సెస్సులను కూడా ప్రభుత్వం నిర్దేశిత రంగాలకు కాకుండా తమ ప్రచార పథకాలకు వాడుకుంటున్నది. అందుకే ప్రపంచ మితవాద ప్రభుత్వాలు మద్దతు పలికిన ఈ సార్వత్రిక ఆదాయ పథకాన్ని ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి తేలుకుట్టిన దొంగలా మౌనం వహించారు. శ్రమ సంస్కృతి నశించిన మన సమాజాన్ని ఈ పథకం మరింత సోమరితనం, దురలవాట్ల వైపు లాగే ప్రమాదముంది. ఎన్నికలలో వాగ్దానం చేసిన నిరుద్యోగ భృతిని నిర్లక్ష్యం చేసి, అమలులో ఉన్న రాయితీలను, పెన్షన్లను, సాంఘిక సంక్షేమాలను రద్దు చేస్తున్న ప్రభుత్వాల నుండి పాలక ప్రయోజనాలు తప్ప ప్రజా సంక్షేమాన్ని ఆశించలేము. శాస్త్రీయతకు స్వస్తి పలికి మధ్యయుగాల మత మౌఢ్యంలో మునిగిన ప్రభుత్వాలు, ప్రపంచ వంచక అమానవీయ అమెరికా పంచన చేరిన పాలకులు భారతాన్ని వంచిస్తున్నారు. 'అభివృద్ధి–శ్రమ సంతోషాన్ని కలిగించినప్పుడు జీవితం ఆనందమయం అవుతుంది. శ్రమ మొక్కుబడిగా మారినప్పుడు బానిస బతుకవుతుంది' అంటాడు రష్యన్ రచయిత, రాజకీయ క్రియాశీలి, సామాజిక ప్రజాస్వామ్య ఉద్యమ కార్యకర్త గోర్కీ. ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్న ఆర్థిక సంపన్నత అభివృద్ధి కాదు. 'పనులు యంత్రాలకు జీవితాలు మనుషులకు' అన్న సూక్తిని పాటించాలి. మెరుగైన భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాల పరిగణన, నూతన సంఘటనల రూపకల్పనపై దృష్టి కేంద్రీకరించాలి. ఊహలు నిజమై జీవితాలు సంతోషమయం కావడమే అభివృద్ధి.

సెల్- 9490204545



మొక్కకు నీరుపోస్తే ఏమవుతుంది? పెరిగి పెద్దదై మనిషికి ప్రాణవాయువుని ఇస్తుంది. ఆనక ఫలమో, పుష్పమో ఇస్తుంది. మనం ఒకింత ప్రకృతిని కాపాడుకుంటేనే ఆ ప్రకృతి.. అంతకు వెయ్యింతలు.. కొండింతలై మానవాళిని తరతరాలు కాపాడుతుంది. బాల్య దశలో ఇలాంటి అంశాలన్నింటినీ అక్షర రూపంలో వల్లె వేస్తుంటారు అక్కడి విద్యార్థులు. పలకా, బలపం, పెన్ను, పుస్తకాలతోపాటు పచ్చని మొక్కలు, ఏపుగా కాస్తున్న చెట్లు, ఆ.. గుబురుచెట్లపై వాలిన పిట్టలు.. ఇవన్నీ ఆ విద్యార్థులకు కమ్మని కబుర్లు చెప్పే స్నేహితులే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ పచ్చని చెట్లకు ఆ విద్యార్థులే సంరక్షకులు. వాటి బాగోగులు చూసే అమ్మానాన్నలు. అందుకే ఆ పాఠశాల చుట్టూతా నిత్యం పచ్చని వనాలు అందర్నీ పలకరిస్తుంటాయి. 'ఒక చెట్టు- ఒక విద్యార్థి' అనే నినాదంతో పచ్చని ఆదర్శవంతమైన పాఠశాలగా గుర్తింపు తెచ్చుకుంటున్న పెదగార్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోకి అడుగుపెడితే.. ఇంకా అనేక విషయాలు మనల్ని ఉత్తేజుతుల్ని చేస్తాయి. అందుకే.. ప్రకృతి ఒడిలో విద్యార్థులకు అక్షరాలు నేర్పుతున్న ఆ పచ్చని బడిని ఒకసారి చూసొద్దాం పదండి!!

పచ్చని ఒడి అక్షరాల బడి

గుంటూరు జిల్లాలోని దాచేపల్లి మండలం పెదగార్లపాడులో ఉంది జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల. 350మందికి పైగా విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు. సాధారణ విద్యతో పాటు ప్రకృతికి–మనిషికి గల అనుబంధాన్ని ప్రతి విద్యార్థికీ పూసగుచ్చినట్లు చెప్పడమే ఇక్కడి ఉపాధ్యాయుల ప్రత్యేకత. అంతేకాదు, సామాజిక అంశాలపై అవగాహన కోసం వీరు చేస్తున్న కొన్ని వినూత్న కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకోవడంతో భవిష్యత్తుకు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.

ఒక చెట్టు.. ఒక విద్యార్థి

ఈ బడిలో ఉపాధ్యాయులు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడంతో వాటి బాధ్యత పూర్తిగా విద్యార్థులకే అప్పగిస్తారు. అందుకు వీరు ఎంచుకున్న నినాదం 'వన్ ప్లాంట్.. వన్ స్టూడెంట్'. నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టిన ఈ పచ్చని ప్రయత్నంతో ప్రస్తుతం పాఠశాల పచ్చని చెట్ల అందాల నడుమ అలరారుతోంది. "ముంబయి ట్రిపుల్ ఐటికి చెందిన డాక్టర్ నరేష్‌గారి ఆధ్వర్యంలో మొక్కలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి విద్యార్థికీ ఒక మొక్కను అప్పగించి.. దాని పెరుగుదల విషయంలో వారే జాగ్రత్తలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించాం. ప్రతి నెలా మొక్క ఎంత వరకూ పెరుగుతోంది? దానిలో వస్తున్న మార్పులేంటి? చీడపీడలను ఎలా ఎదుర్కోవాలి? వంటి అంశాలపై క్లాసులు నిర్వహించాం. మా ప్రయత్నం సఫలమైంది. కొత్తగా మా స్కూల్‌లో అడుగుపెట్టేవారికి ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది" అని తమ పచ్చని ప్రణాళిక గురించి వివరించారు ఆ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు. అంతేకాదు, ఏ మొక్కలనైతే విద్యార్థులు చెట్లుగా మార్చారో కొన్ని సందర్భాలలో వాటి నీడనే తరగతులు నిర్వహిస్తుండటం విశేషం. "మొక్కల పెరుగుదల వల్ల ఉపయోగాలు నేరుగా వారూ అనుభవించాలనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నాం. ప్రస్తుతం మా స్కూల్‌లో విద్యార్థులకు దొరికే ఖాళీ సమయాన్ని మొక్కల పెంపకానికే కేటాయిస్తున్నారంటే.. అదో విజయంగానే మేం భావిస్తున్నాం!" అంటున్నారు ఇక్కడి ఉపాధ్యాయులు.

క్లాస్‌రూమే ఆదర్శం

సాధారణంగా ఏ బడి తరగతి గదుల్లోనైనా గోడలకు స్వాతంత్ర్యోద్యమ నాయకుల ఫొటోలు కనిపించడం సహజం. కానీ ఈ పాఠశాలలో మాత్రం వాటితోపాటు మరికొందరి ఫొటోలు కనపడతాయి. "తరగతి గదుల్లో గొప్పవారి ఫొటోలు మాలో స్ఫూర్తిని నింపేందుకు ఉపయోగపడతాయి. వాటితోపాటు ట్రిపుల్ ఐటిలో సీటు సంపాదించిన మా సీనియర్ల ఫొటోలూ మా ముందు కనిపిస్తాయి. ఆ ఫొటోలు చూసినప్పుడల్లా మాలో చదువుపైన ఆసక్తి మరింత పెరుగుతోంది" అంటున్నారు ఇక్కడి విద్యార్థులు. అంతేకాదు, దాతల సహకారంతో స్కూల్ ఆవరణలో 12 మంది ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. వాటికి అందంగా రంగులు వేసి, స్కూల్ వాతావరణాన్ని మరింత ఆహ్లాదంగా మార్చేశారు. గతంలో లక్షా యాభైవేల మొక్కలతో ఇక్కడ నర్సరీ ఏర్పాటుచేశారు. ఆ మొక్కలను చుట్టుపక్కల గ్రామాలకూ, మండలాలకూ పంపిణీ చేశారు. ఇందులోనూ విద్యార్థులు కీలకపాత్ర పోషించారు.

విద్యార్థులే మాస్టార్లుగా!

వారంలో ఒకరోజు స్కూల్ ఆవరణలో ఉన్న ఓ మొక్కను ఎంపిక చేసుకుంటారు. ఆ మొక్కకు సంబంధించిన పూర్తి వివరాలు ఉపాధ్యాయులు ఓ విద్యార్థితో నోట్స్ ప్రిపేర్ చేయిస్తారు. అలా ఆ విద్యార్థి మొక్కకు సంబంధించిన అంశాలను అవగాహన చేసుకుని, మిగతా విద్యార్థులను అక్కడకు తీసుకువెళ్లి, మొక్కకు సంబంధించిన వివరాలతో పాఠాలు చెప్పడం మొదలుపెడతారు. అయితే, ఇక్కడ అనర్గళంగా పాఠాలు భోదించేది, నోట్స్ ప్రిపేర్ చేసేది విద్యార్థులే. అలా చేయడం వల్ల మొక్కలపై అవగాహనతోపాటు విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై మక్కువ పెరుగుతుందనేది ఉపాధ్యాయుల భావన. ఈ ఆలోచన కార్యరూపం దాల్చి, మంచి ఫలితాల్ని ఇవ్వడంపట్ల ఉపాధ్యాయులతో విద్యార్థులూ ఎంతో సంతోషంగా ఉండటం గమనించదగ్గ విషయం.



అందరి సహకారం

ఒకప్పుడు కనీసవసతులులేని ఈ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు ఒక్కొక్కరిగా చేతులు కలిపారు. "అప్పటి సర్పంచ్ పురంసెట్టి అంకులు, అప్పటి ప్రధానోపాధ్యాయుడు లింగంశెట్టి వెంకట్రామిరెడ్డి స్కూల్ అప్‌గ్రేడ్ విషయంలో చేసిన కృషి ఎప్పటికీ మర్చిపోలేనిది" అని చెబుతారు గ్రామస్థులు. అలా అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు జిల్లాస్థాయిలో ఈ మారుమూల పాఠశాల మంచి గుర్తింపు పొందడం చెప్పుకోదగ్గ విశేషం.

విద్యా భోదన విషయంలోనూ.. అధునాతన టెక్నాలజీ, పద్ధతులను అమలు చేస్తున్నారు. స్థానిక ఎంపిటిసి పురంశెట్టి పరంజ్యోతి డిజిటల్ క్లాసులకు అవసరమైన ప్రొజెక్టర్‌ను సొంతడబ్బుతో కొని, ఈ పాఠశాలకు అందించారు. సామాజిక అవగాహనలో భాగంగా 'పల్నాటి బ్రహ్మనాయుడు భారత స్కౌట్' పేరుతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. వారంలో ఒకరోజు స్కౌట్‌కు కేటాయిస్తారు. అంతేకాదు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, పల్స్‌పోలియో, హెచ్ఐవి వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 32 మందితో కూడిన విద్యార్థి బృందం చురుగ్గా పనిచేస్తుంటారు. అలాగే రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పలు కార్యక్రమాలకూ ఈ బృందం నుంచి విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళుతూ అందరి మన్ననలూ పొందుతున్నారు.

చదువుల బడిని.. కేవలం అక్షరాలు దిద్దుకోవడానికి మాత్రమే పరిమితం చేయలేదు. మానవాళి శ్రేయస్సుకు దోహదపడేలా పచ్చని ఆదర్శ పాఠశాలగా మలచుకున్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు, అందుకు సహకారం అందిస్తున్న దాతలు, ఆ ఊరి ప్రజల్ని మనస్ఫూర్తిగా అభినందించాల్సిందే.!

- చందు తిలారు

ఉమ్మడి కార్యాచరణ



మా స్కూల్‌లో ఏ అంశం గురించి అయినా స్టాఫ్ అంతా కూర్చొని చర్చించుకుంటాం. అందరం కలిసి ఉమ్మడి కార్యాచరణ చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. పదో తరగతి ఫలితాల్లో మా విద్యార్థులు వరుసగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉపాధ్యాయుల కృషి, స్థానికుల సహకారం మర్చిపోలేనిది.

-నార్నె శాంతి, ప్రధానోపాధ్యాయురాలు.

ఇదే స్కూల్‌లో చదువుకున్నా!



నేను ఇదే స్కూల్లో చదువుకున్నాను. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, సామాజికాంశాలపై అవగాహన కల్పించడమే మా ఉద్దేశం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ అడ్రస్ అని చెప్పుకునే రోజులు రావాలి. అదే మా ధ్యేయం.

- తోట శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు.

మంచి మాస్టార్లు!



మా స్కూల్లో చేరితే చదువుతోపాటు సామాజిక బాధ్యత అంటే ఏంటో అర్థమవుతుంది. ఒకరికి ఒకరం సాయం చేసుకుంటేనే కదా! మంచి భవిష్యత్తు ఉంటుంది కూడా. మా ఉపాధ్యాయులు మాతో ఎంతో ఫ్రెండ్లీగా ఉంటారు.

- వేల్పుల శివపార్వతి, టెన్త్ విద్యార్థిని

చాలా సంతోషంగా ఉంది !



స్కౌట్‌లో చేరడం చాలా హ్యాపీగా ఉంది. మాకు తెలిసిన విషయాలు చుట్టూ ఉన్నవారికి చెబుతున్నాను. స్కౌట్ శిక్షణలో భాగంగా వీలున్నప్పుడల్లా వివిధ ప్రాంతాలకు తీసుకెళ్ళి, అనేక విషయాలపై అవగాహన కల్పిస్తుంటారు. చదువులు కుంటుపడకుండా మా టీచర్లు బాగా హెల్ప్ చేస్తారు.

- బర్మా సునీల్ కుమార్, స్కౌట్ విద్యార్థి.

ఆరోగ్యం పంచే పెసలు

పెసలు అంటేనే వెంటనే మనకు గుర్తొచ్చేది పొంగలి. కూరల్లో పెసలు వాడతారు. పెసర దోసె రుచిగా ఉంటుంది. ప్రస్తుతం మొలకెత్తిన పెసలు, మూంగ్‌దాల్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రుచితో పాటు ఆరోగ్యాన్ని పంచే పెసలంటే అందరికీ ఇష్టమే. • పెసల్లో విటమిన్ బి, విటమిన్ సి, మాంగనీసుతోపాటు ప్రొటీన్లు అత్యధికంగా ఉంటాయి. ముఖ్యంగా పెసలు చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. సూర్యుని నుంచి వచ్చే అతినీలిలోహిత కిరణాలు, పర్యావరణ కాలుష్యం వల్ల వచ్చే చర్మ సమస్యలు పెసలు ఆహారంగా తీసుకోవటం వల్ల తొలగిపోతాయి. • అంతేనా ఆరోగ్యకరమైన జుట్టూ సొంతమవుతుంది. సున్నిపిండి తయారీలో పెసలను ఉపయోగిస్తారు. దీని వల్ల చర్మంలో మృదుత్వం వస్తుంది. • పెసలు అధికంగా ఉండే బ్లడ్ ప్రెషర్‌ను తగ్గిస్తాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. దీనివల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ. పెసలు తింటే ఆరోగ్యంతో పాటు చురుకుదనం కూడా వస్తుందని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. • వీటిలో ఐరన్ కంటెంట్ అధికంగా ఉంటుంది. రోజూ ఆహారంలో పెసల్ని భాగంచేస్తే రక్తహీనత వ్యాధులు రాకుండా చేయవచ్చు. • బరువు తగ్గాలనుకునే వారికి పెసలు అద్భుతంగా ఉపయోగపడతాయి. రోజూ బియ్యంలోకి కాసిన్ని పెసలు కలిపి పులగం చేసుకుని తింటే ఊహించని రీతిలో బరువు తగ్గొచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. • డయాబెటిస్‌ను క్రమబద్ధీకరించటానికి పెసలు ఉపయోగపడతాయి. క్యాన్సర్ బారిన పడకుండా చేస్తాయి. జీర్ణం సులువుగా అయ్యేట్లు సహాయపడే ఈ ఆహారం తీసుకోవటం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. • పెసలు తినటం వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతినదు. కండరాల నొప్పి, తలనొప్పి, నీరసాన్ని తగ్గించే గుణం వీటికి ఉంది. రోజు వారి మెనూలో పెసలు ఉండటం వల్ల శరీరంలోని అనవసరమైన కెమికల్స్ నాశనం అవుతాయి. కంటిచూపు సమస్యలు దరి చేరవు.



గ్రీన్ టీతో లాభాలెన్నో!



పరిమితి దాటకుండా గ్రీన్ టీ తాగితే ఎన్నో లాభాలున్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. •గ్రీన్ టీ గుండె సంబంధిత వ్యాధులను దూరం చేస్తుంది. •క్యాన్సర్, ఉదరకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, స్థూలకాయాన్ని గ్రీన్ టీ నయం చేస్తుంది. • రెగ్యులర్‌గా గ్రీన్ టీ తాగేవారికి హార్ట్ డిసీజెస్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. •కొన్ని రకాల క్యాన్సర్లను నివారించగలిగే శక్తి గ్రీన్ టీలో ఉంది. –అధిక బరువును తగ్గిస్తుంది. •రోజు గ్రీన్ టీ తాగటం వల్ల అధిక కొలెస్ట్రాల్ తగ్గుతాయి. •గ్రీన్ టీ చర్మ సంరక్షణకు, సౌందర్య పోషణకు కూడా ఉపయోగకరమే. •రాత్రి పూట నిద్రించడానికి గంట ముందు గ్రీన్ టీని తాగితే శరీర మెటబాలిజం బాగా పెరుగుతుంది. దీనివల్ల బరువు తగ్గుతారు. •కాటెచిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు గ్రీన్ టీలో పుష్కలంగా ఉంటాయి. రాత్రి పూట నిద్రకు ముందు గ్రీన్ టీని తాగడం వల్ల ఈ యాంటీ ఆక్సిడెంట్లు తమ పని ప్రారంభిస్తాయి. దీంతో శరీరంలో అంతర్గతంగా ఉన్న అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. అంతేకాదు రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది.

ప్రెగ్నెన్సీ సమయంలోనూ..!



ప్రెగ్నెన్సీ సమయంలో ఒత్తిడికి గురవ్వడం మంచిది కాదు. అందుకే ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఈ పద్ధతుల్ని పాటించాలి. కారణం లేకుండా ఎలాంటి ఒత్తిడీ దరిచేరదు. అందుకే ముందుగా దానికి కారణాన్ని గుర్తించాలి. ఒకవేళ ఆ సమస్యని పరిష్కరించుకోవడం మీవల్ల కాకపోతే ఇతరుల సహాయం తీసుకోవడానికి ఆలోచించకూడదు. ఒంటరిగా ఉంటే పలు రకాల ఆలోచనలు కలుగుతుంటాయి. అందుకని నలుగురిలో ఎక్కువసేపు ఉండేందుకు ప్రయత్నించాలి. ఇంట్లోని పరిస్థితులు, బాధ్యతలే మీ ఒత్తిడికి కారణమైతే కొన్నిరోజులపాటు వాటన్నింటికీ దూరంగా ఉండాలి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి వాకింగ్ మంచి మెడిసిన్. సాయంత్రంపూట ఆరు బయట కాసేపు నడవాలి. వాకింగ్ మొదలుపెట్టేటప్పుడు డాక్టర్ సలహా తప్పనిసరి. సంగీతం వినడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడొచ్చు. అయితే అదే పనిగా రోజంతా సంగీతం వినడమూ మంచిదికాదు. అలాగే సరైన పోషకాలు అందకపోయినా ఒత్తిడి పెరుగుతుంది. అందుకే పౌష్టికాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ఒత్తిడి అధికంగా అనిపించినప్పుడు వైద్యుల్ని సంప్రదించాలి.

'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com ఫోన్ నెం. 9490099006 మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

జీవన సౌరభం

జీవితం ఒక తరంపాటే ఉంటుంది. కానీ మంచిపేరు చిరకాలం ఉంటుంది.

మీ కోసం

ఆలీవ్ లేదా ఆల్మండ్ నూనెల్ని ముఖానికి రాసుకుని పది నిముషాల తర్వాత కడిగేస్తే చర్మం మెరుపు వస్తుంది.



వర్తమాన అంశాలు (అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ) పోటీ పరీక్షల ప్రత్యేకం

కల్తీ కల్లులో కలిపే మత్తుమందు పేరు?

దీపిక



కుర్రా శ్రీనివాసరావు,
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9701415678

చంద్రునిపైకి ప్రయివేట్ ల్యాండర్



చంద్రుడిమీదకు ఒక రోబోటిక్ ల్యాండర్‌ను పంపేందుకు 'మూన్ ఎక్స్‌ప్రెస్' సన్నద్ధమవుతోంది. తద్వారా ఆ ఘనత సాధించిన తొలి ప్రయివేటు కంపెనీగా గుర్తింపు పొందాలని భావిస్తోంది. ఈ ల్యాండర్ చంద్రుడి మీద ధూళిని సేకరించి, చిన్న క్యాప్సూల్ ద్వారా భూమికి పంపుతుంది. దీని ప్రయోగం న్యూజిలాండ్ నుంచి రాకెట్ ల్యాబ్ సంస్థకు చెందిన ఎలక్ట్రాన్ రాకెట్ ద్వారా నింగిలోకి పంపనున్నారు.

ప్రత్యేకతలు...

ఎంఎక్స్-1ఈ : 500 మీటర్ల దూరం పాటు ప్రయాణించేలా ఈ వ్యోమనౌకను రూపొందిస్తున్నారు. ఇది చంద్రుడి ఉపరితలాన్ని మ్యాప్ చేస్తుంది. అత్యంత నాణ్యమైన వీడియోలను భూమికి పంపుతుంది.

నమూనాలను తెచ్చే క్యాప్సూల్ : చంద్రుని నుంచి ఎనిమిది కిలోల నమూనాలను భూమికి తీసుకురాగలదు.

పెకో ఇంజిన్ : రాకెట్ శ్రేణి కిరోసిన్‌తో కూడిన ఆర్‌పీ-1ను ఇంధనంగానూ, హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఆక్సిడైజర్‌గానూ వాడుకుంటుంది.

ఎంఎక్స్-9 ల్యాండర్ : తొమ్మిది పెకో ఇంజిన్లు 500 కిలోల బరువును చంద్రుడి ఉపరితలానికి చేరవేయగలవు. ఎంఎక్స్-1 ఆరోహణ వాహనం నమూనాల సేకరణ చంద్రుడిపై నీటి నిల్వలకు సంబంధించి ఆనవాళ్ల అగ్నిపర్వత అవక్షేపాల్లో అన్వేషణ చేస్తుంది.

దిగే ప్రదేశం : చంద్రుడి మధ్యరేఖా ప్రాంతం, అక్కడ పురాతన అగ్నిపర్వత అవక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి.

వీలర్ ఐలాండ్‌కు అబ్దుల్ కలాం పేరు



ఒడిశా తీరంలోని వీలర్ దీవికి (ఐలాండ్) ఆ రాష్ట్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజె అబ్దుల్ కలాం పేరు పెట్టింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధికారికంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించి కేంద్రం ఆమోదం తెలుపగా, ఆ వెంటనే రాష్ట్ర రెవెన్యూశాఖ గెజిట్ విడుదల చేసింది. అబ్దుల్ కలాం క్షిపణి శాస్త్రవేత్తగా ఉన్న సమయంలో ఒడిశాలోని భద్రక్ జిల్లా చాంద్‌బలి ప్రాంతంలోని క్షిపణుల ప్రయోగశాలను పలుమార్లు సందర్శించారు. ఆ సమయంలోనే ఇక్కడి బంగాళాఖాతంలో వీలర్ దీవిని గుర్తించి.. క్షిపణి ప్రయోగాలకు అనుకూలంగా ఉంటుందని సూచించారు. అనంతరం ఇక్కడ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ మిస్సైల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి క్షిపణి ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.

తొలి మానవరహిత యుద్ధ ట్యాంకు 'మంత్ర'

దేశంలోనే తొలి మానవరహిత యుద్ధ ట్యాంకు 'మంత్ర' చెన్నయి శివారు ఆవడిలోని ట్యాంకు పరిశ్రమలో తయారైంది.



అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆవడిలోని సీవీఆర్‌డీఈ (కంబాట్ వెహికల్స్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్)లో ఏర్పాటు చేసిన యుద్ధ పరికరాల ప్రదర్శనలో ఇది కొలువుదీరింది. వీటిలో మూడు రకాలున్నాయని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అధికారులు తెలిపారు. ఒకటి నిఘా, మరొకటి మందుపాతరల గుర్తింపునకు వినియోగించవచ్చని వివరించారు. ఇంకో ట్యాంకును అణు, జీవాయుధాల దాడి భయం ఉన్న ప్రాంతాల్లో పర్యవేక్షణకు ఉపయోగించే వీలుంటుందని తెలిపారు. ఈ ట్యాంకును 53 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉండే రాజస్థాన ఎడారుల్లో పరిశోధించామని తెలిపారు. 15 కిలోమీటర్ల పరిధిలోని అణు, జీవాయుధాలను గుర్తించే సామర్థ్యం దీనికి ఉంటుందన్నారు. వీటిని మావోయిస్టుల గాలింపు చర్యల్లో ఉపయోగించే అంశాన్ని పారామిలటరీ దళం పరిశీలిస్తోందన్నారు.

494 మీటర్ల పాదచారుల వంతెన

494 మీటర్ల పొడవైన పాదచారుల వంతెన స్విట్జర్లాండ్‌లోని రండాలో జులై 29న లాంఛనంగా ప్రారంభమైంది. ఇది గ్రెచెన్, జెర్మట్ గ్రామాలను అనుసంధానించడానికి యూరోపవెగ్ వద్ద దీన్ని నిర్మించారు. ప్రపంచంలోనే ఎత్తైన ప్రాంతంలో ఉన్న పొడవైన పాదచారుల వంతెన ఇదేనని భావిస్తున్నారు.

చైనా చేతికి శ్రీలంక రేవు

వ్యూహాత్మక హంబంటోటా రేవులో 70 శాతం వాటాను చైనాకు విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 110 కోట్ల డాలర్ల ఒప్పందంపై సంతకం పెట్టింది. ఈ చర్యవల్ల భారత్‌లో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ రేవును చైనా నౌకాదళం వాడుకునే అవకాశముందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ ఒప్పందంలో ఇప్పటి వరకూ జాప్యం జరిగింది. తాజా ఒప్పందం ప్రకారం నష్టాల్లో నడుస్తున్న ఈ రేవును చైనా ప్రభుత్వం ఆధ్వర్యంలోని చైనా మర్చంట్ పోర్ట్ హోల్డింగ్స్‌కు అప్పగిస్తారు. 99 ఏళ్లపాటు సాగే ఈ లీజు ఒప్పందం ఈ రేవుపై చైనా సంస్థ 110 కోట్ల డాలర్లను పెట్టుబడిగా పెడుతుంది. ఇందులో భాగంగా శ్రీలంక నౌకాయాన మంత్రి మహింద సమరసింఘే, కొలంబోలో చైనా రాయబారి ఇ జియాన్ లియాంగ్‌లు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంపై భారత్ ఆందోళనలను దూరం చేసే ఉద్దేశంతో రేవు భద్రత బాధ్యతను శ్రీలంక నౌకాదళమే చేపట్టేలా నిబంధన పెట్టారు.

మీ నాలెడ్జి తెలుసుకోండి

1. నీటి పంపిణీ సరఫరా వినియోగం లెక్కలలోకి ఖచితత్వం కోసం ఉపయోగిస్తున్న విధానం పేరేమిటి ?
ఎ. ట్రిగనామెట్రీ బి. టెలిమెట్రీ
సి. పర్సెక్ట్రీ డి. పైవన్నీ

2. డాక్టర్ సి.నా.రె జయంతి సందర్భంగా రవీంద్ర భారతిలో 29 జులై 2017న విడుదల చేసిన సంచిక ఏది ?
ఎ. స్వర నారాయణీయం బి. గాన నారాయణీయం
సి. అమృత నారాయణీయం డి. అపర నారాయణీయం

3. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యం అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం అక్టోబర్‌లో నిర్వహిస్తున్న సర్వే పేరు ?
ఎ. ఎన్ఆర్ఎస్ (నేషనల్ రీడింగ్ సర్వే)
బి. ఎన్ఏఎస్ (నేషనల్ ఎలిజిబుల్ సర్వే)
సి. ఎన్ఏఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)
డి. పైవేవీకావు

4. పాకిస్తాన్ మొదటి ప్రధానమంత్రి ?
ఎ. లియాఖత్ అలీఖాన్ బి. కవాజ్ నాజముద్దీన్
సి. చౌదరీ మహ్మద్ డి. హుసేన్ సయ్యద్

5. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం ఎప్పుడు జరుపుతారు ?
ఎ. ఆగస్టు 30 బి. జులై 30
సి. సెప్టెంబర్ 30 డి. నవంబర్ 30

6. దేశంలో అన్ని రకాల కళాశాలు, విశ్వవిద్యాలయాల చదువులకు సంబంధించిన అన్ని ధృవపత్రాలు నకిలీవి సృష్టించకుండా ఏర్పాటు చేస్తున్న అత్యంత భద్రమైన నూతన వ్యవస్థ పేరు ?



ఎ. నేషనల్ సర్టిఫికెట్ డిపాజిటర్
బి. నేషనల్ అఫిడవిట్ డిపాజిటర్
సి. నేషనల్ అకడమిక్ డిపాజిటర్
డి. పైవేవీ కావు

7. ఇటీవల బ్రిక్స్ దేశాల (నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్) జాతీయ భద్రతా సలహాదార్ల సమావేశానికి హాజరైన భారత నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ ఎవరు ?
ఎ. శివశంకర్ బి. అమిత్‌కుమార్
సి. అజిత్ మిశ్రా డి. అజిత్ దోవల్

8. జమ్మూ- కాశ్మీర్ ప్రజలకు కల్పించిన ప్రత్యేక హక్కులకు సంబంధించిన ఏ ఆర్టికల్‌పై సుప్రీంలో కేసు నడుస్తుంది ?
ఎ. 370 బి. 35ఎ సి. 35బి డి. 360

9. ఇటీవల ఐటి రంగంలో విప్లవం సృష్టిస్తున్న ఐఓటి అనగానేమి ?
ఎ. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ బి. ఇంటర్నెట్ ఆఫ్ ట్రైల్
సి. ఇంటర్నెట్ ఆఫ్ థియరీ డి. ఇంటర్నెట్ ఆఫ్ టూల్స్

10. కల్తీ కల్లులో కలిపే మత్తు మందు పేరు ?
ఎ. పెప్పర్ స్ప్రే బి. ఆల్ఫ్రా జోలం
సి. అజొల్లా డి. ఏదీకాదు

11. ఆంధ్రప్రదేశ్‌లో జలవనరుల వద్ద ఆగస్టులో నెల రోజులపాటు నిర్వహించే పూజా కార్యక్రమం పేరేమిటి ?
ఎ. జలవిహార్ బి. జలనిర్మాణ్
సి. జలహారతి డి. ఏదీకాదు

12. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ?
ఎ. త్రిపురాన వెంకటరత్నం బి. నన్నపనేని రాజకుమారి
సి. నన్నపనేని రామకుమారి డి. త్రిపురాన వెంకటజ్యోతి

13. ఆంధ్రప్రదేశ్‌లోని ఏ వయసు వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని యోచిస్తున్నారు ?
ఎ. 18-25 సంవత్సరాలు బి. 20-30 సంవత్సరాలు
సి. 25-35 సంవత్సరాలు డి. 18-35 సంవత్సరాల

14. ఆంధ్రప్రదేశ్‌లో ఏ రెండు నదుల అనుసంధాన ప్రక్రియ (రూ.65 కోట్లు) త్వరలో ప్రారంభం కానున్నది ?
ఎ. పెన్నా – నాగావళి బి. చెంపావతి – నాగావళి
సి. వంశధార – నాగావళి డి. మున్నేరు – నాగావళి

సమాధానాలు : 1.బి, 2.ఎ, 3.సి, 4.ఎ, 5.బి, 6.సి, 7.డి, 8.బి, 9.ఎ, 10.బి, 11.సి, 12.బి, 13.డి, 14.సి.

బిట్‌బ్యాంక్

1. పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానిగా నియమితులైనవారు ? **- షహీద్‌ఖాకన్ అబ్బాసీ**
2. చంద్రునిమీదకు ఒక రోబోటిక్ ల్యాండర్‌ను పంపనున్న తొలి ప్రయివేటు కంపెనీ ఏది ? **- మూన్ ఎక్స్‌ప్రెస్ (అమెరికన్ కంపెనీ)**
3. మూన్ ఎక్స్‌ప్రెస్ చందమామ మీదకు రోబోటిక్ ల్యాండర్‌ను ఏ దేశం నుంచి ఏ రాకెట్ ద్వారా పంపనున్నది ? **- న్యూజిలాండ్, ఎలక్ట్రాన్ రాకెట్**
4. డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) రాసిన చివరి కవితా సంకలనం ఏది ? **- కలం అలిగింది**
5. ఇటీవల చైనా కొనుగోలు చేసిన శ్రీలంకకు చెందిన ఓడరేవు పేరేమిటి ? **- హంబంటోటా (70శాతం వాటా విక్రయం)**
6. అమెరికాను లక్ష్యం చేసుకుని ఉత్తర కొరియా పరీక్షించిన ఐసిబిఎం పేరేమిటి ? **- హ్వాసాంగ్ -14 (దీని పరిధి 10,000 అని నిపుణుల విశ్లేషణ)**
7. దేశంలోనే తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ ? **- మంత్ర**
8. దేశంలో తొలి మానవ రహిత యుద్ధట్యాంక్ మంత్రను ఎక్కడ తయారు చేశారు ? **- ఆవడి (కంబాట్ వెహికిల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్)**
9. ప్రపంచంలోనే ఎత్తైన ప్రాంతంలో ఉన్న పొడవైన పాదచారుల వంతెన ఎక్కడ ప్రారంభమైంది ? **- స్విట్జర్లాండ్‌లోని రండా**
10. ఆంధ్ర యూనివర్శిటీ 83, 84వ స్నాతకోత్సవంలో 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ఎవరికి ఇచ్చింది ? **- డాక్టర్ విజయ్ పాండురంగ భట్కర్ (నలంద యూనివర్శిటీ కులపతి)**
11. ఆంధ్రాయూనివర్శిటీ 83,84వ స్నాతకోత్సవంలో పిహెచ్ పట్టా అందుకున్న కేంద్ర మాజీ మంత్రి ఎవరు ? **- పనబాక లక్ష్మి**
12. ట్రంప్ గీసిన చిత్రపటం వేలంలో ఎంతకు అమ్ముడు పోయింది ? **- 19 లక్షలు**
13. డ్రగ్స్ కేసు విచారణలో కీలక పాత్ర వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ ఎంఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎవరు ? **- అకున్ సబర్వాల్**
14. నల్సార్ యూనివర్శిటీ చాన్స్‌లర్ ఎవరు ? **- జస్టిస్ రమేష్ రంగనాథన్**
15. రైతునేస్తం పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో డా.ములుగలేటి శివరాం రచించిన పుస్తం ? **- గో సంజీవని**
16. ఈ– ప్రగతి ఎలా అమలు చేయాలి, ఈ కార్యకలాపాలు ఎలా నిర్వహించాలి అనే అంశంపై ఎపి అధికారులకు శిక్షణ ఇవ్వనున్న సంస్థ ? **- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్**



17. పాత్రికేయులు దేవులపల్లి అమర్ రచించిన ఏ పుస్తకాన్ని జాస్తి చలమేశ్వర్ ఆవిష్కరించారు ? **- సూటిమాట**
18. ఇటీవల విజ్ఞాన్ యూనివర్శిటీ ఐదో స్నాతకోత్సవంలో ఎంత మందికి గౌరవ డాక్టరేట్లు ఇచ్చింది ? **- ముగ్గురు (1. కిరణ్‌కుమార్ -ఇస్రో చైర్మన్, 2. కె.విశ్వనాథ్ -సినీ దర్శకుడు, 3. కల్పనా నరేంద్రన్ -అరవిందా కంటి ఆస్పత్రి వైద్యులు)**
19. పాకిస్తాన్ చరిత్రలో తొలిసారిగా అవినీతి ఆరోపణలతో వైదొలగిన ప్రధానమంత్రి ఎవరు ? **- నవాజ్ షరీఫ్**
20. భూశాస్త్ర మంత్రిత్వశాఖ (మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఆవిర్భావ దినోత్సవం (జులై 27న) సందర్భంగా జాతీయ ప్రతిభా అవార్డు (నేషనల్ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ -2017) ఎవరికి ప్రధానం చేశారు ? **- ప్రొ.కె.ఎస్.కృష్ణ**
21. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్‌కు తెలంగాణా ప్రభుత్వం ప్రకటించిన నజరానా ? **- కోటి రూపాయలు (కోచ్ మూర్తికి 25 లక్షలు)**
22. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం 2016 సంవత్సరానికి గానూ ఎంతమందికి కీర్తి పురస్కారాలు ప్రదానం చేసింది ? **- 40 మందికి**
23. మాన్ బుకర్ ప్రైజ్ ఎంపికకుగానూ తుది 13 జాబితాలో నిలిచిన భారత రచయిత్రి అరుంధతీ రాయ్ రాసిన పుస్తకం పేరేమిటి ? **- ది మినిస్ట్రీ ఆఫ్ అట్‌మోస్ట్ హ్యాపీనెస్**
24. ఇటీవల మరణించిన కర్నాటక మాజీ ముఖ్యమంత్రి ? **- ధరం సింగ్**
25. పికెఎల్ ప్రో కబడ్డీ లీగ్ ఎన్నోది ? **- ఐదో సీజన్ (ఈ సీజన్ ప్రైజ్‌మనీ ఎనిమిది కోట్లు)**
26. జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఎవరు ? **- లలితా కుమార మంగళం**
27. ఆసియా ఉత్తమ 200 సంస్థల జాబితాలో చోటు దక్కించుకున్న హైదరాబాదీ సంస్థ ? **- కెల్టన్ టెక్ సొల్యూషన్స్**
28. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధుకు ఇచ్చిన గ్రూప్-1 ఉద్యోగం ఏది ? **- డిప్యూటీ కలెక్టర్**

సెన్సెక్స్ ▼ 98 32,476 | నిఫ్టీ ▼ 33 10,081 | రూపాయి ▲ 39 పైసలు ఒక అమెరికా డాలరుకు రూ. 63.69

రుణాలు మరింత చౌక

ముంబయి : రుణ గ్రహీతలకు శుభవార్త. అప్పులపై వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. అంచనాలకు అనుగుణంగానే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించింది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6 శాతంగా నిర్ణయించింది. దీంతో ఆరున్నరేళ్ల కనిష్టానికి వడ్డీ రేట్లు తగ్గాయి. 2010 నవంబర్‌లో ఈ స్థాయి వడ్డీరేట్లు అమల్లో ఉన్నాయి. రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన ఆర్‌బిఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపిసి) సమావేశంలో మెజారిటీ సభ్యులు పావు శాతం వడ్డీ రేట్ల తగ్గింపునకు అనుకూలంగా వ్యవహరించారు. ఎంపిసి సభ్యులు చేతన్ ఘటె, పమి దువా, విరాల్ వి ఆచార్య, ఉర్జిత్ పటేల్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల తగ్గింపునకు ఓటు వేశారు. కాగా రవీంద్రా హెచ్ రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని కోరారు. మరో సభ్యుడు మైఖెల్ డెబబ్రత పత్రా వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని పేర్కొన్నారు. వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా గృహ, వాహన, రిటైల్ రుణాలకు డిమాండ్ పెరగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్‌బిఐ సానుకూల నిర్ణయం తీసుకున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్లలో విశ్వాసం నింపలేకపోవడం గమనార్హం.

సానుకూల అంశాలు..

వడ్డీ రేట్ల తగ్గింపునకు వివిధ కారణాలు దోహదం చేశాయి. ముఖ్యంగా గత కొంత కాలంగా రుణాల మంజూరు వృద్ధి రేటులో స్తబ్దత చోటు చేసుకుంది. వృద్ధి రేటులో తగ్గుదల, ద్రవ్యోల్బణం దిగిరావడం ప్రధాన కారకంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ ఐదేళ్ల కనిష్టానికి పడిపోయింది. ఏడాదికి ఏడాదితో పోల్చితే రుణాల మంజూరులో కేవలం 6 శాతం పెరుగుదల నమోదయ్యింది. వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా రుణపరపతి పెంచడం, వృద్ధి రేటుకు మద్దతునివ్వాలని ఆర్‌బిఐ ప్రధాన యోచనగా ఉంది. పెద్ద నోట్ల రద్దు, కొనుగోలు శక్తి పడిపోవడం, పారిశ్రామికోత్పత్తి పతనం తదితర పరిణామాలతో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కూడా మందగించింది. ఒకప్పుడు 9.1 శాతంగా నమోదైన వృద్ధి రేటు 2016-17 చివరి త్రైమాసికంలో ఇది ఏకంగా6.1 శాతానికి పడిపోయింది. పారిశ్రామికోత్పత్తి ఎనిమిది సంవత్సరాల కని ష్టానికి క్షీణించింది. జులైలో ప్రజల కొనుగోలు శక్తి కూడా 47.9 పాయింట్లకు తగ్గింది.

కోతలకు ఇంకా అవకాశం : ఉర్జిత్ పటేల్

తగ్గుతున్న ద్రవ్యోల్బణం, సానుకూలంగా జిఎస్‌టి అమలు వల్ల మరింత వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశాలు ఉన్నాయని ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు. ఎంపిసి సమావేశం అనంతరం బుధవారం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతానికి పరిమితం చేయాలని ఆర్‌బిఐ నిర్దేశించుకుందన్నారు. దీంతో వృద్ధి రేటుకు మద్దతునివ్వాలని భావిస్తున్నామన్నారు. గత మూడు మాసాలుగా అహారం, ఇంధనం ఉత్పత్తులు మినహా ద్రవ్యోల్బణం సూచీ తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ద్రవ్యోల్బణం 2.0-3.5 శాతం, ద్వితీయార్థంలో 3.5-4.5 శాతం మధ్య నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. చరిత్రలోనే అతి కనిష్ట స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదవుతుందన్నారు. కొన్ని విభాగాల్లో బ్యాంకులు చౌక రుణాలు అందించడానికి అవకాశాలు ఉన్నాయనిఉర్జిత్ పేర్కొన్నారు. నగదు ప్రవాహం సాధారణ స్థితికి చేరిందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్యా పేర్కొన్నారు. బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత వడ్డీ రేట్లు (ఎంసిఎల్ఆర్)పై అనుసరిస్తున్న విధానంపై సెప్టెంబర్‌తో ఒక నివేదిక ఇవ్వ నున్నామన్నారు.

గృహ రుణాలు చౌక..

ఆర్‌బిఐ కీలక వడ్డీరేటును పావు శాతం తగ్గించడంతో గృహ రుణాలపై వడ్డీ రేటు తగ్గనుంది.

కానరాని వడ్డీ రేట్ల మద్దతు

నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబయి : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానం సమీక్షలో కీలక వడ్డీ రేట్లను తగ్గించినప్పటికీ మార్కెట్లలో ఆ ఉత్సాహం కానరాలేదు. ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తూ ఆర్‌బిఐ తీసుకున్న నిర్ణయాన్ని మదుపర్లు తేలికగా తీసుకున్నట్టుగా బ్రోకర్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఇంతక్రితం సెషన్ వరకు వరుసగా పెరిగిన మార్కెట్ల నేపథ్యంలో మదుపర్లు కూడా లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఆయిల్ ధరలు తగ్గడంతో యూరోపియన్ మార్కెట్లు పడిపోగా, ఏషియన్ మార్కెట్లు మిశ్రమ లాభాలను నమోదు చేశాయి. ఈ నేపథ్యంలో బిఎస్ఇలో సెన్సెక్స్ 98.43పాయింట్లు తగ్గి 32,476.74 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 33.15 పాయింట్లు నష్టపోయి 10,081.50 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ రంగాల వారిగా ఐటీ సూచీ 088శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.83శాతం, ఎఫ్ఎంసీజీ 0.76శాతం, టెక్ 0.75శాతం చొప్పున పడిపోయాయి.

మరోవైపు కన్స్యూమర్ డురేబుల్స్ సూచీ 1.12శాతం, విద్యుత్ 0.11శాతం చొప్పున పెరిగాయి. ఎన్‌టీపీసీ 4.06శాతం, హీరో మోటో కార్ప్ 2.12శాతం, అదానీ ఫోర్ట్స్ 2.08శాతం, లూపిన్ 1.6శాతం, రిలయన్స్ 1.59శాతం చొప్పున అత్యధిక లాభాలు పొందిన వాటిలో ముందు వరుసలో నిలిచాయి. మరోవైపు సన్‌ఫార్మా 1.95శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.93శాతం, టాటామోటార్స్ 1.66శాతం, కోటక్ బ్యాంకు 1.39శాతం, టీసీఎస్ 1.3శాతం చొప్పున భారీగా నష్టపోయిన వాటిలో ముందున్నాయి.



రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా
ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష.

ప్రధానాంశాలు..

- రెపోరేటు 0.25 శాతం తగ్గించి 6 శాతంగా నిర్ణయం.
- రివర్స్ రెపో రేటు 0.25 శాతం తగ్గింపు, 5.75 శాతానికి చేరిక.
- ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. అయినా 4 శాతానికి నియంత్రించేలా చర్యలు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3% వృద్ధి రేటు అంచనా.
- క్రితం జులై 28 నాటికి విదేశీ మారకం నిల్వలు 392.9 బిలియన్ డాలర్లు.
- బడా మొండి బాకీల పరిష్కారానికి ప్రభుత్వం, ఆర్‌బిఐ కృషి.
- పెట్టుబడుల్లో పునరుత్తేజం అవసరం.
- మౌలిక వసతుల ప్రాజెక్టుల అవాంతరాలు తొలగించడం ద్వారా పెట్టుబడులకు మద్ధతు.
- తదుపరి ఎంపిసి మీటింగ్ 2017 అక్టోబర్ 3, 4న.

PTI GRAPHICS

హామీల అమలులో నిర్లక్ష్యంపై 4 నుంచి ఉద్యమిస్తాం

గరగపర్రు దళిత ఉద్యమ సంఘీభావ కమిటీ హెచ్చరిక

ప్రజాశక్తి-పాలకోడేరు (పశ్చిమ గోదావరి)

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 4 నుంచి ఉద్యమిస్తామని గరగపర్రు దళిత ఉద్యమ సంఘీభావ కమిటీ హెచ్చరించింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రులో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు పివి.రామకృష్ణ మాట్లాడారు. సాంఘిక బహిష్కరణ విషయంలో మంత్రులు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. పంచాయతీ పాత భవనం వద్దే అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వ లాంఛనాలతో ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. ఈ నెల 4న భీమవరంలో సిపిఎం, సిపిఐ సహా పది వామపక్ష పార్టీలు, వైసిపి, దళిత, అంబేద్కర్, ప్రజాసంఘాలు, సంస్థలను కలుపుకుని సంఘీభావ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో కొంతమంది ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఎంతమంది అడ్డొచ్చినా ఉద్యమాన్ని అణచలేరని అన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు చెరబండ రాజు, ఎరిచర్ల రాజేష్, విప్పర్తి ఏసురాజు, ఏసుపాదం, ఎం.గిరి, మార్తమ్మ, సుందరమ్మ, కుమారి, అన్నమ్మ పాల్గొన్నారు.

జీఓ 279 రద్దు కోరుతూ రేపు మౌన ప్రదర్శనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణాల్లో ప్రజారోగ్యాన్ని, పౌరసేవలను కార్పొరేట్ సంస్థలకు తాకట్టుపెట్టే జీఓ279, టెండర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 4న మౌన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ జెఎసి నాయకులు కె ఉమామహేశ్వరరావు, ఎ రంగనాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు, పట్టణ ప్రజల సంక్షేమానికి తూట్లు పొడుస్తూ కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఎర్రతివాచీ పరచడం అవివేకమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజలపై కోట్లాది రుపాయల భారం మోపే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని కోరారు. మౌన ప్రదర్శనల్లో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గుంటూరులో మంత్రి పుల్లారావు తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మాల్స్, ఇతర దుకాణాల్లో వస్తువులను ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ప్రజలు వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 1100కి ఫోన్ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు కోరారు. బుధవారం గుంటూరు రైల్వే స్టేషనలోని దుకాణాల్లో విక్రయిస్తున్న వస్తువుల నాణ్యత, ఎంఆర్‌పి కన్నా అధిక ధరల విక్రయం తదితర అంశాలపై ప్రయాణికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లూజు వాటర్ విక్రయ కేంద్రంలో లీటరు తాగునీరు రూ.5కు విక్రయించాల్సి ఉండగా రూ.10 తీసుకుంటున్నారని అల్లం వీర బ్రహ్మం అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్టాల్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డుపై రూ.5 ఉంచి రూ.10 ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. హడావుడిలో చిల్లర కూడా ఇవ్వడం లేదని మరికొందరు ఫిర్యాదు చేశారు. తినుబండారాలనూ మంత్రి పరిశీలించారు. ప్రజల్లోచైతన్యం రావాలని, అధిక ధరలకు విక్రయిస్తే ప్రశ్నించాలని మంత్రి సూచించారు. అనంతరం చిలకలూరిపేటలో లబ్ధిదార్లకు ముర్రాజాతి గేదెలను మంత్రి అందజేశారు.

బిటెక్‌లో నకిలీ ధ్రువపత్రాలు

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం ఎట్టకేలకు బిటెక్ ధ్రువపత్రాలతో గుట్టు రట్టయింది. ఎంతోకాలంగా యూనివర్సిటీ పేరుతో నకిలీ ధ్రవపత్రాలు హల్‌చల్ చేస్తున్నాయని గతంలో నుంచే ఆరోపణలున్నాయి. గతంలోనూ ప్రజాశక్తి నకిలీ సర్టిఫికెట్ల హల్‌చల్ పేరుతో వేలాది రూపాయలు చేతులు మారుతున్న తీరును ప్రచురించింది. కొద్ది రోజుల కిందట బిటెక్ విభాగంలో కన్సాలిడేటెడ్ మార్కుల జాబితా కోసం పొన్నూరుకు చెందిన తనూజ్ కుమార్ అనే విద్యార్థి వర్సిటీకి వచ్చి దరఖాస్తు చేసుకున్నారు. తనూజ్ దరఖాస్తుకు, రికార్డులకు ఎటువంటి సంబంధం లేకపోవడంతో సిబ్బంది కంప్యూటర్ డేటాను పరిశీలించి తనూజ్ మార్కుల జాబితాలను నకిలీవిగా తేల్చారు. దీనిపై గుంటూరులోని ఒక కళాశాల పేరును దానిపై ముద్రించినట్లు గుర్తించారు. దీనిపై తనూజ్‌ను విచారించగా తాను హైదరాబాద్‌లో రంజిత్ కుమార్ అనే వ్యక్తి నుంచి వాటిని కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో విసి ఆదేశాల మేరకు పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. 60
2. పారిస్
3. జుల్ఫికర్ మైమటలి
4. కణజీవశాస్త్రం
5. అరవింద్ పనగడియా

వెల్లువెత్తిన నిరసనలు

- గ్యాస్ సబ్సిడీ ఎత్తివేతపై సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు
- విశాఖ జిల్లా చోడవరంలో అరెస్టులు



గ్యాస్ సబ్సిడీ ఎత్తివేతకు నిరసిస్తూ విశాఖలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- యంత్రాంగం

గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయాలని, ప్రతి నెలా గ్యాస్ ధర పెంచాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ బీసెంట్ రోడ్డులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గ్యాస్ త్రాసు - గ్యాస్ భారం పేరుతో వినూత్న ప్రదర్శనల ద్వారా గ్యాస్ ధరల పెంపుపై నిరసన తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణలంకలోని సత్యం హోటల్ వద్ద ధర్నా జరిగింది. కృష్ణా జిల్లా నూజివీడులోని చినగాంధీ బొమ్మ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విశాఖ నగరంలోని ఆరిలోవలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో మహిళలు నిరసన తెలిపారు. జగదాంబ జంక్షన్లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన జరిగింది. విశాఖ జిల్లా అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డుపై రాస్తారోకో, నెహ్రూచౌక్ జంక్షన్లో మానవహారం నిర్వహించారు. అరకులోయలో నాలుగు రోడ్ల జంక్షన్‌లోనూ, పెదబయలులో అంబేద్కర్ కూడలిలోనూ రాస్తారోకోలు జరిగాయి. నర్సీపట్నం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. చోడవరంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహ రించారు. నాయకులను పక్కకు నెట్టేశారు. సిపిఎం నాయకులు మట్టా రమణ, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులను అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూ రులో జ్యూట్‌మిల్లు సెంటర్లోనూ, గణపవరం మండలం కేశవరం లోనూ కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మను సిపిఎం నాయకులు దహనం చేశారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ తాజాగా గ్యాస్‌పై పూర్తిగా సబ్సిడీ తొలగిస్తా మనడం దారుణమన్నారు. శ్రీకాకుళం నగర ంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతు బజార్ కూడలి వద్ద మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. విజయ నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్లో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో జరి గింది. ప్రజలపై భారాలు వేస్తున్న ప్రధాన మంత్రి మోడీ బుద్ధి మారాలని కోరుతూ సాలూరు తహశీల్దార్ కార్యాలయం వద్దగల గాంధీ విగ్రహానికి సిపిఎం నాయకులు వినతిపత్రం ఇచ్చి తమ నిరసన తెలిపారు. బొబ్బిలిలో కోర్టు జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. నెల్లూరులో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విగ్రహం నుంచి ట్రంకురోడ్డు మీదుగా గాంధీబొమ్మ వరకూ నిరసన ప్రదర్శన చేశారు.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం ఉద్యమం

- రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల ధర్నాలు



విజయవాడలో ధర్నానుద్ధేశించి మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీ సెంటర్లను కుదించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని,32, 11 జిఒలను రద్దు చేయాలని, ఇంటి అద్దెలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ (సిఐటియు)ఆధ్వర్యాన బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. విజయవాడలో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు, హెల్పర్లు పెద్దసంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నగర కమిషనర్ కె.నివాస్‌ను కలిసి అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం అంగన్‌వాడీ సిబ్బంది సంఘటితంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. మున్సిపల్ పట్టణాల్లో ఉన్న 3,126 అంగన్‌వాడీ సెంటర్లను 1,026కు కుదించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ సుప్రజ తదితరులు పాల్గొ న్నారు. కృష్ణాజిల్లా గుడివాడ, నూజి వీడు మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ అధి కారులకు వినతిపత్రాలు అందజేశారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ మొహుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్ వాడీలు ధర్నా నిర్వహించారు. విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి మున్సిపల్ కార్యాల యాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాలు నిర్వహించి, ఆయా మున్సిపల్ చైర్మన్లకు వినతులు అందజేశారు. సిఐ టియు, శ్రామిక మహిళా సంఘం నాయ కులు మద్దతు తెలిపారు. శ్రీకాకుళంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద అంగన్ వాడీలు ధర్నా చేశారు. పాలకొండలో నగర పంచాయతీ అధికారులకు వినతిపత్రం అంద జేశారు. అంగన్‌వాడీ కేంద్రాలపై నారాయణ విద్యాసంస్థలు, తదితర ప్రయివేటు వ్యక్తుల పెత్తనం వద్దంటూ పశ్చిమగోదావరి జిల్లాలో అంగన్‌వాడీలు ఆందోళనలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ సాంబ శివరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మున్సిపల్ కార్యాల యాల ఎదుట నిరసన తెలిపారు. అనం తరం తహశీల్దార్, మున్సిపాల్టీ కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించారు.

'వంశధార' పనులు అడ్డగింత

సమస్యలు పరిష్కరించాకే పనులు చేపట్టాలని డిమాండ్



స్పిల్‌వే పనుల వద్దకు ర్యాలీగా వెళ్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)

తమ సమస్యలు పరిష్కరించకుండా రిజర్వాయర్ పనులు చేపట్టడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లాలోని హిరమండలం, కొత్తూరు మండలాల వంశధార నిర్వాసితులు ప్రాజెక్టు పనులను బుధవారం అడ్డుకున్నారు. జలాశయం నిర్మాణంలో భాగంగా చేపడుతున్న స్పిల్‌వే పనుల వద్దకు ర్యాలీగా వెళ్లారు. పాతపట్నం సిఐ బి.వి.ఎస్.ఎస్.ప్రకాష్ ఆధ్వర్యాన పోలీసులు వారిని బ్యారేజీ సెంటర్ వద్ద అడ్డగించి నచ్చజెప్పేందుకు విఫలయత్నం చేశారు. శాంతియుతంగానే ఆందోళన చేపడతామని నిర్వాసితులు చెప్పడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. స్పిల్‌వే పనులను నిలుపుదల చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్న నిర్వాసితుల హెచ్చరికతో కాంట్రాక్టర్ పనులను నిలుపుదల చేశాడు. అనంతరం నిర్వాసితులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. నిర్వాసిత సంఘం నాయకులతో పాలకొండ ఆర్‌డిఒ ఆర్.గున్నయ్య చర్చలు జరిపారు. తాము ప్రాజెక్టును వద్దనడం లేదని, సమస్యలు పరిష్కరించాకే పూర్తి చేయాలని కోరుతున్నామని నాయకులు స్పష్టం చేశారు. ఆర్‌డిఒ స్పందిస్తూ, నిర్వాసితుల సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రాజెక్టు పనులకు సహకరించాలని కోరారు. నిర్వాసితుల పోరాటానికి మద్దతు తెలిపేందుకు వచ్చిన ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.సింహాచలాన్ని పోలీసులు అరెస్టు చేసి పాతపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనను విడుదల చేయకుంటే పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని నిర్వాసితులు హెచ్చరించడంతో పోలీసులు విడిచిపెట్టారు.

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రభుత్వ వైద్యశాలను సమగ్ర వైద్యశాలగా మార్చాలని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆస్పత్రిని ఎమ్మెల్సీ బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో పరికరాలు, అందుతున్న సేవలు, సిబ్బంది వివరాలపై సమాచారం సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి

నంద్యాల ఉప ఎన్నికలో అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార దుర్వినియోగాన్ని అరికట్టి స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నిఘా వేదిక, ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కోరింది. ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి, చైర్మన్ డాక్టర్ అంబటి లక్ష్మణరావులతో కూడిన బృందం బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కలిసింది. నంద్యాల నియోజకవర్గంలో అత్యధిక ఎన్నికల వ్యయం, మద్యం వినియోగిస్తున్నారని, విచ్చలవిడిగా అధికార దుర్వినియోగమవుతోందని బృందం ఇసి దృష్టికి తీసుకెళ్లింది.

వైసిపి ఫిర్యాదుపై ఇసి స్పందన

నంద్యాల ఉపఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తోందని, మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ స్పందించారు. ఆ ఫిర్యాదు కాపీని కర్నూలు జిల్లా కలెక్టర్‌కు పంపుతూ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

గ్యాస్ సబ్సిడీ ఎత్తేస్తే సామాన్యులకు ఇబ్బందే: పద్మశ్రీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎల్పీజీ సిలెండర్లపై సబ్సిడీ ఎత్తివేతతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడతారని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ అన్నారు. పిసిసి ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్రరత్న భవన్ వద్ద బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్‌పై ప్రతి నెలా రూ. 4 పెంచి, మార్చి నాటికి సబ్సిడీని ఎత్తేయాలని ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఈ నిర్ణ యాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బిజెపివి నీచ రాజకీయాలు:పిసిసి

బిజెపి నీచమైన ఎత్తుగడతో గుజరాత్ రాజ్యసభ సీటును కైవశం చేసుకోవాలనుకుంటోందని పిసిసి ప్రధాన కార్యదర్శులు మీసాల రాజేశ్వరరావు, ఎన్ నరసింహరావు విమర్శించారు. ఆంధ్ర రత్న భవన్‌లో బుధవారం వారు మాట్లాడుతూ బెంగళూరులో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బస చేసిన రిసార్ట్స్‌పై ఆదాయపన్నుశాఖ దాడులు నిర్వహించడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకు మొదట లంచం ఇచ్చేందుకు ప్రయత్నించి ఒదని, అది విఫలం కావడంతోబిజెపి సర్కారు ఐటి దాడులు జరుపుతోందని పేర్కొన్నారు.

పనితీరు ఆధారంగా వేతనాలు పెంచే పద్ధతిని రద్దు చేయాలి

సిఎస్‌కు కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశుసంవర్ధకశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పనితీరు ప్రాతిపదికన వేతనాలు పెంచే పద్ధతిని రద్దు చేయాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు, ఎం బాలకాశి కోరారు. ఈ మేరకు వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బుధవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిఓను సవరించాలని, పశుసంవర్ధకశాఖలోని ఎంపిడిఈఎలకు ఇతర శాఖలోని ఉద్యోగుల మాదిరిగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీరంతా ఆర్థికశాఖ అనుమతి మేరకు నియమితులయ్యారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం వేతనాలు పెరుగుతాయని వీరు ఎదురు చూశారన్నారు. కానీ వీరికి వేతనాలు పెంచకుండా పనితీరు ఆధారంగా ప్రోత్సాహకం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పాటించి వేతనాలు పెంచాల్సిన ప్రభుత్వం ఈ విధంగా ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదన్నారు. ఇది సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘించడమేనన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జెడ్‌పి చైర్‌పర్సన్ జానీమూన్, అరుణ్‌కుమార్

తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన

జెడ్‌పి చైర్‌పర్సన్ జానీమూన్

ప్రజాశక్తి-గుంటూరు

శిశువుకు తల్లిపాల ఆవశ్యకతపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్ అన్నారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జెడ్‌పిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే 40 శాతం మంది శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టట్లేదన్నారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వటం ఎంతో శ్రేయస్కరం అనే విషయంపై అవగాహన పెంచాలన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి నూరుశాతం తల్లిపాలు ఇచ్చే సంస్కృతిని రాబోయే రెండేళ్లలో తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా జెడ్‌పి నుండి మార్కెట్‌సెంటర్ వరకూ నిర్వహించిన ర్యాలీని అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా విద్యార్థులతో తల్లిపాల ప్రాధాన్యంపై ప్లకార్డులు ప్రదర్శింపజేశారు.

హెచ్1బి వీసా ప్రక్రియ ప్రక్షాళన

ట్రంప్‌కు అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి



వాషింగ్టన్: విదేశీయుల కోసం జారీ చేస్తున్న హెచ్-1బి, ఎల్-1 వీసా ప్రక్రియలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని, ఔట్‌సోర్సింగ్ కంపెనీలపై ఉక్కుపాదం మోపాలని అమెరికన్ కాంగ్రెస్‌కు చెందిన కొందరు సభ్యులు అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు. కొన్ని సంస్థలు హెచ్-1బి వీసాను దుర్వినియోగం చేస్తూ అమెరికన్‌ల స్థానంలో తక్కువ వేతనాలకు విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయని వారు ట్రంప్‌కు రాసిన లేఖలో ఫిర్యాదు చేశారు. అధ్యక్షుడిగా మీ అధికారాన్ని ఉపయోగించి హెచ్-1బి వీసాల దుర్వినియోగాన్ని ఆపాలని వారు కోరారు. ప్రస్తుతం అమలులో వున్న విధానాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి అందులోని లొసుగులను తొలగిస్తారని తాము భావిస్తున్నట్లు వారు ఆ లేఖలో పేర్కొన్నారు. అమెరికన్ ఉద్యోగులను పరిరక్షించటం కోసం తాము ప్రతిపాదించిన హెచ్‌ఆర్1303, ఎస్ 180, హెచ్-1బి, ఎల్-1 వీసా సంస్కరణల చట్టం ఈ లొసుగులను తొలగించి వీసా విధానాలను పూర్తి ప్రక్షాళన చేస్తుందని, ఔట్‌సోర్సింగ్ కంపెనీలపై ఉక్కుపాదం మోపుతుందని తాము భావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ సభ్యుడు బిల్ పాస్‌క్రెల్ నేతృత్వంలో సెనేటర్ రిచర్డ్ డర్బిన్, కాంగ్రెస్ సభ్యులు దవే బ్రాత్, ఆర్‌ఒ ఖన్నా, పాల్ ఎ గోసర్ తదితరులు ఈ లేఖపై సంతకాలు చేశారు.



అన్సారీకి వీడ్కోలు విందు

న్యూఢిల్లీ : ఉపరాష్ట్రపతి మహమ్మద్ హమీద్ అన్సారీ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో లోక్‌సభ స్పీక్ సుమిత్రా మహాజన్ బుధవారం ఆయనకు వీడ్కోలు విందు ఇచ్చారు. అన్సారీ 12వ ఉపరాష్ట్రపతిగా సేవలు అందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లు విందుకు హాజరయ్యారు. అన్సారీతో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. అనంతరం అన్సారీ దంపతులకు జ్ఞాపికను బహూకరించి వీడ్కోలు పలికారు. హమీద్ అన్సారీ ఉపరాష్ట్రపతిగా రెండు సార్లు దేశానికి సేవలు అందించిన ఘనత దక్కించుకున్నారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా రెండు సార్లు ఉపరాష్ట్రపతి పదవిలో కొనసాగారు.

కిషన్‌గంగ, రాట్లే జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి భారత్‌కు అనుమతి

ప్రపంచ బ్యాంకు వెల్లడి

న్యూఢిల్లీ: 1960 నాటి సింధునదీ జలాల ఒప్పందంలోని కొన్ని షరతులకు లోబడి జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో జీలం, చీనాబ్ నదులపైకిషన్‌గంగ, రాటేల జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి భారత్‌కు అనుమతి ఇచ్చినట్లు ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. సింధు నదీ జలాల ఒప్పందంపై భారత్-పాక్ మధ్య కార్యదర్శుల స్థాయి చర్చలు ముగిసిన నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు ఈ అంశాన్ని ప్రకటించటం గమనార్హం. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణాన్ని పాకిస్తాన్ వ్యతిరేకిస్తోందని ప్రపంచ బ్యాంకు మంగళవారం విడుదల చేసిన వాస్తవిక పత్రంలో వెల్లడించింది. ఈ రెండు జల విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో ఇరుదేశాల మధ్య ఏఏ అంశాలలో విభేదాలు తలెత్తాయో తెలియటం లేదని ప్రపంచ బ్యాంకు ఈ పత్రంలో పేర్కొంది. సింధునదీ జలాల వినియోగంతో పాటు ఈ నదులపై కొన్ని షరతులకు లోబడి రెండు జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి భారత్‌కు అనుమతినిస్తున్నట్లు ప్రపంచ బ్యాంకు ఆ పత్రంలో వివరించింది. సింధు నదీ జలాల ఒప్పందంలోని సాంకేతిక అంశాలను ఇరుదేశాలు సుహృద్భావంతో, సహకార స్ఫూర్తితో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. చర్చలను కొనసాగించేందుకు ఇరుదేశాలూ అంగీకరించాయని, సెప్టెంబర్‌లో వాషింగ్టన్‌లో భేటీ అవుతాయని ప్రపంచ బ్యాంకు మరో ప్రకటనలో వివరించింది.

ఏడాదిలో 111 మంది ఛత్తీస్‌గఢ్ రైతుల ఆత్మహత్య

ఆరుగురికే పరిహారం

రాయిపూర్: రాష్ట్రంలో ఏడాదిన్నర కాలంలో మొత్తం 111 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రకటించింది. అయితే వీరిలో ఆరుగురి కుటుంబ సభ్యులకు మాత్రమే ఆర్థిక తోడ్పాటు అందించడం గమనార్హం. రైతుల ఆత్మహత్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మోహన్ మార్కాం అడిగిన ప్రశ్నకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ప్రేం ప్రకాష్ పాండే వివరణ ఇచ్చారు. '2016 నుంచి 2017 జూన్ 30 వరకు 111 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.' అని పేర్కొన్నారు. కుటుంబ వివాదాలు, అధిక మద్యపానం, వ్యాధులు ఇతర కారణాలతో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మంత్రి ఇచ్చిన వివరణ ప్రకారం బలోదబజార్ జిల్లాలో అత్యధికంగా ఆత్మహత్యలు జరిగాయన్నారు. కబీర్‌దాం జిల్లాలో (22), దుర్గ్ (13), బెమెత్ర (9), రాజ్‌నందగావ్ (6) రాయ్‌పూర్, కన్కేర్ జిల్లాలో ఇద్దరిద్దరు, మహాసమంద్‌లో ముగ్గురు, ధామంత్రి, బెలోడ్, రాయ్‌గర్ జిల్లాలో తలా ఒకరు మృతిచెందారన్నారు.

దీపక్ మిశ్రా పదోన్నతికి అడ్డంకిగా మారిన భూ ఆక్రమణ కేసు

న్యూఢిల్లీ : జస్టిస్ దీపక్ మిశ్రా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) అయ్యేందుకు పాత కేసులు అడ్డు పడుతున్నాయి. భూమిలేని పేదలకు కేటాయించిన భూమిని తప్పుడు అఫిడవిట్ సమర్పించి దీపక్ మిశ్రా ఆక్రమించారన్న ఆరోపణలు ఆయన సిజెఐ పదవిని చేపట్టేందుకు అడ్డుపడుతున్నాయి. ఈ కేసు ఇంకా పరిష్కారం కాలేదు. అయితే ఈ నెల 27న ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయబోతున్న జస్టిస్ ఖేహర్ తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా దీపక్ మిశ్రా పేరును సిఫార్సు చేశారు. దీపక్ మిశ్రాపై ఉన్న భూ ఆక్రమణ ఆరోపణలు పరిష్కారం కాకుండానే ప్రధాన మంత్రి మోడీ, న్యాయశాఖ మంత్రి ఆయనను సిజెఐగా నియమించనున్నారా? అంటూ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ జురిసిట్స్ అధ్యక్షులు అడిష్ సి. అగర్వాల్ ప్రశ్నించారు సిజెఐగా జస్టిస్ మిశ్రా నియామకాన్ని ప్రశ్నిస్తూ జస్టిస్ ఖేహర్‌కు అగర్వాల్ ఒక లేఖ రాశారు.

కాశ్మీర్ బంద్‌కు వేర్పాటువాదుల పిలుపు

న్యూఢిల్లీ : కాశ్మీర్‌లోని వేర్పాటువాదులు బుధవారం బంద్‌కు పిలుపునిచ్చారు. కాశ్మీర్‌లోని దక్షిణ జిల్లాల్లో మంగళవారం నిర్వహించిన నిరసనల సందర్భంగా ఒక పౌరునిపై భద్రతా బలగాలు కాల్పులు జరిపి హత్య చేసినందుకు నిరసనగా బంద్ పిలుపునిచ్చారు. లష్కర్ ఎ తొయిబా ఉగ్రవాది అబు దుజనాను భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్‌లో హతమార్చాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరస ఆందోళనలు జరిగాయి. ఈ ఆందోళనల నేపథ్యంలో ఫిరోదస్ అహ్మద్ ఖాన్ అనే పౌరుడు మృతి చెందాడు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిరసన ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. పోలీసులు జరిపిన గాలింపు చర్యలు, నిరసనల సందర్భంగా 40 మంది పౌరులకు గాయాలయ్యాయి. 'కాసో' ముసుగులో భద్రతా బలగాలు అతి కిరాతకంగా వ్యవహరించాయని వేర్పాటువాదులు ఆరోపించారు. పుల్వామాలోని ఒక ఆసుపత్రిలోకి ప్రవేశించిన భద్రతా బలగాలు అక్కడ ఉన్న రోగులపైన, సిబ్బందిపైన కాల్పులు జరిపారని తెలిపారు. భద్రతా బలగాలు నిరంతరం జరుపుతున్న దాడులు, హింస, యువతను అరెస్టు చేయడం, సైన్యం తరుచూ కూంబింగ్ జరపడం తదితర కార్యకలాపాల కారణంగా సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇందుకు నిరసనగా బంద్‌కు పిలుపునిస్తున్నామని వేర్పాటు వాదులు సయ్యద్ ఆలీ జిలానీ, మిర్వాయిజ్ ఫరూక్‌లు పేర్కొన్నారు.

సుప్రీం తీర్పును నిరసిస్తూ యుపిలో శిక్షమిత్రల ఆందోళన

టీచర్లుగా నియమించాలని డిమాండ్

మూతపడ్డ పాఠశాలలు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో 'శిక్ష మిత్ర'లు ఆందోళనకు దిగారు. తమను ఉపాధ్యాయులుగా నియమించరాదంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన రూలింగ్‌ను నిరసిస్తూ వారు ఆందోళనబాట పట్టారు. దీంతో పాఠశాలలు మూతపడ్డాయి. ముఖ్యంగా బుందేల్‌ఖండ్ ప్రాంతంలో శిక్ష మిత్రలు తమ ఆందోళనను ఉధృతం చేశారు. శిక్ష మిత్రలు అసలు ఉపాధ్యాయులు కారని, వారి నియామకాలను నిలిపివేయాలని 2015లో హై కోర్టు తీర్పును వెలువరించింది. ఆ తరువాత ఈ ఏడాది జులై 25న హై కోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీం కోర్టు రూలింగ్ ఇచ్చింది. దీంతో శిక్ష మిత్రగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళనబాట పట్టారు. నిరసన ప్రదర్శనలు, ఆందోళనలతో ఉత్తర ప్రదేశ్ స్తంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శిక్ష మిత్రలు రాత్రికి రాత్రే వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్రంలోని పలు గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ ట్రాఫిక్ స్తంభించి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోలేక పోయారు. జనజీవనం దాదాపు స్తంభించింది. అధికార గణాంకాల మేరకు ఉత్తర ప్రదేశ్‌లో 1,72,000 మంది శిక్ష మిత్రలుగా పనిచేస్తున్నారు. 2015లో హై కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేస్తుందని వీరంతా ఆశతో ఎదురుచూశారు. కాని సుప్రీం కోర్టు కూడా ఆ తీర్పును సమర్థించింది.

డోక్లామ్ నుండి తక్షణమే బలగాలను పిలిపించండి

- భారత్‌ను కోరిన చైనా



న్యూఢిల్లీ : భూటాన్ సరిహద్దుల్లోని డోక్లామ్ నుండి తక్షణమే బలగాలను వెనక్కి పిలిపిస్తూ నిర్దిష్ట చర్యలను తీసుకోవాల్సిందిగా భారత్‌ను చైనా కోరింది. ఇతర అంశాలతో ముడిపెట్టకుండా ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. జులై 28న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా ప్రతినిధి యాంగ్ జిచెల మధ్య జరిగిన సమావేశం వివరాలను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ మీడియాకు తెలియచేసింది. బ్రిక్స్ సహకారం, ద్వైపాక్షిక సంబంధాలు, సంబంధిత సమస్యలపై ఇరువురు అధికారులు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారని తెలిపింది. భూటాన్ సరిహద్దుల్లో చైనా రోడ్డు నిర్మాణం ప్రారంభించడంతో డోక్లామ్ వద్ద ప్రతిష్టంభన నెలకొంది. దానికి సంబంధించి జరిగిన చర్చలపై అడిగిన ప్రశ్నకు చైనా విదేశాంగ శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. చైనా-భారత్ సరిహద్దులో సిక్కిం సెక్షన్ వద్ద చైనా భూభాగంలోకి భారత బలగాల అతిక్రమణపై చైనా కఠిన వైఖరిని యాంగ్‌జెచి తెలియచేశారని ఆ ప్రకటన పేర్కొంది.

'గోప్యత'పై తీర్పును రిజర్వు చేసిన సుప్రీం

న్యూఢిల్లీ : 'గోప్యత' హక్కుపై సుప్రీం కోర్టు తన తీర్పును రిజర్వు చేసింది. దీనిపై బుధవారం విచారణ పూర్తయ్యింది. గోప్యతను ప్రాథమిక హక్కుగా పరిగణించాలా అనే విషయమై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. కాగా గోప్యత హక్కుపై సుప్రీం కోర్టు తీర్పు ఆగస్టు చివరి వారంలో వెలువడే అవకాశముందని నిపుణులు పేర్కొన్నారు. గత రెండు వారాలుగా ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో ఏర్పడిన రాజ్యాంగ ధర్మాసనం 'గోప్యత'ను ఒక హక్కుగా పరిగణించే విషయమై చర్చించింది. దీనికి సంబంధించి అంతకుముందు 1954, 1962లలో ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో దీనిపై విచారణ జరిపింది. ఆ రెండు తీర్పులు కూడా గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొనలేదు.

తల్లిపాల కొరతతో రూ.89 వేల కోట్లు ఆర్థిక వ్యవస్థపై భారం

వెల్లడించిన ఐరాస నివేదిక

ఐక్యరాజ్య సమితి : తల్లి పాల కొరతతో భారత ఆర్థిక వ్యవస్థపై సుమారు రూ.89 వేల కోట్ల భారం పడుతోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదికలో వెల్లడించింది. తల్లి పాలతో నివారించబడే వ్యాధులకు గురై ఏడాదికి లక్ష మంది పిల్లలు మరణిస్తున్నట్లు తెలిపింది. పిల్లల మరణాలతో పాటు తల్లి పాల కొరతతో ఏర్పడే ఇతర నష్టాలు కలుపుకుని దేశ ఆ ర్థిక వ్యవస్థపై రూ.89 వేల కోట్ల భారం పడుతోందని పేర్కొంది. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలైన ఐక్యరాజ్య సమితి బాలల నిధి(యునిసెఫ్), ప్రపంచ ఆరోగ్య సంస్థ (హూ) సహకారంతో తాజా అధ్యయనాన్ని నిర్వహించింది. సహజంగా పిల్లలు మరణించడానికి ప్రధాన కారణాలైన డయోరియా., నిమోనియా వంటి వ్యాధులను నివారించడానికి తల్లిపాలు ఉపయోగపడటమే కాకుండా, మహిళలు అండాశయ, రొమ్ము కాన్సర్ వ్యాధులతో మృతి చెందే ప్రమాదాన్ని తగ్గించేందుకు కూడా ఉపకరిస్తాయి.

చైనా, భారత్, నైజీరియా, మెక్సికో, ఇండోనేషియా దేశాలలో తల్లిపాల కొరత వలన ఏడాదికి 2, 36,000 మంది పిల్లలు మరణిస్తున్నారు. ఆయా దేశాల్లో తల్లిపాల కొరత వలన ఏడాదికి ఏర్పడే ఆర్థిక నష్టం రూ. 7.58 లక్షల కోట్లు ఉంటుందని అధ్యయనం అంచనా వేసింది. ఆరు నెలల వరకు తల్లిపాలు తీసుకుంటున్న వారి సంఖ్య 55 శాతంగా ఉన్నప్పటికీ, భారత్‌లో ఉన్న అత్యధిక జనాభా కారణంగా ఏడాదికి 94,499 మంది ఐదేళ్ళలోపు పిల్లలు మరణిస్తున్నట్లు అంచనా. వీరిలో అత్యధిక మంది డయోరియా, నిమోనియాతో మరణించడం విశేషం. చిన్న వయస్సులోనే తల్లి పాలు అందితే డయోరియా, నిమోనియాలు నివారించబడి ఉండేవి. చిన్న పిలల్లకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు అందిస్తూ, ఆ తరువాత దానిని కొనసాగిస్తే దుష్ఫలితాలు ఉండేవి కావని అధ్యయనం పేర్కొంది.తల్లిపాల కొరత కారణంగా కాన్సర్, టైప్2 డయాబెటిస్‌లతో మరణించే మహిళల సంఖ్యలో పెరుగుదల, అధిక స్థాయిలో పిల్లలు మరణించడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి సుమారు రూ.4 లక్షల 45 వేల కోట్లు నష్టం ఏర్పడుతుందని అంచనా వేసింది. అంతేకాకుండా మరో రూ. 4 లక్షల 45 వేల కోట్ల నష్టం ఇతర కారణాల వల్ల ఏర్పడుతోందని పేర్కొంది. మొత్తం మీద భారత్ సుమారుగా ఏడాదికి రూ.8 లక్షల 90 వేల కోట్లు, అంటే జిడిపిలో 0.7 శాతం నష్టపోతుందని ఐక్యరాజ్య సమితి అధ్యయనం పేర్కొంది. ప్రాథమిక దశలో పిల్లలకు తల్లిపాలు పౌష్టికాహారమని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనోమ్ గెబ్రేబేసుస్ పేర్కొన్నారు. తల్లిపాలు శిశువుకు ఒక వాక్సిన్‌లా పనిచేస్తాయని, ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని, వారి ఎదుగుదలకు అవసరమైన పోషణనిస్తాయని పేర్కొన్నారు. దాదాపు 194 దేశాలలో అధ్యయనం జరపగా ఏ దేశంలో కూడా పిల్లలకు తగినంత స్థాయిలో తల్లిపాలు అందడం లేదని వెల్లడైనట్లు ఐరాస అధ్యయనం వెల్లడించింది.

'నోటా'పై సుప్రీంకెళ్ళిన గుజరాత్ కాంగ్రెస్

నేడు విచారణ జరపనున్న సుప్రీం

న్యూఢిల్లీ : గుజరాత్‌లో త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల బ్యాలెట్ పత్రంలో 'నోటా' ఐచ్ఛికాన్ని చేర్చాలని ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని ఆ రాష్ట్ర కాంగ్రెస్ శాఖ బుధవారం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ కోరడంతో జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం గురువారం దానిపై విచారణ జరిపేందుకు అంగీకరించింది. ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేయడమే కాక నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలని కూడా గుజరాత్ కాంగ్రెస్ తన పిటిషన్‌లో కోరింది. అంతకుముందు మంగళవారం గుజరాత్ కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను కలుసుకుని బాలెట్ పత్రాలలో 'నోటా'ను చేర్చవద్దని డిమాండ్ చేశారు. రాజ్యసభ ఎన్నికల సమయంలో 'నోటా' ఆప్షన్‌ను ఉపయోగించడం ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని ఎన్నికల నిర్వహణ నిబంధనలను, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులతో విభేదిస్తుందని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ 'నోటా' ఐచ్ఛికం రాజ్యసభ ఎన్నికలకు వర్తిస్తుందని 2013లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపింది.

మద్యం కోసం రహదారుల మార్పులు

చట్ట సవరణకు సిద్ధమౌతున్నగోవా ప్రభుత్వం

పనాజీ: మద్యం దుకాణాలకు వెసులుబాటు కల్పించడం కోసం రాష్ట్రీయ రహదారుల చట్టంలో మార్పులు తీసుకురావాలని గోవా ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. వివిధ నగరాల్లోని మద్యం దుకాణాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రతిపాదనకు సిద్ధమౌతోంది. ఈ సవరణల ప్రకారం రాష్ట్ర రహదారులు నగరంలో ప్రవేశానికి ముందు ముగిసిపోయి నగరం దాటిన తర్వాత తిరిగి ప్రారంభమౌతాయని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారేకర్ అసెంబ్లీలో తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రీయ రహదారుల వెంబడి మూతబడే మద్యం దుకాణాలకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. 'రాష్ట్రీయ రహదారుల చట్టం సవరించాల్సి ఉంది. నగరాల మధ్య నుంచి వెళ్లే రహదారులను రాష్ట్రీయ రహదారులుగా గుర్తించకూడదు.' అని పారేకర్ అసెంబ్లీలో తెలిపారు. దీంతో గోవాలోని చిన్న నగరాలైన పొండ, కుర్చోరియం, సంఘం, బిచోలింతో పాటు పలు నగరాలలోని మద్యం దుకాణాల నిర్వాహకులకు లబ్ది చేకూరనుంది. జాతీయ రహదారులకూ, రాష్ట్రీయ రహదారులకూ చెంత 500 మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదని గతేడాది సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే అనంతరం దాన్ని 20 వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో 220 మీటర్లకు తగ్గించింది. ఏప్రిల్ 1 నుంచి సుప్రీం కోర్టు నిర్ణయం అమలులోకి వచ్చింది. 3 వేల మద్యం దుకాణాలపై దీని ప్రభావం పడింది. దుకాణాలపై ఆంక్షలతో రాష్ట్రానికి రూ.7 వేల కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందని ప్రభుత్వం వెల్లడించింది.

తిన్నదంతా కక్కాల్సిందే

- సిబిఐ దర్యాప్తు అవసరం లేదు, మొత్తం నష్టపరిహారం రాబట్టండి
- చట్టాన్ని సవరించాల్సిందిగా కేంద్రానికి సూచన
- ఒరిస్సా అక్రమ మైనింగ్ కేసులో సుప్రీం కోర్టు

భువనేశ్వర్: ఒరిస్సాల్లో జరిగిన అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో నిధులు వెనక్కి రాబట్టాలని సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. దీనిపై సిబిఐ దర్యాప్తుకు ఆదేశించడం లేదని, అక్రమ తవ్వకాలు చేపట్టిన వారి నుంచి నూరు శాతం సొమ్ము రాబట్టాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర సాధికారిక కమిటీ (సిఇసి) కూడా ఈ మేరకు సూచనలు చేసిందని ధర్మాసనం పేర్కొంది. ఆ మొత్తాన్ని డిసెంబరు 31 లోపు డిపాజిట్టు చేయాల్సిందిగా కోర్టు తన తీర్పులో పేర్కొంది. "సిఇసి సూచనలు అసాధారణమైనవి కావు. సిఇసి నివేదికలు సూచించిన ప్రకారం నూరు శాతం నష్టపరిహారం చెల్లించాలన్న ప్రతిపాదనకు మద్దతు తెలుపుతున్నాం." అని ధర్మాసనం పేర్కొంది. అయితే ఎంబి షా కమిషన్ మాత్రం సిబిఐ దర్యాప్తుకు చేయాలని గట్టిగా ప్రతిపాదించగా, దాన్ని సుప్రీం కోర్టు మాత్రం అవసరం లేదని పేర్కొంది. అక్కడ అక్రమాలు జరిగి ఉంటే అందుకు సంబంధించిన మొత్తాన్ని కూడా వసూలు చేయాలని ధర్మాసనం పేర్కొంది. దేశంలో మరో ప్రాంతంలో ఇలా అక్రమ తవ్వకాలు జరగకుండా దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

దిగజారిన బిజెపి

(మొదటిపేజీ తరువాయి)

కిడ్నాప్ చేస్తున్నారని, భయపెడుతున్నారని అన్నారు. ఈ ట్రెండ్ గుజరాత్ నుంచి ప్రస్తుతం దక్షిణానికి పాకిందని విమర్శించారు. కేవలం ఒక్క మంత్రి ఇంటిపై మాత్రమే సోదాలు జరుగుతున్నాయన్న జైట్లీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ఈ సమయంలోనే సోదాలు ఎందుకు జరుగుతున్నాయి?' అని ప్రశ్నించారు. ఒక నెల ముందుగా, ఒక నెల తరువాత ఎందుకు జరగడం లేదని నిలదీశారు. 'బెంగళూరులో ఎమ్మెల్యేలకు డబ్బులు పంచుతున్నాడని అనుమానం వచ్చి సోదాలకు ఆదేశించారు. కానీ మా పార్టీపై ఇప్పటి వరకు అలాంటి ఆరోపణ రాలేదు. మీ (బిజెపి) వ్యక్తులు ఒక్కో ఎమ్మెల్యేకు రూ.15 కోట్లు పంచుతున్నారు. వాళ్ల ఇంటిపై సోదాలు ఎందుకు చేయడం లేదు' అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై మొదట రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను వినియోగించారని ఇప్పుడు ఏకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆజాద్ విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

శివకుమార్ కోసమే రిసార్ట్‌కు : జైట్లీ వివరణ

అంతకముందు కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ మాట్లాడుతూ.. రిసార్టులో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉంటున్న గదుల్లో ఎలాంటి సోదాలూ జరగలేదని చెప్పారు. కేవలం ఆ రిసార్టులో ఉన్న మంత్రిని మాత్రమే అధికారులు తనిఖీ చేశారని చెప్పారు. ఆయన వద్ద ఉన్న పత్రాలను తీసుకుని పంచనామాకు పంపారని వివరించారు. ఈ సోదాలు 39 ప్రాంతాల్లో జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫలితంగా సభ మొదట పది నిమిషాలు, ఆ తరువాత 12 గంటలకు, ఆపై మధ్యాహ్నానికి వాయిదా పడింది. మధ్యాహ్నం కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు.

లోక్‌సభలో కాంగ్రెస్ వాకౌట్

లోక్‌సభా ప్రతిపక్ష నేత మల్లిఖార్జునఖర్గే మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం విపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను సర్కారు వినియోగిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతో ఇదంతా చేస్తోందని అన్నారు. గుజరాత్‌కు చెందిన 42 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న ఈగల్ రిసార్టులో భయోత్పాతం సృష్టించేందుకు ఈడీ అధికారులను కేంద్రం పంపిందని అన్నారు. ఇలాంటి అనైతిక చర్యలు కొనసాగితే ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ మనుగడ సాధించదని ఆందోళన వ్యక్తంచేశారు. గుజరాత్ రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిని(అహ్మద్ పటేల్) ఓడించేందుకు బీజేపీ చేస్తున్న ఈ యత్నాలు సఫలీకృతం కాబోదని స్పష్టం చేశారు. రాజ్యసభ ఎన్నికలకు, మంత్రి ఇంటిపై సోదాలకు సంబంధం లేదని జైట్లీ అన్నారు. మంత్రి సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ సభ్యులు సభను వాకౌట్ చేశారు.

60 చోట్ల సోదాలు..రూ.11 కోట్ల నగదు స్వాధీనం

న్యూఢిల్లీ, బెంగళూరులోని 60 చోట్ల మంత్రి శివకుమార్‌కు, ఆయన బంధువులకు చెందిన నివాసాలు, కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో మొత్తం రూ.11 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆదాయపన్ను శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం వెల్లడించారు. బెంగళూరులోని కనకపురా, సదాశివనగర్‌లలో ఉన్న మంత్రికి చెందిన నివాసాలలోనూ, గుజరాత్‌కు చెందిన 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బసచేసిన ఈగల్టన్ గోల్ఫ్ రిసార్ట్‌లో కూడా ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. శివకుమార్ సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపి సురేష్ నివాసంలో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో 200 మందికి పైగా ఐటి అధికారులు పాల్గొన్నట్లు సమాచారం.

రాజకీయ బ్లాక్ మెయిలింగ్‌కు లొంగం : సిద్ధరామయ్య

ఐటి అధికారులు మంత్రి నివాసంపై ఆకస్మికంగా జరిపిన సోదాలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ ఇలాంటి రాజకీయ బ్లాక్ మెయిలింగ్ చర్యలకు తమ ప్రభుత్వం లొంగబోదని చెప్పారు. తన సహచర మంత్రి శివకుమార్‌కు సంక్షోభ సమయంలో అండగా ఉంటామని తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఐటిని, ఇతర దర్యాప్తు సంస్థలను పావుగా ఉపయోగించడం దుర్మార్గమని ఆయన ఆక్షేపించారు. అయితే ఆధారాలు సేకరించడంలో భాగంగా ఆదాయం పన్ను చట్టంలోని సెక్షన్ 132 కింద తాము నిర్వహించిన సోదాలు చట్టబద్ధమైనవేనని ఆదాయంపన్ను శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈగల్టన్ రిసార్ట్స్ వద్ద జరుగుతున్న నాటకీయ పరిణామాలకు, తాము నిర్వహించిన సోదాలకు ఎటువంటి సంబంధం లేదని ఐటి అధికారులు పేర్కొన్నారు.

యుపి విద్యార్థులకు హిందూత్వ పాఠాలు

న్యూఢిల్లీ: పాఠశాల విద్యార్థుల మనసుల్లో హిందూత్వ ముద్రను వేసేందుకు భారతీయ జనతాపార్టీ పాఠశాల విద్యార్థుల ప్రశ్నా పత్రాల్లో మార్పులు చేస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని అన్ని పాఠశాలల్లో ఆ పార్టీ విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. జి.కె. ప్రశ్నాపత్రాల్లో హిందూత్వానికి సంబంధించిన ప్రశ్నలతో ప్రశ్నాపత్రం నమోదు చేసింది.

ఇవన్ని సామాన్య గ్యాన్ ప్రతియోగిత-2017లో ప్రశ్నలుగా ఉన్నాయి. 70 పేజీలతో కూడిన ఈ పుస్తకాన్ని ఉత్తర ప్రదేశ్ పాఠశాలల్లో పంచిపెడుతున్నారు. అంబేద్కర్ ప్రశ్నకు జవాబు వాస్తవంగా 'వాట్ కాంగ్రెస్, గాంధీ హ్యావ్ డన్ టూ అన్‌టచ్‌బుల్స్' అని ఉండాలి. అంబేద్కర్ 'రిడిల్స్ ఆఫ్ హిందూ ఇజం', 'అన్ని హిలేషన్ ఆఫ్ క్యాస్ట్' వంటి రచనలు చేసినా అవి బిజెపికి ఉపయోగం లేని ప్రశ్నలు. ఇక వివేకానంద రాజకీయాలు వ్యక్తీకరించేలా హిందూ ఇజం గురించి మాట్లాడలేదు. ఈ జనరల్ నాలెడ్జి పుస్తకాన్ని లక్నోలోని పార్టీ కార్యాలయంలో సోమవారం బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్‌షా విడుదల చేశారు. దీనిలో జాతీయవాదం, హిందూత్వం, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం గురించి పేర్కొన్నారు. నేతలు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, కె.బి.హెగ్డేవార్, శ్యాంప్రసాద్ ముఖర్జీ, వీర్ సావర్కర్, నానాజీ దేశ్‌ముఖ్‌ల గురించి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయాలకు సంబంధించి నోట్ల రద్దు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం, రామజన్మభూమి అంశాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఆగస్టు 26న బిజెపి నిర్వహించే పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఈ బుక్‌లెట్లు ఇచ్చారు. బిజెపి సిద్ధాంత కర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల సందర్భంగా 100 ప్రశ్నలతో కూడిన పరీక్ష నిర్వహించడానికి ఈ బుక్‌లెట్ విడుదల చేశారు. దీని కోసం ప్రతి విద్యార్థి నుంచి రూ.5 వసూలు చేస్తున్నారు. పిల్లల్లో చిన్నతనంలోనే ఈ విధమైన భావజాలాన్ని ప్రోత్సహించడానికి బిజెపి కసరత్తు చేస్తోంది. 9, 10 తరగతుల విద్యార్థులకే ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మొత్తం తొమ్మిదివేల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలతోపాటు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడ పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నారు. విద్యార్థుల చేత కూడా 'హిందూస్థాన్' అని పలికించనున్నట్లు బిజెపి నేతలు గత నెలలో పేర్కొన్నారు.

ప్రశ్నలు ఈ విధంగా ఉన్నాయి..

- భారతదేశం హిందూ దేశమని ఎవరు చెప్పారు?
  - కేశవ్ బలిరాం హెగ్డేవార్
- చికాగోలో జరిగిన ధర్మసభలో స్వామి వివేకానంద ఏ మతానికి ప్రాతినిధ్యం వహించారు?
  - హిందూమతం
- మహరాజ్ సుహెల్దియోను ముక్కలుగా కోసిన ముస్లిం ఆక్రమదారుడు ఎవరు?
  - సయ్యద్ సలార్ మసూద్ ఘాజీ
- హరిజనుల అంశంలో గాంధీపై అంబేద్కర్ సవాలు విసిరిన పుస్తకం ఏది?
  - 'కాంగ్రెస్ అండ్ గాంధీ హ్యావ్ డన్'

అవినీతి అధికారిపై సిసిపి వేటు

బీజింగ్: అవినీతి నిరోధక విభాగంలో గతంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యూంగ్ హువెని బహిష్కరిస్తున్నట్లు చైనా కమ్యూనిస్టుపార్టీ (సిసిపి) ప్రకటించింది. అధికారాన్ని దుర్వినియోగం చేసి భారీగా ముడుపులు అందుకున్నట్లు విచారణలో రుజువైనందున హువెని కేంద్ర దర్యాప్తు బృందం నుండి తొలగిస్తున్నట్లు సిసిపి సెంట్రల్ కమిషన్ ఫర్ డిసిప్లిన్ (సిసిడిఐ) ఒక ప్రకటనలో వివరించింది. యూంగ్ హువై తన విధి నిర్వహణలో తన విశ్వసనీయతను కోల్పోవడమే కాక కమిషన్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించిందని సిసిడిఐ తన ప్రకటనలో పేర్కొంది. యూంగ్ కేసును ప్రాసిక్యూషన్‌కు నివేదిస్తున్నట్లు తెలిపింది. పార్టీ సంస్థల్లోనూ, ప్రావిన్షియల్ ప్రభుత్వ సంస్థల్లోనూ అవినీతికి పాల్పడే వారిని గుర్తించేందుకు వీలుగా సిసిడిఐకి చెందిన దర్యాప్తు బృందాలను కేంద్ర అధికారులు పంపుతుంటారు. కాగా సొంత బృందాలలో అవినీతికి పాల్పడే వారిని గుర్తించేందుకు గత ఏప్రిల్‌లో చేపట్టిన చర్యలతో యూంగ్ అవినీతి వెలుగులోకి వచ్చిందని సిసిడిఐ ప్రకటించింది.



ఆఫ్ఘనిస్తాన్ మసీదుపై ఆత్మాహుతి దాడి

29 మంది మృతి

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌లోని హేరత్ నగరంలో వున్న ఒక మసీదుపై బుధవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 29 మంది మరణించారని, మరో 63 మందికి పైగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. ఆత్మాహుతి దళ బృందంలోని మిలిటెంట్ ఒకరు మసీదులోకి ప్రార్థనలకోసం వస్తున్న భక్తులపై కాల్పులు జరిపాడని, తరువాత తన శరీరంపై వున్న పేలుడు పదార్థాలను పేల్చుకున్నాడని హేరత్ ప్రావిన్షియల్ గవర్నర్ ప్రతినిధి జైలాని ఫరాను ఉటంకిస్తూ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. నగరంలోని ఆస్పత్రులకు 29 మృతదేహాలను, 63 మంది క్షతగాత్రులను తరలించామని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా వుందని ప్రావిన్షియల్ ఆరోగ్యశాఖ ప్రతినిధి రఫిక్ షిర్జాయ్ వివరించారు. ఈ దాడిలో ఎంతమంది మిలిటెంట్లు పాల్గొన్నారన్న విషయాన్ని నిర్ధారించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు.

చైనాను నిందించడం లేదు

అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్ సన్

వాషింగ్టన్ : ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలు నిరోధించడంపై చైనాను తాము నిందించడం లేదని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ మంగళవారం తెలిపారు. ఇక్కడ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఆయన, ఉత్తర కొరియాను అణు నిరాయుధీకరణ దేశంగా మార్చాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు చైనాతో కలిసి పనిచేయాలని అమెరికా భావిస్తోందన్నారు. అంతేకానీ ప్రస్తుత పరిస్థితికి చైనాను నిందించడం లేదన్నారు. అయితే కొద్ది రోజుల క్రితం అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేస్తూ, చైనాతో అమెరికా వాణిజ్య లోటుకు ఉత్తరకొరియాలో పరిస్థితే కారణమని నిందించారు. తమ దేశంతో వాణిజ్యం ద్వారా కోట్లాది డాలర్లను సముపార్జించుకునేందుకు చైనాను తాము అనుమతించామని, కానీ చైనా మాత్రం మాటలే తప్ప చేతలకు దిగింది తక్కువేనని విమర్శించారు. ఒకదశలో ఉత్తర కొరియాతో చర్చలకు కూడా అమెరికా సిద్ధపడిందని టిల్లర్‌సన్ పేర్కొన్నారు. "మేమేమీ మీ శత్రువులం కాదు, అయినా మీరు మాకు ఆమోదయోగ్యం కాని రీతిలో ముప్పును కలిగిస్తున్నారు." అని విమర్శించారు. ఉత్తర కొరియా ప్రభుత్వాన్ని కూల్చివేయాలని లేదా ఆ ప్రభుత్వాన్ని మార్చివేయాలని అమెరికా భావించడం లేదని తెలియచేశారు.

ఇరాన్ అణు ఒప్పందంపై ట్రంప్‌తో విభేదించా అంగీకరించిన విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్

ఇరాన్ అణు ఒప్పందంపై తనకు, ట్రంప్‌కు మధ్య విభేదాలు వున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ అంగీకరించారు. 2015లో కుదిరిన ఈ అణు ఒప్పందం నుండి వైదొలుగుతామని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ అనేకసార్లు హామీ ఇచ్చారు. ఇరాన్‌పై పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలను ఎత్తివేయాలంటే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని విడనాడాలని షరతు విధించాయి. ఆ మేరకు కుదిరిన ఒప్పందంపై అమెరికా, రష్యా, చైనాలతో సహా ఆరు దేశాలు సంతకాలు చేశాయి. సమగ్ర ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక (జెసిపిఓఎ)పై, దాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే విషయమై కూడా ట్రంప్‌తో విభేదాలు వున్నాయని టిల్లర్‌సన్ చెప్పారు. అవసరమైతే అమెరికా ఈ ఒప్పందాన్ని రద్దు చేసి బయటకు వెళ్ళిపోతుందని లేదా ఒప్పందాన్ని కొనసాగిస్తూ, తాను విధించే షరతులకు ఇరాన్ జవాబుదారీగా వుండేలా కోరుతుందని టిల్లర్‌సన్ చెప్పారు. ఇందుకు గానూ ఇరాన్ మంచి పొరుగు దేశంగా వ్యవహరించాల్సి వుంటుందన్నారు. టిల్లర్‌సన్ వ్యాఖ్యలపై వైట్‌హౌస్ వెంటనే స్పందించలేదు. ఇరాన్‌తో సంబంధాలను, మన విధానాలను మరింత ముందుకు తీసుకెళ్ళడానికి ఈ ఒప్పందాన్ని ఉపయోగించుకోవడానికి అనేక అవకాశాలు వున్నాయని, ట్రంప్‌తో కూడా ఇదే విషయమై చర్చించామని టిల్లర్‌సన్ చెప్పారు. ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావడానికి అమెరికాకు చాలా పరిమితులున్నాయని విదేశాంగ మంత్రి అంగీకరించారు. అందువల్ల ఈ ఒప్పందంలోని ఇతర పక్షాలైన దేశాలతో సమన్వయంగా వ్యవహరించడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.



మినుట్‌మన్-3 క్షిపణిని పరీక్షించిన అమెరికా

వాషింగ్టన్ : ఉత్తరకొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన కొద్ది రోజుల వ్యవధిలోనే అమెరికా వైమానిక దళం మినుటెమన్-3 క్షిపణిని ప్రయోగాత్మకంగా పరీక్షించింది. ఎలాంటి అణు శీర్షాన్ని మోసుకెళ్ళని ఈ క్షిపణి పసిఫిక్ మహా సముద్రంలో నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించింది. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారు జామున 2.10గంటలకు లాస్ ఏంజెల్స్‌కి వాయవ్యంగా గల అమెరికా వైమానిక దళానికి చెందిన ఉత్తర వాండెన్‌బర్గ్ స్థావరం నుండి దీన్ని పరీక్షించారు. ఆయుధ వ్యవస్థ సమర్థతను, కచ్చితత్వాన్ని, సంసిద్ధతను అంచనా వేయడానికే ఈ పరీక్ష అని కల్నల్ మైఖేల్ హా తెలిపారు. ఈ ఏడాది ఈ స్థావరం నుండి జరిగిన నాలుగవ క్షిపణి పరీక్ష ఇది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదటి పరీక్ష జరిగింది.

రష్యన్ విమానాలను అడ్డుకున్న

నాటో యుద్ధ విమానాలు

బ్రస్సెల్స్ : ఎస్తోనియా గగనతలానికి సమీపంలో ప్రయాణిస్తున్న మూడు రష్యన్ విమానాలను స్పెయిన్, ఫిన్లాండ్ యుద్ధ విమానాలు మంగళవారం అడ్డగించాయని నాటో ఒక ప్రకటనలో తెలిపింది. రెండు మిగ్-31 జెట్ విమానాలు, అనతోవ్ ఎఎన్-26 రవాణా విమానంగా వాటిని గుర్తించినట్లు తెలిపింది. బాల్టిక్ గగనతలంపై నిఘాకు ఉద్దేశించిన రెండు స్పెయిన్ ఎఫ్-18 విమానాలు ఎస్తోనియాకి చెందిన అమరి వైమానిక స్థావరం నుండి దూసుకువచ్చి రష్యన్ విమానాలను అడ్డగించినట్లు నాటో తెలిపింది. ఉక్రెయిన్ సంక్షోభంలో రష్యా జోక్యంపై పశ్చిమ దేశాలు, రష్యాకి మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో




ఇటీవలి కాలంలో రష్యన్ విమానాలను నాటో అడ్డగించడం తరచూ జరుగుతోంది.

కేబినెట్‌పై షరీఫ్‌తో అబ్బాసి చర్చలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ కొత్త ప్రధాని షాహిద్ ఖాన్ అబ్బాసి బుధవారం తన కార్యాలయంలో బిజీగా గడిపారు. పదవీచ్యుతుడైన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో సమావేశమై మంత్రివర్గం ఏర్పాటుపై చర్చించారు. ఉత్తరప్రాంతంలోని రిసార్ట్ పట్టణమైన మురీలో షరీష్ నివాసం వద్దకు అబ్బాసీ కాన్వాయ్ చేరుకోవడాన్ని స్థానిక టెలివిజన్ ప్రసారం చేసింది. మాజీ ప్రధానికి విశ్వాసపాత్రులైన వారే ఎక్కువమంది కేబినెట్‌లో వుండే అవకాశముందని భావిస్తున్నారు. షరీఫ్ తో చర్చల అనంతరం అబ్బాసీ తుది నిర్ణయం తీసుకోనున్నారు. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో నవాజ్ షరీఫ్ ప్రధాని పదవికి అనర్హుడంటూ పాక్ సుప్రీం కోర్టు గత వారం రూలింగ్ ఇచ్చిన సంగతి విదితమే.

వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా జాన్ కెల్లీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులైన జాన్ కెల్లీ సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. వైట్ హౌస్ సిబ్బంది కార్యకలాపాలపై ఆయనకు పూర్తి అధికారం వుంటుందని అధ్యక్ష భవనం ఒక ప్రకటనలో వివరించింది. వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ ఆంథోనీ స్కారాముక్కీని తొలగించిన కొద్దిసేపటికే కెల్లీ ఈ బాధ్యతలు స్వీకరించడం విశేషం. అధ్యక్షుడి అల్లుడు జాన్ కుష్నర్, కుమార్తె ఇవాంకా ట్రంప్, పూర్వాధికార స్టీవ్ బెనన్ కెల్లీకి రిపోర్ట్ చేస్తారని వైట్‌హౌస్ తన ప్రకటనలో వివరించింది. గత వారం ఈ పదవికి రాజీనామా చేసిన రీన్స్ ప్రీబస్‌కు ఈ అధికారం లేదని విషయం తెలిసిందే.

ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా క్రిస్టోఫర్ రే, ధృవీకరించిన సెనేట్

ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా క్రిస్టోఫర్ రే నియామకాన్ని సెనేట్ మంగళవారం నాడు ధృవీకరించింది. అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల తొలగించిన జేమ్స్ కామీ స్థానంలో రే నియమితులైన విషయం తెలిసిందే. రే నియామకాన్ని సెనేట్ 92-5 ఓట్ల తేడాతో నిర్ధారించింది. గతంలో జార్జ్ బుష్ హయాంలో న్యాయశాఖలో కార్పొరేట్ మోసాల దర్యాప్తు విభాగాన్ని పర్యవేక్షించిన రే ఎఫ్‌బిఐ బాధ్యతలు స్వీకరించటం ఆయనకు సవాలు వంటిదేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

టర్కీ సైనిక కుట్రదారులపై విచారణ ప్రారంభం

అంకారా : టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయప్ ఎర్డోగన్‌కి వ్యతిరేకంగా గతేడాది జరిగిన విఫల సైనిక కుట్రలో పాత్ర వున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 486మందిపై మంగళవారం అంకారాలో విచారణ ప్రారంభమైంది. కుట్ర పన్నారని భావిస్తున్న 30మందితో సహా మొత్తంగా 279మంది తిరుగుబాటు సమయంలోనే మరణించారు. ఆ వెంటనే ప్రతిపక్షం, మీడియాపై ఎర్డోగన్ ప్రభుత్వం దారుణమైన అణచివేత చర్యలు చేపట్టింది. కుట్రకు నాయకత్వం వహించారని భావిస్తున్న 45మంది నిందితులకు యావజ్జీవ శిక్షలు విధించాలని ప్రాసిక్యూటర్లు డిమాండ్ చేస్తున్నారు. విచారణ జరుగుతున్న కోర్టు రూమ్‌కు లోపల, వెలుపల 1300మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. కాగా కుట్ర సందర్భంగా మరణించిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులు కోర్టు వెలుపల నిరసనలు, ఆందోళనలు వెలిబుచ్చారు. దోషులుగా నిర్ధారించబడిన వారికి వెంటనే మరణశిక్ష విధించాలంటూ నిరసనకారులు డిమాండ్లు చేశారు. కాగా, ఈ కుట్రకు ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న, అమెరికాలో వుంటున్న ఫతుల్లా గులెన్‌ను, మరో ఆరుగురిని వారి పరోక్షంలో విచారిస్తున్నారు. కుట్ర సందర్భంగా తనపై జరిగిన హత్యా యత్నాన్ని ఎర్డోగన్ తృటిలో తప్పించుకున్నారు. అధ్యక్షుడు ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి జెట్ యుద్ధ విమానం రంగంలోకి దిగింది. అయితే ఆ విమానం బారి నుండి అధ్యక్ష విమానం తప్పించుకుంది. తదుపరి ఎలాంటి వైమానిక దాడులు జరగకుండా నివారించేందుకు గానూ కుట్ర జరిగిన రోజు రాత్రే అకినిక్ వైమానిక స్థావరం రన్‌వేలను బాంబులతో పేల్చివేశారు.

దుందుడుకు చర్యలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్

లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ విమర్శ

జెరూసలేం : ఇజ్రాయిల్ ప్రభుత్వం దుందుడుకు వైఖరితో అణచివేత చర్యలకు పాల్పడుతోందని, సంక్లిష్ట పరిస్థితులను సృష్టిస్తోందని లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ (ఎల్‌సిపి) విమర్శించింది. ఈ మేరకు లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ పొలిటికల్ బ్యూరో సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జెరూసలేంలో ఇజ్రాయిల్ ప్రభుత్వం భద్రత పేరుతో దూకుడు చర్యలకు దిగుతోందని విమర్శించింది. తూర్పు జెరూసలేంలోని అల్ అక్సామసీదులో రెండు వారాలుగా నెలకొన్న ప్రతిష్టంభన యూదుల ఆక్రమణ స్వభావాన్ని , వర్ణవివక్ష ధోరణిని ధృవీకరించిందని విమర్శించింది. సౌదీ రాజధానిలో అరబ్ దేశాధినేతలతో ధెరిస్సా మే సమావేశం ఫలితాల నుండి ఇజ్రాయిల్ సర్కార్ లబ్ది పొందిందని ఎల్‌సిపి పేర్కొంది. దూకుడుతో కూడిన భద్రతాపరమైన చర్యలు తీసుకోవడానికి రియాద్ సమావేశాన్ని పచ్చజెండాగా ఇజ్రాయిల్ పరిగణించిందని కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. వలస రాజకీయాలను వ్యవస్థాగతం చేయడానికి దీన్ని ఉపయోగించుకుంటోందని విమర్శించింది. పాలస్తీనా తన నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తూ ధృఢత్వంతో వ్యవహరించడాన్ని ఎల్‌సిపి అభినందించింది.

మొదటి పేజీ తరువాయి

10న విద్యా సంస్థల బంద్

కార్యదర్శి జె.విశ్వనాథ్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర, పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు బాజిసైదా, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విలేకరుల మాట్లాడారు. విద్యా రంగం గురించి ప్రభుత్వం మాటలు చెబుతున్నా పనులు మాత్రం లేవని వారు విమర్శించారు. రాష్ట్రంలో చదువును వ్యాపారమయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తుంటే, ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదన్నారు. విద్యను అంగడి సరుకుగా మార్చేందుకు సెల్ఫ్ ఫైనాన్స్ స్కూలు ఇండిపెండెంట్ యాక్టు-2017ను తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ చట్టం అమలైతే ఇప్పుడున్న హక్కులు కూడా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉండవన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేందుకే ఈ చట్టం ఉపయోగపడుతుందని, ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో టీచర్ల బదిలీలతో ఇప్పటివరకూ రాష్ట్రంలోని సగం పాఠశాలల్లో విద్యా బోధనే ప్రారంభం కాలేదని చెప్పారు. నారాయణ, శ్రీచైతన్య ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థుల మరణాలపై విచారణ నిర్వహించాల్సి ఉందని గుర్తు చేశారు. ఏటా ఈ రెండు కళాశాలల్లో 50 నుండి 70 మంది విద్యార్థులు యాజమాన్యం ర్యాంకుల కోసం పెట్టే ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణాలను పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కడపలో నారాయణ విద్యా సంస్థల విద్యార్థినులు నందినీ, మనీషల సంఘటలో దోషులను ఇంతవరకు బయట పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు తీసుకోకుండా హాస్టళ్లు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, ఇంటర్మీడియట్ చదువులకు నీరజారెడ్డి కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. సిఎహెచ్ విద్యార్థులకు డిఎహెచ్ విద్యార్థులతో సమానంగా స్కాలర్‌షిప్ ఇవ్వాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1800 అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ పదో తేదీన బంద్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు ప్రవీణ్, సోమేశ్వరరావు, ఇజ రాజేష్, అనీల్, చరణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు తీయండి

ఇసుక తరలిపోకుండా అడ్డుకట్ట వేయాలని సూచించారు. కొత్త రీచ్‌లు తెరవడం ద్వారా ఇసుక అందుబాటును పెంచాలన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా జిల్లా స్థాయి కమిటీలు ఇసుక ధరలను సమీక్షించి మైనింగ్ కార్యదర్శికి నివేదికలు అందించాలని సూచించారు. రాజకీయ లబ్ధికోసం కొందరు వ్యాపింప జేస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. ఉద్యోగులను తొలగిస్తున్నట్లుగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎక్సైజ్ శాఖా మంత్రి కె ఎస్ జవహర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ లక్ష్మీ నరసింహం, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఎందుకు జరిగింది : బాబు

పార్టీలో ఉత్పన్నమైన సమస్యలపై చర్చించిన సందర్భంలోనూ అందరినీ కలుపుకుపోవాలని తాను నాయకత్వానికి సూచించినా ఎందుకు కలుపుకుపోవడం లేదో అర్థం కావడంలేదని చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రమేష్, మంత్రి కాలువ శ్రీనివాసులతోనూ ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పార్టీని వీడకుండా ఆపడంలో వైఫల్యం చెందారని, పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్ ఇబ్బందికరంగా మారుతుందని, వెంటనే జిల్లా నాయకత్వం తన వ్యవహారశైలిని మార్చుకోవాలని ఆదేశించారు.

టిటిడి నిధుల కేటాయింపుపై హైకోర్టులో పిల్

ప్రజాశక్తి-హైదరాబాద్

తిరుపతి ఎయిర్‌పోర్ట్ రోడ్డు పనుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 కోట్ల విడుదలకు ఏపీ సర్కార్ జీవో 699 జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం(పిల్) దాఖలైంది. శ్రీవేంటేశ్వరస్వామి వారి డబ్బును సొంత అవసరాలు, ఆధార్మిక సేవలకే వాడాలని, ప్రజావసరాల కోసం దేవుడి సొమ్ము వినియోగించాలనే తలంపు సరికాదని పేర్కొంటూ తిరుపతి వాస్తవ్యుడు నవీన్‌కుమార్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు.

ఎ-1 అతడే..!

(మొదటిపేజీ తరువాయి)

విశేషం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన 8 మంది పాత్ర ఈ కేసులో ఉన్నట్టుగా పోలీసులు తేల్చారు. వివరాలను హైదరాబాద్ కమిషనర్ మహేందర్‌రెడ్డి బుధవారం వెల్లడించారు.

సానుభూతి కోసమే..

మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ కుమారుడు, కాంగ్రెస్ యువ నాయకుడు విక్రమ్ గౌడ్ నిర్మాతగా కొన్ని సినిమాలు తీశారు. జిహెచ్‌ఎంపి ఎన్నికల్లో జాంబాగ్ డివిజన్ నుంచి పోటీ చేసి ఓడారు. సానుభూతితో పాటు తనకు అప్పు ఇచ్చిన వారితో పాటు, విరోధులను కూడా తన జోలికి రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో పక్కా ప్రణాళిక రూపొందించుకున్నారు. తనపై తానే హత్యాయత్నం చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. తనకు పరిచయస్తుడైన కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన ప్రసాద్‌ను కలిసి తన ప్రణాళికను వివరించారు. అదే జిల్లా ఎర్రగుంట్లను చెందిన గోవింద్‌రెడ్డిని ప్రసాద్ సంప్రదించి, విక్రంగౌడ్ ప్రణాళికను వివరించారు. ఈ పని పూర్తి చేయిస్తే సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని కూడా ప్రలోభానికి గురి చేసినా.. అంగీకరించని గోవింద్‌రెడ్డి, చివరకు ఈ ప్లాన్ ఖరీదు మొత్తం రూ.50 లక్షలని, ముందుగా రూ.5 లక్షలు నగదు ఇస్తానని చెప్పడంతో అంగీకరించి, విక్రంగౌడ్ చేతి నుంచి డబ్బు కూడా తీసుకున్నారు. అనంతరం అనంతపురం జిల్లా కదిరికి చెందిన నందకుమార్(ఈయనపై ఏడు కేసులున్నాయి.)ను సంప్రదించి కుదిరిన బేరం వివరించాడు. దీనికి నందకుమార్ అంగీకరించడంతో రూ. 3.50 లక్షలు గోవింద్‌రెడ్డి ఇచ్చాడు. తుపాకి కొనుగోలు కోసం తనకు పరిచయస్తుడై కదిరి వాసులైన షేక్ అహ్మద్, బాబాజాన్‌ను సంప్రదించి వారికి రూ.1.50 లక్షలను నందకుమార్ ఇచ్చారు. తుపాకి కోసం షేక్ అహ్మద్, బాబాజాన్ కలిసి తమకు పరిచయస్తుడైన ఇండోర్(మధ్యప్రదేశ్)కు చెందిన రియాస్‌ను సంప్రదించగా.. ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. రియాస్ సూచనల మేరకు వెంకటరమణ అనే వ్యక్తిని వెంటతీసుకొని గోవింద్‌రెడ్డి, నందకుమార్, షేక్ అహ్మద్ కలిసి విమానంలో ముంబాయి మీదుగా ఇండోర్‌కు వెళ్లారు. రియాస్‌ను కలిసి రూ.30 వేలు చెల్లించి తుపాకీ తీసుకొని జులై 8న హైదరాబాద్‌కు వచ్చారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న విక్రంగౌడ్ వారిని కలిసి ఆ తుపాకిని తన వద్దే భద్రపరిచాడు.

రెక్కీ నిర్వహించిన విక్రమ్

తుపాకీ కొనుగోలు తరువాత నిత్యం గ్యాంగ్‌తో హత్యాయత్నం చర్చించేవాడు. హైదరాబాద్‌లోని రాయల్ లాడ్జ్, అపోలో హాస్పిటల్ సమీపంలోని తన గెస్ట్‌హౌస్‌లో చర్చలు సాగించాడు. తనను ఎలా కాల్చాలి. కాల్చిన తరువాత తుపాకిని ఎక్కడ పడేయాలి. ఎలా పారిపోవాలో వారి క్షుణ్ణంగా వివరించి రెక్కీ కూడా నిర్వహించాడు. పారిపోవడానికి రూ.30 వేలు వెచ్చించి కొనుగోలు చేసిన బైక్ నంబర్ ప్లేట్ మార్చేశారు. జులై 26న కాల్పులు జరపాలని నిర్ణయం తీసుకున్నా, చివరి నిమిషంలో తాము చేయలేమని నందకుమార్ వెళ్లిపోయాడు. దీంతో షేక్ అహ్మద్ తమకు తుపాకీ కొనుగోలు చేసిన రియాస్‌కు ఫోన్ చేసి, కాల్పులు జరపాలని, డీల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను చెప్పాడు. దీనికి అంగీకరించిన రియాస్ హైదరాబాద్‌కు చేరుకోవడంతో, కడపకు వెళ్లిపోయిన నందకుమార్ కూడా తిరిగి వచ్చి వారితో కలిశాడు. కాల్పుల సమయంలో తన భార్య వచ్చినా.. వాచ్‌మెన్ వచ్చిన భయపెట్టడానికి వారిపై కూడా కాల్పులు జరపాలని ఆదేశించాడు.

27న అర్ధరాత్రి తన గెస్ట్ హౌస్‌లో ఉన్న నందకుమార్, రియాస్‌ను విక్రంగౌడ్ స్వయంగా కారులో తీసుకొచ్చి, ఫిల్మ్‌నగర్‌లోని తన ఇంటికి కొద్ది దూరంలో దింపాడు.వాచ్‌మెన్‌తో స్నేహితులు వస్తారు గేటు తీసే ఉంచమని చెప్పాడు. తాను స్నానం చేసి, తన వద్దే ఉన్న తుపాకిని తీసుకొని కిందకు వచ్చేశాడు. అనంతరం విక్రమ్‌గౌడ్ ఇంటికి రియాస్ వెళ్లగా, షేక్ అహ్మద్ బైక్ స్టార్ట్ చేసి రెడీగా ఉన్నాడు. నందకుమార్ మాత్రం తనకు వాహనం లేదని, ముందుగానే వెళ్లిపోయాడు. విక్రమ్ ఇచ్చిన తుపాకీని తీసుకున్న రియాస్ మొదట ఎడమ భుజంపై కాల్చాడు. దెబ్బకు విక్రమ్ సోఫాలో కూలబడ్డాడు. విక్రమ్ చెయ్యి సరిగా ఎత్తలేక పోవడంతో భుజంలోకి వెళ్లాల్సిన రెండో బుల్లెట్.. కడుపులోకి దూసుకెళ్లింది. మూడో తూటా పేల్చ డానికి ప్రయత్నించగా.. తుపాకీ చెడిపోవడంతో చేసేదేమీ లేక ముందస్తుగా అనుకున్న ప్లాన్ ప్రకారం ఫిల్మ్‌నగర్ నుంచి ముంబై వెళ్లే రోడ్డు మీదుగా బైక్ మీద పారిపోతూ తుపాకిని హకీంపేట్‌లోని కుంటలో పడేసి వెళ్లిపోయారు.

ప్లాన్ వెల్లడించిన విక్రమ్

కాల్పుల అనంతరం గాయపడ్డ విక్రమ్ గౌడ్‌ను అతని భార్య షిఫాలి ఆస్పత్రిలో చేర్పించారు. విక్రమ్ భార్య తెలిపిన విషయాల్లో కొన్ని విరుద్ధంగా తోచడంతో అధికారులు తమదైన శైలిలో విక్రమ్‌ను ప్రశ్నించారు. ముందుగా ఏమిచెప్పని విక్రమ్ తరువాత విచారణలో తన ప్లాన్ మొత్తాన్ని పోలీసుల ముందు కక్కేశాడు.

టిడిపికి శిల్పా గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి జరిపిన చర్చలతో శిల్పా చక్రపాణిరెడ్డి టిడిపిని వీడి వైసిపిలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం నంద్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీకి, ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టిడిపి తనపట్ల అమానుషంగా వ్యవహరించిందని, అవమానాలు తట్టుకోలేకే పార్టీని వీడుతున్నానని తెలిపారు. టిడిపి బలోపేతం కోసం రెండేళ్లు పనిచేసినా కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యతనిచ్చి తనను నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. రెండేళ్లుగా టిడిపి కోసం పనిచేసే మంత్రి అఖిల ప్రియతో సహా మిగిలిన నాయకులంత ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలు చేస్తూ అవమానాలకు గురి చేశారన్నారు. డబ్బులకు అమ్ముడు పోయిన ఎమ్మెల్యేలు కూడా చీమకు కూడా హాని చేయని తన సోదరుడిపై విమర్శలు చేయడం తనను బాధించిందన్నారు. గురువారం నంద్యాలలో జరిగే బహిరంగ సభలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫ్యాక్స్ ద్వారా రాజీనామాను పంపారు.

2014 ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గంలో టిడిపి తరుపున పనిచేసిన చక్రపాణిరెడ్డికి పార్టీ నుండి అంత మద్దతు లభించలేదు. ఇటీవల భూమా నాగిరెడ్డి టిడిపిలో చేరిన తరువాత చక్రపాణిరెడ్డిని పక్కనబెట్టేశారు. అప్పట్లో భూమా చేరికను శిల్పా వ్యతిరేకించారు. ఆయన వస్తే పార్టీని వీడుతానని హెచ్చరించారు. అనంతరం చంద్రబాబు నేరుగా రంగంలోకి బుజ్జగించారు. అప్పటి నుండి భూమా, శిల్పా గ్రూపుల మధ్య వైరం నడుస్తూనే ఉంది. అనంతరం శిల్పాను బుజ్జగించేందుకు ఎమ్మెల్సీ పదవి కేటాయించారు. అయినా నియోజకవర్గంలో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, పార్టీలో కొత్తగా చేరిన భూమా కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తున్నారని శిల్పా ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల ఉప ఎన్నికల సీటును భూమా కుటుంబానికి కేటాయించారు. అప్పటి నుండి పార్టీ నాయకత్వం కూడా చక్రపాణిరెడ్డిని పట్టించుకోలేదు. మరోవైపు ఆయన సోదరుడు మోహన్‌రెడ్డి టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా బరిలో నిలిచారు. బుధవారం చక్రపాణిరెడ్డి కూడా రాజీనామా చేశారు.

భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్

కర్నూలు జిల్లా నంద్యాల తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా భూమా బ్రహ్మానందరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ప్రదర్శన నిర్వహించి నంద్యాల ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ వేశారు. నామినేషన్ సందర్భంగా పద్మావతి నగర్‌లో బ్రహ్మానందరెడ్డి స్వగృహం నుంచి మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తితో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త సజ్జల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగురి నామినేషన్లు

నంద్యాల ఉప ఎన్నికల్లో ఇప్పటి వరకూ నలుగురు ఐదుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి రెండుసెట్లు, భూమా మౌనిక రెడ్డి ఒకసెట్, అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మహబూబ్ భాషా, ఎఐఎంఐఎం అభ్యర్థి పి.వి.నారాయణరెడ్డి ఒకసెట్ నామినేషన్లు దాఖలు చేశారు.



రానా, కాజల్, కేథరిన్ హీరో హీరోయిన్లుగా రూపొందిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం ఆడియో వేడుక బుధవారం హైదరాబాద్ జరిగింది. ఈ కార్యక్రమానికి కాజల్, రానా సినిమాలో తమ పాత్రల్లో దుస్తులనే ధరించి ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఆ పది రోజులూ డిప్రెషన్‌లోనే ఉన్నా



- రకుల్ ప్రీత్ సింగ్

"గ్లిజరిన్ లేకుండా ఏడవాల్సిన అవసరం నా జీవితంలో రాలేదు. కాకపోతే గ్లిజరిన్ వాడి వాడి సాయంత్రానికి నా కళ్లు రెండూ బాగా ఉబ్బేవి. నేనొకసారి బోయపాటితో కూడా అన్నాను.. సార్.. ఈ షెడ్యూల్ అయ్యేసరికి నా కళ్ల కింద చారలు వచ్చేటట్టున్నాయి. రోజూ కళ్లు వాయడం, నేను ఐస్ ప్యాక్ పెట్టడం అవుతోంది అని. సినిమాలో హీరోయిన్ ఏదో ఒక సీన్‌లో ఏడుస్తుంది.. కానీ క్యారెక్టర్ మొత్తం ఏడవడమనేది కొత్తగా ఉంటుంది" అని చెప్పింది రకుల్ ప్రీత్‌సింగ్. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్‌సింగ్ హీరో హీరోయన్లుగా రూపొందిన సినిమా 'జయ జానకి నాయక'. ఈనెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా రకుల్ విలేకరులతో మాట్లాడింది.

ఈ చిత్రంలో మీ పాత్ర ఏమిటి?

ఇందులో ప్రధాన పాయింట్ లవ్‌స్టోరీ. ఇప్పుడు ఈ టైమ్‌లో ఇలాంటి లవ్ నిజంగా ఉంటే ఎలా ఉంటుంది? పాతతరంలో లవ్‌స్టోరీస్‌లో త్యాగాలుంటాయి. ఇప్పుడు అలాంటివి ఉండవు. సో.. ఇప్పుడు రియల్ లవ్ ఏంటన్నది దర్శకుడు చూపించాలనుకున్నారు. దాన్ని బట్టే కథను అల్లారు. ఇందులో నా పాత్ర పేరు జానకి. ఇందులో నాకు రెండు వేరియేషన్స్ ఉంటాయి. చాలా నార్మల్, కాలేజ్ గోయింగ్, ఫన్నీ, ఓవర్ ఇనిషియేటివ్ తీసుకునే గర్ల్. ఫ్యామిలీ అంటే బాగా ఇష్టపడే అమ్మాయి. ఒక ఇన్సిడెంట్ వల్ల ఆమె మొత్తం లైఫ్ మారిపోతుంది. ఆ ఇన్సిడెంట్ ఏంటి? ఎక్కడ? అనేది ఈ సినిమాలో చాలా కీలకం.

నెగటివ్ టచ్ ఉంటుందా?

ఉండదు. కానీ లైఫ్‌లో జరిగిన ఒక సంఘటన వల్ల ఆమె ఎందుకలా శాడ్‌గా మారింది? అనేది ఆసక్తికరం. ఇప్పటిదాకా నేను చేసిన పాత్రల్లో మోస్ట్ ఎమోషనల్ పాత్ర ఇదే. ఆ ఫీల్‌గానీ, అమ్మాయి చేరుకునే డిప్రెషన్‌గానీ.. ఏదైనా నిజంగా.. అలాగే ఉండేది. పది రోజులు ఆ షెడ్యూల్‌ని చిత్రీకరిస్తే ఆ పది రోజులూ నేను డిప్రెషన్‌లోనే ఉన్నాను. ఎందుకంటే నేను ఆ రోల్‌ని ప్లే చేస్తున్నాను కాబట్టి... అందులో నుంచి బయటకు రాలేను కాబట్టి. ఆ సమయంలో మా అమ్మ ఫోన్ చేసినా సరే నేను మాట్లాడకపోయేదాన్ని.

డిప్రెషన్ అనేది నేచురల్‌గా జరుగుతుంది కదా.. దాన్ని సినిమాలో ఎలా ప్రెజెంట్ చేశారు?

డిప్రెషన్ అనేది డిస్ కనెక్ట్ యువర్‌సెల్ అన్నమాట. షూటింగ్ సమయంలో నార్మల్ మూడ్‌లో ఉంటే ఫోన్లు చూసుకోవచ్చు, చాట్ చేసుకోవచ్చు.. ఏదైనా చేసుకోవచ్చు. కానీ మనం డిప్రెషన్ మూడ్‌లో ఉంటే మాత్రం అవన్నీ చాలా కష్టం. ఇందాక చెప్పినట్టు మా అమ్మ ఫోన్ చేసి రెండు నిమిషాలు మాట్లాడలేవా? అని అడిగినా సరే.. మాట్లాడలేను అనే చెప్పేదాన్ని. ఎందుకంటే క్యారక్టర్‌ని నేను ఆ విధంగా క్యారీ చేశానన్నమాట. ఎందుకంటే ఏదో దు్ఃఖం వచ్చిందన్నట్టే ఉండేదాన్ని.

అప్పుడు మీ మైండ్‌సెట్ ఎలా ఉండేది?

చాలా బ్లాంక్‌గా ఉండేదాన్ని. చాలా మంది లైఫ్‌లో జరిగిన ఏదో ప్రమాదాన్నో, చెడునో ఊహించుకుని శాడ్‌గా ఉంటారు. కానీ భగవంతుడు దయవల్ల నా లైఫ్‌లో ఎప్పుడూ ఏ బ్యాడూ జరగలేదు. అందువల్ల అలాంటివాటిని తలచుకోవాల్సిన అవసరం నాకు ఎప్పుడూ రాలేదు. అందువల్ల నేను బ్లాంక్‌గా ఉండేదాన్ని. బోయపాటి సార్ నా దగ్గరకు వచ్చి 'షాట్ అయిపోయింది... నువ్వు నవ్వొచ్చు కాస్త' అని అనేవారు. అప్పుడు నవ్వేదాన్ని.

దీన్నుంచి ఎలా బయటపడ్డారు?

ప్యాకప్ తర్వాత నేను నార్మల్ లైఫ్‌ని లీడ్ చేసేదాన్ని. ఎందుకంటే చాలా మందికి క్యారెక్టర్ల ఇంపాక్ట్ ఉంటుంది. కొందరు డిప్రెషన్‌లోకి వెళ్తామని అంటారు. కానీ నేను అలా కాదు.. ప్యాకప్ కాగానే నేను రకుల్‌నే. జానకిని కాదు. నేను మామూలుగా సినిమాలకు వెళ్లేదాన్ని. మా తమ్ముడితో సరదాగా ఉండేదాన్ని. జాలీగా ఉండేదాన్ని.

సినిమాలను చూసి ఏడ్చే అలవాటుందా మీకు?

సినిమా మొత్తం చూసి నేనెప్పుడూ ఏడవలేదు. ఎప్పుడో ఒకటీ, అరా సీన్లకు కన్నీళ్లు పెట్టుకునేదాన్ని. కానీ 'నిన్నుకోరి' సినిమా చూసి చాలా వరకు ఏడుస్తూనే ఉన్నా. మా తమ్ముడు పక్కన కూర్చుని నాకు టిష్యూలు పాస్ చేస్తూ ఉన్నాడు. నానికి ఫోన్ చేసి 'ఏడిపించేశావు.. అలా ఎందుకు ఏడిపించావ్.. మీ ఇద్దరు కలవాలి కదా' అని కూడా అన్నాను. ఎందుకంటే నేను హార్డ్ కోర్ రొమాంటిక్. అందుకే నాకు ట్రాజిక్ లవ్ స్టోరీ నచ్చలేదు.

బోయపాటి ఇలాంటి టైటిల్ పెడతారని అనుకున్నారా?

సినిమాకు ఏం కావాలో, ఎలా ఉంటే బావుంటుందో.. ఇంకేం చేయాలో బోయపాటిగారికి బాగా తెలుసు. సెట్‌లో ఉన్న ప్రతి ఒక్కరి ప్లస్‌లూ, మైనస్‌లూ ఆయనకు తెలుసు. ఈ సినిమా కంప్లీట్‌గా జానకి సినిమా. ఈ సినిమాకు హార్డ్ టైటిల్ పెట్టాలని ఆయన అనుకోలేదు. అందుకే ఆయన ఈ టైటిల్‌ని పెట్టారు. ఇందులో యాక్షన్ ఉంది.. ఇంకోటి ఉంది.. అయినా వాటన్నిటికీ రీజన్ జానకి కావడంతో ఆ టైటిల్ పెట్టారు. ముసలమ్మల నుంచి, మనవరాళ్ల వరకు అందరూ కలిసి చూసేలా ఉంటుంది సినిమా.

మీ ప్రకారం మీకున్న ప్లస్‌లు, మైనస్‌లు ఏంటి?

నా బలాలు, బలహీనతలు ప్రజలే చెప్పాలి. మనం ప్రతిదీ ఫర్‌ఫెక్ట్‌గా చేస్తామనే అనుకుంటాం. కానీ అందులో ఎంత బలమో, ఏది బలహీనతో మాత్రం ప్రజలే చెప్పాలి.

సినిమా అయిపోయిన తర్వాత క్యారెక్టర్ హ్యాంగోవర్‌లో ఉంటారా?

క్యారక్టర్ మన పర్సనల్ లైఫ్‌ని ఓవర్‌టేక్ చేయకూడదు. ఒకవేళ చేసిందంటే సైకోలా మారుతారు. ఎందుకంటే ఇన్నేసి పాత్రలు చేసిన తర్వాత, ఆ పాత్రల ప్రభావం మన మీద ఉంటే డిప్రెస్ అవుతాం. లేకుంటే ఇన్ సెక్యూర్‌గా ఫీలవుతాం, లేకుంటే చాలా ఓవర్ కాన్షియస్‌గా తయారవుతాం.. ఇదంతా కరెక్ట్ కాదు.. హ్యాపీగా మాత్రం ఉండలేరు.

ఈ సినిమాలో మీ హార్ట్‌ని టచ్ చేసిన సన్నివేశాలున్నాయా?

నేను సినిమాను ఆడియన్‌గా చూసినప్పుడు వాటిని ఫీలవుతాను. అంతేగానీ సీన్ చేసేటప్పుడు నేను హార్ట్‌ని టచ్ చేస్తుందని అనుకోను. ఎందుకంటే నేను అక్కడ రకుల్‌ని కాదు.. జానకిని మాత్రమే.

'సూర్య' మొదలైంది



అల్లు అర్జున్ హీరోగా రూపొందనున్న చిత్రం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. అను ఇమ్యునల్ హీరోయిన్. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలు జరుపుకున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. యాక్షన్ కింగ్ అర్జున్ ముఖ్య పాత్రలో శరత్ కుమార్ ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి కె.నాగబాబు సమర్పకుడు. రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతోంది. శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. బాలీవుడ్ సంగీతద్వయం విశాల్-శేఖర్ బాణీలు సమకూరుస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2018, ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మారేది ప్రేమ కాదు ప్రేమికులే



రఫీ, కోటేంద్ర దుద్యాల, నాగ అన్వేష్ తదితరులు

నంది క్రియేషన్స్ బ్యానర్‌పై కె ఎం డి రఫీ నిర్మాతగా 'బంగారి బాలరాజు' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'లవ్ ఈజ్ బ్యాక్' అనేది ట్యాగ్ లైన్. 'రైల్వేట్రాక్' అనే టెలీ ఫిల్మ్ ద్వారా ఉత్తమ చిత్ర దర్శకుడిగా నంది అవార్డును సొంతం చేసుకున్న కోటేంద్ర దుద్యాల ఈ చిత్రానికి దరకత్వంతో పాటు కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. రఫీ నిర్మిస్తున్న ఈ తొలి చిత్రం షూటింగ్ రామానాయుడు స్టూడియోలో బుధవారం లాంఛనం ప్రారంభమైంది. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సాగర్ క్లాప్ ఇవ్వగా, హీరో నాగ అన్వేష్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్క్రిప్ట్‌ను 'సింధూరపువ్వు' కృష్ణారెడ్డి దర్శక నిర్మాతలకు అందించారు.

అనంతరం దర్శకుడు కోటేంద్ర దుద్యాల మాట్లాడుతూ 14ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఫొటోగ్రాఫర్, ఆర్టిస్టుగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న తాను దర్శకుడిగా మారడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిత్రం కథ విషయానికి వస్తే.. దశాబ్దాలు మారినా, శతాబ్దాలు మారినా ప్రేమ మారదని..ప్రేమికులు మాత్రమే మారుతుంటారని తెలిపారు. చరిత్రలో రోమియో-జూలియట్, సలీం-అనార్కలి, దేవదాసు-పార్వతి, లైలా-మజ్ను ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచారని ..బంగారి-బాలరాజు వారు కూడా తమ ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోతారా లేక ప్రేమను గెలిపించుకుని చరిత్ర సృష్టిస్తారా! అనేదే ఈ చిత్ర కథా సారాంశం అని వివరించారు.

సీక్రెట్ సూపర్ స్టార్

'దంగల్' సినిమాలో నటించిన జైరా వాస్మి, అమిర్ ఖాన్ కలసి మరో సినిమా చేస్తున్న విషయం తెలిసింది. అదే 'సీక్రెట్ సూపర్ స్టార్'. ఆ చిత్రం ట్రైలర్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అది బుధవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. జైరా వాస్మి ఇందులో సింగర్ కావాలని కల కంటూ ఉంటుంది. దాన్ని తన తండ్రి వ్యతిరేకిస్తూ ఉంటాడు. తను ఎంతగానో ప్రేమతో కొనుక్కొన్న గిటార్‌ను కూడా పగలగొతాడు. దీంతో ఎం చేయాలో అర్థంకాక బాధపడుతున్న తరుణంలో సంగీత దర్శకుడిగా రాణిస్తున్న అమిర్ ఖాన్ తనకు అండగా నిలబడతాడు. టీవీ షోలో అమిర్ వ్యాఖ్యాతగా కూడా వ్యవహిస్తుంటాడు. తన తండ్రికి కూతురు టాలెంట్‌ను తెలియజెప్పాలని అనుకుంటాడు. టీవీ షో ద్వారా అయితే తెలిసిపోతుందని, యూట్యూబ్‌లో పాటలు పాడి ఆపలోడ్ చేస్తారు. దీనికి భారీ స్థాయిలో స్పందన వస్తుంది. ఇదీ ఈట్రైలర్‌లో చెప్పింది. 'సీక్రెట్ సూపర్ స్టార్' చిత్రంలో అమిర్ కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించే వ్యక్తిగా, సంగీత దర్శకుడిగా కనబడే అవకాశం ఉందని తెలుస్తుంది.



అమిర్ ఖాన్

'దర్శకుడు' తొలి టికెట్ చిరంజీవిదే

సుకుమార్ నిర్మాతగా, అశోక్, ఇషా హీరో హీరోయిన్లు రూపొందిన 'దర్శకుడు' చిత్రం ఈనెల గురువారం విడుదల కాబోతుంది. ఈ చిత్రం మొదటి టికెట్‌ని చిరంజీవి కొనుక్కుని అందరినీ ఆశ్చర్యపరిచారు. తనకు ఆశ్చర్యంగానూ ఆనందంగానూ ఉందని ఈ సందర్భంగా చిరంజీవి పేర్కొన్నారు. సుకుమార్ కమర్షియల్ సినిమాలు చేసుకుంటూ, ఉన్న సమయంలో మంచి కథలను క్రియేట్ చేస్తున్నాడని చెప్పారు. కేవలం తానేమిటి అనకుండా ఈ సినిమా ఇండస్ట్రీకి తానేమిటి అనే కోణం నుండి ఆలోచిస్తూ..తను అప్‌కమింగ్ స్టోరీ రైటర్స్‌ని గానీ, అలాగే డైరెక్టర్స్‌ని గానీ, అలాగే ఆర్టిస్టులని గానీ ప్రోత్సహించాలనే ఉద్దేశం సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ ప్రారంభించారు. అందులో ఔత్సాహికులైన కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మనస్ఫూర్తిగా అభినందించాల్సిన విషయమని చెప్పారు చిరంజీవి.



అశోక్, సుకుమార్, చిరంజీవి తదితరులు

అన్నదాత కోసం పోరాటం

సాధారణంగా మనం ఎవరి ఇంటికైనా భోజనానికి వెళ్లినప్పుడు, ఎవరైనా మన ఇంటికి భోజనానికి వచ్చినప్పుడు, భోజనం పూర్తి కాగానే అన్నదాత సుఖీభవ అని అంటుంటాం. అన్నం ఉత్పత్తి చేసేది రైతు. కాబట్టి అన్నదాత సుఖీభవ అంటే రైతన్న నువ్వు సుఖంగా ఉండు అని అర్థం. కానీ ఈవాళ అన్నదాత సుఖీభవ కాదు, అన్నదాత దు్ఃఖీభవ అయిపోయింది. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతు వెన్నెముక విరిపోతుంది. రైతు బికారిగా మారిపోతున్నాడు. అందుకే రైతు సమస్యల నేపథ్యంలో ఆర్ నారాయణమూర్తి ఈ సినిమా తీయబోతున్నట్టు చెప్పారు. స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై 'అన్నదాత సుఖీభవ' సినిమా చేయబోతున్నానని ఆయన వెల్లడించారు. ఈ సినిమా పాటలు రికార్డింగ్ అయిపోయాయి. గద్దర్, గోరేటి ఎంకన్న, సుద్దాల అశోక్ తేజ, వంగపండు ప్రసాద్ గీతాలు రాశారు. గురువారం నుంచి చిత్రీకరణ ప్రారంభం కానుంది.



ఆర్. నారాయణమూర్తి

మలయాళంలో 'వెంటిలేటర్'



ప్రియాంక చోప్రా

ప్రియాంక చోప్రా ఒక పక్క బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాల్లో చేస్తూనే మరో పక్క ప్రాంతీయ చిత్రాలను నిర్మాణంలో భాగమవుతుంది. ప్రియాంక ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన మరాఠీ చిత్రం 'వెంటిలేటర్' ఈ ఏడాది జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచి తన సత్తాను చాటింది. ఈ సినిమాను ఇప్పుడు మలయాళంలో రీమేక్ కానుంది. అదీ కూడా ప్రియాంక చోప్రానే నిర్మించినుంది. ఈ విషయాన్ని తన తల్లి మధు చోప్రా బుధవారం ప్రకటించింది. మలయాళంలో ఈ చిత్రం చేయడం చాలా ఆనందంగా ఉందని పేర్కొంది. తాను దక్షిణాది భాషల్లో తెలుగు, తమిళ్, కన్నడ కంటే మలయాళం సులువుగా అర్థం చేసుకోగలనని చెప్పింది. అందుకే ఆ భాషల్లో రీమేక్ చేసేందుకు ముందుకొచ్చామని అన్నది. ప్రస్తుతం మలయాళంలో ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహించబోతున్నారు. నటులుగా ఎవరు చేయబోతున్నారన్న దానిపై చర్చలు సాగుతున్నట్టు చెప్పారు. మరారీలో మాత్రం 'వెంటిలేటర్'కు రాజేష్ మపుస్కార్ దర్శకత్వం వహించారు. అశుతోష్ గోరికర్, జితేందర్ జోషి హీరోయిన్లుగా చేశారు. ప్రసన్న కమేర్కర్ ముఖ్య పాత్ర పోషించింది.

సైటెక్
Science & Technology



భూమ్మీద పెరిగిన మొట్టమొదటి మొక్క?



'స్మార్ట్' గేమ్స్

గేమ్స్ అనగానే వయోభేదం లేకుండా అందరూ ఇష్టపడతారు. ఇక స్మార్ట్‌ఫోన్ల హవాతో నచ్చిన గేమ్‌ను నచ్చినంత సమయం ఆడుకునే సదుపాయం ఏర్పడింది. చేతి మునివేళ్లను టపటపా కదుపుతూ డిజిటల్ ప్రపంచంలో విహరిస్తుంటారు. గేమింగ్ ప్రియుల కోసం గూగుల్ ప్లే స్టోర్‌లో కొన్ని వందల వేల గేమ్స్ కళ్లముందు ఊరిస్తూ కనబడుతుంటాయి. అయితే... వందలాది గేమ్స్‌లో ఏవి సెలెక్ట్ చేసుకోవాలో తెలీక తికమక పడుతుంటారు. అలాంటి వారికోసం కొన్ని గేమ్స్...

క్రాష్‌లాండ్స్ : ఈ గేమ్ ప్రస్తుతం ట్రెండీ గేమ్‌గా ఆన్‌లైన్‌లో నడుస్తోంది. స్మార్ట్‌ఫోన్ ఇందులో కొత్త స్నేహితులను చేసుకోవడంతో పాటు కొన్ని రహస్యాలను శోధిస్తూ ముందుకు పోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఆండ్రాయిడ్ గేమ్స్ అన్నింటిలో దీని ప్రత్యేకతే వేరు. ఒక ఏలియన్ గ్రహంపై క్రాష్ ల్యాండ్ అయిన స్పేస్ షిప్‌లో ఉన్న వ్యోమగాములు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటారో చూపే ప్రయత్నమే ఈ గేమ్. చూపు మరల్చనివ్వని ఉత్కంఠత కలిగిస్తుంది.

పోకిమాన్ గో : ప్రపంచమంతా ఉర్రూతలూగించిన మోస్ట్ అడ్వంచర్ గేమ్ పోకిమాన్ గో. ఇది పూర్తిగా వర్చువల్ గేమ్, నిత్య జీవితంలో మన చుట్టూ ఉన్న ప్రపంచమే గేమ్ జోన్. దీన్ని ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా సుమారు 75 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకొని ఆడుతున్నారు. గేమ్ డెవలపర్స్ ఛాయిస్ అవార్డ్స్‌లో బెస్ట్ మొబైల్ గేమ్‌గా 'పోకిమాన్ గో' పేరొందింది. ఈ గేమ్ ప్రత్యేకత ఏమిటంటే... మన చుట్టూ ఉన్న పరిసరాల్లోనే పోకిమాన్‌లను గేమింగ్ కమాండ్స్ ద్వారా వెతకాల్సి ఉంటుంది.



జామెట్రీవార్స్ : ఇది ఉచిత గేమ్ కాదు. కానీ అద్భుతంగా వుంటుంది. ఇందులో వంద లెవెల్స్, 12 బ్యాటిల్ మోడ్స్, అలాగే 15కు పైగా త్రీడీ గ్రిడ్స్ ఉంటాయి. ఇది స్నేహితులతో షేర్ చేసుకుంటూ ఆడొచ్చు. అయితే ప్లే స్టోర్‌లో ఇది ఫ్రీ మాత్రం కాదు. దీన్ని 690 రూపాయలు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

హార్త్ స్టోన్ : ఇదొక కార్డ్ గేమ్, ఇందులో ప్రత్యర్థుల కంటే... చాకచక్యంగా ఆడాల్సి ఉంటుంది. అనుక్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ గేమ్‌లో స్లింగ్ స్పెల్స్, సమ్మన్ మినియన్స్, అలాగే బ్యాటిల్ ఫీల్డ్ మోడ్ ఉంటాయి. అయితే ఈ గేమ్ డౌన్లోడ్ చేసి ఆడేందుకు మీ స్మార్ట్‌ఫోన్‌లో కనీసం 2 జీబీ స్పేస్ అవసరమౌతుంది.

రాక్‌స్టార్ గేమ్స్ : ఇదొక సెట్ ఆఫ్ గేమ్స్. ఇందులో బాగా పేరొందిన గేమ్స్ గ్రాండ్ థెఫ్ట్ ఆటో త్రీ, వైస్ సిటీ, సాన్ అండ్రియాస్ ఉంటాయి. ప్రధానంగా ఓ స్కూల్ విద్యార్థి కేంద్రంగా పనిచేసే ఒక గేమ్ ఉంటుంది.

రిప్ టైడ్ జీపీ : ఇది ఒక హైడ్రో జెట్ రేసింగ్ గేమ్. ఇందులో ఎత్తైన జలపాతాలు, అలాగే వెంటాడే పోలీసులు ఉంటారు. ముఖ్యంగా పబ్లిక్ జలమార్గాల ద్వారా ఈ గేమ్ సింగిల్ ప్లేయర్ ఎనేబుల్డ్‌గా ఉంది. ఇందులో కొత్త కొత్త వాహనాలను మార్చడంతో పాటు స్క్రిన్స్ కూడా మార్చుకునే సౌకర్యం ఉంది. అయితే స్క్రీన్ స్ప్లిట్ ద్వారా ఒకేసారి నలుగురు ఈ గేమ్ ఆడొచ్చు.

దిస్ వార్ ఆఫ్ మైన్ : ఈ గేమ్‌లో దిగ్బంధం చేసిన ఒక సిటీలోని ప్రజలు తమకు ఎదురైన సవాళ్లతో సవాసం చేస్తూ, ఆహారం లేకుండా, నిద్రలేకుండా స్నైపర్స్, అలాగే దుర్మార్గమైన శక్తులతో కలిసి చేసే పోరాటమే ఈ గేమ్ కాన్సెప్ట్. ఎవరైతే ఎక్కువ సమయం తమ శక్తిని కాపాడుకుంటారో వారే ఈ గేమ్ విన్నర్.


టైటాన్ క్వెస్ట్ : ఇది రోల్ ప్లేయింగ్ గేమ్ సెటప్ ఉన్న గేమ్. ప్రాచీన పురాణాలకు సంబంధించిన బ్యాక్ డ్రాప్‌లో ఈ గేమ్ అంతా సాగుతుంది. ఇందులో ప్రధానంగా ఖైదు నుంచి పారిపోయిన ఇద్దరు టైటాన్స్ భూమిని నాశనం చేయాలని చూస్తారు. వారి నుంచి భూమిని కాపాడేందుకు పోరాటం చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇందులో ఆర్చరీ, కత్తి విద్య లాంటి ప్రాచీన యుద్ధ విద్యలు ప్రదర్శించే వీలు కలుగుతుంది.


అన్‌కిల్డ్ : మల్టీ ప్లేయర్ జాంబీ సర్వైవల్ షూటర్ ఇది. ఈ గేమ్‌లో 5 క్యారెక్టర్‌లు ఉంటాయి. అందులో ఒకటి సెలెక్ట్ చేసుకొని ఒక టీమ్‌లో చేరాలి. అక్కడి ఆ ప్రాంతంలో ఉన్న పరిస్థితుల్లో పోరాటం చేయాల్సి ఉంటుంది. మల్టీ ప్లేయర్ గేమ్‌గా ఉన్న ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్లోడ్ చేసుకోవచ్చు.


వెయిన్ గ్లోరీ : ఇది మల్టీప్లేయర్ ఆన్‌లైన్ బ్యాటిల్ ఎరీనా ఇందులో లైవ్ ప్లేయర్స్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. జంగిల్ నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ఒకరు లీడ్ తీసుకోవాల్సి ఉంటుంది. వారిని కెప్టెన్ గా చూస్తారు. ఈ గేమ్ ను ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ప్రశ్న: ఈ భూమ్మీద పెరిగిన మొట్టమొదటి మొక్క పేరు ఏమిటి?
– కె విజయ్,
కాటూరి పబ్లిక్ స్కూల్, గుంటూరు

జవాబు : ఈ భూమ్మీద మొట్టమొదటి మానవుడు, మొట్టమొదటి పావురము, మొట్టమొదటి గులాబి చెట్టు, మొట్టమొదటి పర్వతము అంటూ ఏమీ వుండవు. మీరు ఇదే ప్రశ్నను నన్ను 'మిమ్మల్ని రూపొందించిన మొట్టమొదటి పరమాణువు ఏది?' అంటే దానికి అర్థం లేదు. ఎందుకంటే ఈ భూమ్మీద అప్పటికే వివిధ పదార్థాల రూపంలో ఉన్న పరమాణువులే మా అమ్మా నాన్న శరీరంలో అండము, శుక్రకణం ఏర్పడ్డానికి దారితీశాయి. అవే ఫలదీకరణం చెందగా నేను ఓ జైగోట్ (సంయుక్త బీజకణం) రూపంలో ఏర్పడ్డాను. అదే సంయుక్త బీజకణం(zygote) ద్విదా విచ్ఛిత్తి, బహుదా విచ్ఛిత్తి చెంది ఆ కణంలో ఉన్న జన్యు సంకేతం (genetic code) ప్రకారం మానవుడిగా పుంలింగాకృతిలో నా తల్లి గర్భం నుంచి శిశువుగా బయటపడ్డాను. కేవలం ఒక్క వ్యక్తి ఆవిర్భావంలోనే ఇంత పెద్ద తతంగం వుంటే సుమారు 450 కోట్ల పైచిలుకు చరిత్ర ఉన్న జీవకణం వృక్షంలాగా మారడానికి పట్టిన కోటానుకోట్ల సంవత్సరాలు నిడివిలో మరెంత సంక్లిష్టత ఉండాలి? భూమి పుట్టిన సుమారు 100 కోట్ల సంవత్సరాలకు భూమ్మీద సుముద్రాలు, అందులో వివిధ రకాల రసాయనాలు కరిగి జీవకణాభివృద్ధికి దోహదం చేసేలా సాముద్రపు ద్రావణం రసాయనిక లక్షణాల్ని సంతరించుకుంది. ఈ మార్పులన్నీ గతితార్కిక పద్ధతిలో మాత్రమే జరిగాయి. పరిణామాభివృద్ధి జరుగుతూ క్రమేణా లవణీయత, pH, లఖలాక్షణికత మారుతూ అదను వచ్చిన తడవుగా గుణాత్మక మార్పునకు లోనయ్యేలా ఆ అణువులు DNA/ లేదా RNA గా రూపొందాయి. వాటిపైన పేరుకొన్న కొవ్వు అణువులు కణత్వచం (cell membrane)గా మారాయి. అంటే ఆ విధంగా తొలిదశ జీవకణం ఏర్పడింది. అంటే అదేదో ఆస్ట్రేలియా దగ్గరో, భారత ఉపఖండంలోని బంగాళా ఖాతంలోనో మాత్రమే ఒకేచోట సంభవించినట్టుగా భావించకూడదు. భౌతిక పరిస్థితులు అనుకూలించగానే ప్రపంచ యావత్తూ అనువైన చోటనల్లా కొన్ని నిమిషాలు,







లేదా గంటలు అటుయిటుగా జీవకనాలు ఏర్పడ్డాయి. అందులో కొన్నింటిలో మెగ్నీషియాన్ని బంధించుకొన్న క్లోరోఫిల్ బృహదణువు (macro molecule) రూపొందింది. ఇందుకోసం కొన్ని లక్షల సంవత్సరాల మేరకు గతితార్కిక విధానంలో మార్పులు చేర్పులు జరిగాయి. క్రమేపీ ఆ కణాలు క్లామిడో మోనాస్, యూగ్లీవా వంటి ఏక కణ జీవులుగా మారాయి. అందులో క్లోరోఫిల్ ఉండడం వల్ల అవి తమ ఆహారాన్ని తామే కిరణజన్య సంయోగ క్రియ ద్వారా జరుపుకోగలిగాయి. ఇవే వృక్షజాతిగా పరిణమించాయి. మరికొన్ని క్లోరోఫిల్ ఏమీలేని అమీబాలాంటి కణాలుగా మారాయి. ఇవే జంతుజాతి జీవుల పరిణామానికి దారితీశాయి. కిరణ జన్య సంయోగ క్రియ జరుపుకోగల సత్తా ఉన్న జీవజాతినే వృక్షాలు అంటారు. కాబట్టి భూమ్మీద ఏర్పడిన తొలి మొక్క రూపాలు క్లోరోఫిల్, జాంతోఫిల్ వంటి వర్ణ ద్రవ్యాలను పొందుపరుచుకున్న జీవకణాలే ! వాటికి పేరులేదు.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com

రూ.999కే రెడ్‌మి నోట్4

బెస్ట్ సెల్లింగ్ స్మార్ట్‌ఫోన్‌గా పేరొందిన రెడ్‌మి నోట్4 బుధవారం ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయానికి వచ్చింది. "బిగ్ రెడ్‌మి నోట్4 సేల్" కింద ఈ ఫోన్‌ను 999 రూపాయల అత్యంత తక్కువ ధరకే ఫ్లిప్‌కార్ట్ అందించింది. మధ్యాహ్నం 12 గంటలకు ఈ సేల్ ప్రారంభమైంది. ఈ సేల్, ఫ్లాష్ సేల్‌లకు భిన్నమైంది. ఈ స్మార్ట్‌ఫోన్‌పై ఎక్స్ఛేంజ్ డీల్స్, ఈఎంఐ సౌకర్యాలను, బైబ్యాక్ గ్యారెంటీని ఫ్లిప్‌కార్ట్ ఆఫర్ చేస్తోంది. దీంతో పాటు షావోమి ఎంఐ ఎయిర్ ప్యూరిఫయర్ 2పై 500 రూపాయల డిస్కౌంట్‌ను అందిస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఎంఐ.కామ్‌లోనూ నేడు రెడ్‌మి నోట్4 అమ్మకానికి వస్తోంది. బిగ్ రెడ్‌మి నోట్ 4 సేల్‌లో భాగంగా అన్ని వేరియంట్లపైనా.. రూ.249 బైబ్యాక్ గ్యారెంటీని ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలుచేసిన 6–8 నెలల్లో ఎక్స్ఛేంజ్ చేస్తే 40 శాతం వాల్యును తిరిగి వెనక్కి ఇచ్చేయనుంది. అంతేకాక పాత స్మార్ట్‌ఫోన్లతో ఈ ఫోన్‌ను ఎక్స్ఛేంజ్‌లో కొంటే అతి తక్కువ ధరకు రూ.999కే కస్టమర్లకు అందించనుంది. అంటే దాదాపు రూ.12వేల మేర ధర తగ్గుతోంది. ప్రతి రెడ్‌మి నోట్ 4 కొనుగోలుపై అదనంగా ఎంఐ ఎయిర్ ప్యూరిఫైర్ 2కు 500 రూపాయల డిస్కౌంట్‌ను లభించనుంది. కాగ, ఇటీవలే ఫ్లిప్‌కార్ట్ తన సైటులో ఆండ్రాయిడ్ 7.0 నోగట్ అప్‌డేట్‌తో కూడిన రెడ్‌మి నోట్ 4ను లిస్టు చేసింది.



పొడుపు కథ

బంగారు చెంబులో వెండి గచ్చకాయ..


టీచర్ : నన్ను వేరే ఊరికి బదిలీ చేశార్రా!
పిల్లలు : అవునా టీచర్! చాలా బాధగా ఉంది!
టీచర్ : నాకోసం బాధ పడుతున్నారా? నేనంటే మీకెంత అభిమానం!
పిల్లలు : మీకోసం కాదు టీచర్, అక్కడి పిల్లల్ని తలచుకుని బాధపడుతున్నాం !



స్విట్జర్లాండ్ గురించి తెలుసా ?

పిల్లలూ..! మీకు స్విట్జర్లాండ్ దేశం గురించి తెలుసా..? ఏంటీ పెద్దగా తెలియదంటున్నారా... అయితే ఆ దేశపు ప్రత్యేకతలేంటో తెలుసుకుందామా..!

స్విట్జర్లాండ్‌లో పిల్లలకు ఇష్టం లేని పేరుతో తల్లిదండ్రులు పిలవకూడదు. అది చట్టరీత్యా నిషిద్ధం. పార్లమెంటులో పాసై చట్టమైన దాన్ని దేన్నైనా అక్కడి ప్రజలు కోర్టులో సవాల్ చెయ్యొచ్చు. చలి ఎక్కువే. శీతాకాలం –20డిగ్రీలు కూడా నమోదవుతుంది. అనేక అధ్యయనాల ప్రకారం ప్రపంచంలోనే ఎక్కువ ఆయుర్దాయం ఉన్న పురుషులు స్విస్‌వారే. కుక్కల్ని పెంచుకోవాలంటే పన్ను కట్టాల్సిందే. వాటిని ఎలా చూసుకోవాలన్న దానిపై ప్రత్యేక శిక్షణా తీసుకోవాల్సిందే. సంతోషంగా జీవించేందుకు ఇది చక్కటి దేశం. 'వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్'లో డెన్మార్క్ తర్వాత ఇది రెండో స్థానంలో ఉంది. 18 ఏళ్లు దాటిన స్విస్ యువకులు తప్పకుండా మిలటరీలో పని చేయాల్సిందే. మహిళలకు ఈ నిబంధన లేదు.







ఏడాదికి సరాసరిన ఒక్కొక్కరూ 11 కేజీల చాక్లెట్లు తినేస్తారు. ఎక్కువ చాక్లెట్‌ను ఎగుమతి చేసే దేశాల్లో ఇదొకటి.

ప్రజా అవసరాల కోసం వాడే విద్యుత్తులో సగం జల విద్యుత్ ప్లాంట్ల నుంచే వస్తుంది. బెర్న్‌లో 100కు పైగా ఫౌంటేన్లు ఉన్నాయి. అందుకే దీన్ని సిటీ ఆఫ్ ఫౌంటేన్స్' అంటారు. జపాన్ తర్వాత సమయానికి రైళ్లు నడిచేదిక్కడే. బస్సుల్లో డ్రైవర్లే టిక్కెట్లిస్తారు. అప్పటికప్పుడు పొడి కలుపుకుని తాగేసే ఇన్‌స్టెంట్ కాఫీ పుట్టిందిక్కడే. 1938లో నెస్లే సంస్థ నెస్కెఫ్ పేరుతో దీన్ని తయారుచేసింది. ★

గుర్తించండి!



పిల్లలూ..! పైనున్న చిత్రంలో మొత్తం ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి!

నేటి నుంచే రెండో టెస్టు



- సిరీస్‌పై భారత్ గురి
- కెఎల్ రాహుల్‌కే ఛాన్స్
- ఒత్తిడిలో శ్రీలంక

కొలంబో : భారత్– శ్రీలంక క్రికెట్ జట్ల మధ్య రెండో టెస్టు గురువారం ఇక్కడ ప్రారంభం కానుంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో 1–0తో అధిక్యంలో వున్న భారత్ ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ జోరు చూస్తే, ఈ రెండో మ్యాచ్‌లోనూ ఆతిథ్య జట్టుకు కష్టాలు తప్పవని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కోహ్లి సేన పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి టెస్టులో ఓవర్‌కు 4.5 సగటున 840 పరుగులను భారత్ చేసింది. ఇది కూడా 13 వికెట్లను మాత్రమే కోల్పోయి. కాగా, తీవ్ర జ్వరం కారణంగా తొలి టెస్టుకు దూరంగా వున్న ఓపెనర్ కెఎల్ రాహుల్ రెండో టెస్టులో తుది జట్టులోకి వచ్చాడు. దీంతో గాలే టెస్టులో రాణించినా అభినవ్ ముకుంద్‌ను తుది జట్టు నుంచి తప్పించక తప్పలేదు. 'రాహుల్ మాకు కీలక ఓపెనర్. గత రెండేళ్లలో రాహుల్ చాలా మంచి ఇన్నింగ్స్‌లు ఆడాడు. ముఖ్యంగా అతని ప్రదర్శనల్లో నిలకడ పెరిగింది. ప్రస్తుత భారత టెస్టు జట్టులో రాహుల్ కీలక ఓపెనర్. శ్రీలంకతో జరిగే రెండో టెస్టులో రాహుల్ ఆడతాడు' అని భారత కెప్టెన్ విరాట్ కోహ్లి తెలిపాడు. చటేశ్వర పుజారాతో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలు వున్నాయి. అలాగే చటేశ్వర పుజారాకు ఇది 50వ టెస్టు మ్యాచ్. అలాగే అతను నాలుగు వేల టెస్టు పరుగులకు కేవలం 34 పరుగుల దూరంలో వున్నాడు. శ్రీలంకపై పుజారాకు మంచి రికార్డు వుంది. శ్రీలంకపై ఆడిన ప్రతీ రెండు మ్యాచ్‌లకు ఒక్క సెంచరీ చొప్పున పుజారా సాధించాడు. నేటి టెస్టులోనూ పుజారా రాణిస్తాడనే అంచనాలు వున్నాయి. తొలి టెస్టులో శిఖర్ ధావన్, కోహ్లి, రహానే అంతా సత్తా చాటడం భారత్‌కు చాలా సానుకూలమైన అంశం. బౌలింగ్‌లో కూడా ఉమేష్ యాదవ్, మహమ్మద్ షమీ, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలో బలంగా వుంది. చైనామన్ బౌలర్ కులదీప్ యాదవ్‌పై ప్రత్యేక అంచనాలు వున్నాయి. అలాగే అశ్విన్ రెండు వేల పరుగులకు కేవలం 50 పరుగుల దూరంలో వున్నాడు. భారత్ చాలా సానుకూల అంశాలతో ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. అయితే మరో వైపు ఆతిథ్య శ్రీలంక జట్టు పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. కానీ, కెప్టెన్ దినేష్ చండీమాల్ జట్టులోకి తిరిగి రావడం శ్రీలంకకు ఊరట కలిగించే విషయం. అనారోగ్యంతో మొదట్లో ఈ సిరీస్‌కే దూరంగా వున్న చండీమాల్ ఐసిసి నుంచి ప్రత్యేక అనుమతితో ఈ టెస్టులో మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. అలాగే ఐదుగురు బౌలర్ల వ్యూహంతో బరిలోకి దిగాలని శ్రీలంక యోచిస్తోంది. ఇందులో ముగ్గురు స్పిన్నర్లు వుంటారు. దీంతో మలిందా పుష్పకుమారకు తొలి అంతర్జాతీయ టెస్టు ఆడే అవకాశం లభించనుంది. బ్యాటింగ్‌లో శ్రీలంక దిముత్ కరుణరత్నే, కుషాల్ మెండిస్‌లపై ప్రధానంగా ఆధారపడుతుంది. రెండో టెస్టులో భారత్‌కు గట్టి పోటీ ఇస్తామని శ్రీలంక కెప్టెన్ చండీమాల్ అంటున్నాడు.

డోపింగ్ మరణంతో సమానం : బోల్ట్



లండన్ : డోపింగ్ మరణంతో సమానమని, అథ్లెట్లు డోపింగ్‌కు పాల్పడితే అథ్లెట్లు అక్కడితో మృతి చెందినట్లేనని ఉసేన్ బోల్ట్ వ్యాఖ్యానించాడు. శుక్రవారం ఇక్కడ జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల స్ప్రింట్ విభాగంలో బోల్ట్ పాల్గొననున్నాడు. ఈ నెల 12న జరిగే వంద మీటర్ల రిలే పరుగులో కూడా బోల్ట్ పోటీ పడనున్నాడు. ఈ చాంపియన్‌షిప్ తరువాత రిటైర్మెంట్ ప్రకటిస్తానని బోల్ట్ ఇప్పటికే ప్రకటించాడు. దీంతో చాంపియన్‌షిప్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో మీడియాతో బోల్ట్ మాట్లాడాడు. పై రెండు పోటీల్లో పాల్గొనేందుకు చాలా ఉత్సహంగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. అలాగే డోపింగ్‌పై వ్యాఖ్యలు చేశాడు. డోపింగ్ కంటే నీచమైనది లేదని అన్నాడు. మాదక ద్రవ్యాలు తీసుకుని పోటీల్లో పాల్గొంటే అది అథ్లెటిక్స్‌కే అవమానని అన్నాడు. నిజాయతీగా కష్టపడి ఈ రంగంలో రాణిస్తే అది యువ క్రీడాకారుల్లో స్ఫూర్తిని రగిలిస్తుందన్నాడు. అలాగే ఎవరైనా ఒక ఆటగాడు నిష్క్రమిస్తే అతని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే ప్రశ్న తలెత్తకూడదని పేర్కొన్నాడు.

ప్రీ క్వార్టర్స్‌లో ప్రణయ్, కశ్యప్

న్యూఢిల్లీ : అక్లాండ్‌లో జరుగుతున్న న్యూజిలాండ్ గ్రాండ్ ప్రిలో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ ప్రీ క్వార్టర్స్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. సౌరభ్ వర్మ ఇప్పటికే క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. బుధవారం మ్యాచ్‌లో ఇండోనేషియాకు చెందిన అబ్దుల్ కోలిక్‌పై 23–21, 21–18 స్కోరుతో ప్రణయ్ విజయం సాధించగా, న్యూజిలాండ్‌కు చెందిన అస్కార్ గుపై 21–9, 21–8 స్కోరుతో కశ్యప్ విజయం సాధించాడు. ఇండోనేషియాకు చెందిన హెన్రికో కో విబోవో 21–16, 21–16 స్కోరుతో సౌరభ్ విజయం సాధించాడు. తదుపరి మ్యాచ్‌లో సౌరభ్, కశ్యప్ ముఖాముఖీ తలపడుతుండగా, హంగ్‌కాంగ్‌కు చెందిన వై నాన్‌తో ప్రణయ్ ఢీకొంటాడు. ఈ టోర్నిలో భారత్‌కు చెందిన సహిల్ సిపాని, నీరజ్, వషిష్ట, ప్రతుల్ జోషి ఓటమి చవిచూశారు. మహిళల డబుల్స్‌లో సంయోగిత ఘోర్పడే– ప్రజాక్త సవంత్ జోడి ఓటమి చూసింది.

న్యూయార్క్‌లో డెవిస్ కప్ జట్టుకు శిక్షణ

న్యూఢిల్లీ : డెవిస్ కప్‌లో పాల్గొనే భారత టెన్నిస్ జట్టు న్యూయార్క్‌లో శిక్షణ తీసుకొనుంది. ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్స్‌లో భాగంగా సెప్టెంబర్‌లో ఈడ్మంటన్ (కెనడా)లో జరిగే మ్యాచ్‌ల్లో కెనడాతో భారత్ తలపడనున్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 15 నుంచి 17 తేదీల్లో ఈ ప్లే ఆఫ్ మ్యాచులు జరుగుతుండా, సెప్టెంబర్ 4 నుంచి 10 తేదీ వరకూ వారం రోజుల పాటు న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్శిటీలో భారత జట్టు శిక్షణలో పాల్గొననుంది. ఇలాంటి శిక్షణ భారత టెన్నిస్ జట్టు తీసుకోవడం ఇదే తొలిసారి. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను అభ్యర్థించి భారత టెన్నిస్ సమాఖ్య ఈ శిక్షణకు అనుమతి తీసుకుంది. క్రీడా మంత్రిత్వశాఖ అనుమతి ఇవ్వడమే కాకుండా అర్థిక సహాయాన్ని కూడా అందించనుంది. డేవిస్‌కప్‌లో ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోవడం భారత్‌కు ఇది వరసగా నాలుగో ఏడాది. 2014లో సెర్బియా చేతిలోనూ, 2015లో చెక్ రిపబ్లిక్‌తోనూ, 2016లో స్పెయిన్ చేతిలోనూ భారత్ పరాజయం చెందింది. ఈ మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే జరిగాయి. కాగా, న్యూయార్క్‌లో శిక్షణ తీసుకోవడం వలన ప్రపంచ ఉత్తమ ఆటగాళ్ళుతో ఆడే అవకాశం భారత ఆటగాళ్లకు లభిస్తోందని జట్టు కోచ్ జీషన్ అలి తెలిపారు.

టైటాన్స్‌కు మరో ఓటమి



- 6 పాయింట్లతో బెంగాల్ గెలుపు
- గుజరాత్–హరియాణా మ్యాచ్ టై
- చివరి 5 నిమిషాల్లో 13 పాయింట్లు సాధించిన హరియాణా

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ 2017లో తెలుగు టైటాన్స్ ఓటముల పర్వం కొనసాగుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం తెలుగు టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 30–24 పాయింట్లతో విజయం సాధించింది. ప్రథమార్థంలో మంచి పోరాటం కనబర్చినా రెండో అర్థ భాగంలో విఫలం కావడంతో తెలుగు టైటాన్స్ చివరికి ఏడు పాయింట్లతో పరాజయం చెందింది. ఆట తొలి ఆర్థభాగంలో ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు ఆడాయి. దీంతో బెంగాల్ 17–11 స్కోరుతో ఆధిక్యంలో వుంది. అయితే రెండో అర్థ భాగంలో పుంజుకొనేందుకు వచ్చిన అవకాశాల్ని తెలుగు టైటాన్స్ వినియోగించుకోలేక పోయింది. రాహుల్ ఎక్కువ సమయం బయటే వుండటం టైటాన్స్ ఆటతీరుపై ప్రభావం చూపింది. ప్రత్యర్థి రైడర్లను పట్టేయడంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు విఫలం కావడంతో బెంగాల్ వారియర్స్ 30–24తో విజయం సాధించింది.

చివరి నిమిషంలో అసలు ఆట

2017 ప్రో కబడ్డీ లీగ్‌లో అత్యంత ఆసక్తికరమైన మ్యాచ్ బుధవారం జరిగింది. గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 27–27 పాయింట్లతో టైగా ముగిసింది. చివరి 5 నిమిషాల్లో ఏకంగా 13 పాయింట్లు సాధించిన హర్యానా స్టీలర్స్ మ్యాచ్‌ను డ్రా ముగించింది. ఈ మ్యాచ్ ప్రారంభంలో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ ఆధిక్యంలో వుంది. గుజరాత్ 4 పాయింట్లు సాధించిన తరువాత కానీ, ఆట 6వ నిమిషంలో హరియాణా స్టీలర్స్ తొలి పాయింట్‌ను సాధించలేకపోయింది. తొలి అర్థ భాగం ముగిసే సరికి కూడా 11–8 పాయింట్లతో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ ఆధిక్యంలో వుంది. తరువాత ఆట రెండో అర్థభాగం ప్రారంభంలో కూడా గుజరాత్‌దే పైచేయి. 28వ నిమిషంలో గుజరాత్ తొలిసారిగా ఆల్ అవుట్ అయిన సమయంలో కూడా గుజరాత్ 20–13 పాయింట్లుతో ఆధిక్యంలో వుంది. 32వ నిమిషంలో కూడా 21–15 స్కోరుతో గుజరాత్ మంచి స్థితిలో వుంది. అయితే 34వ నిమిషంలో వికాస్ ఖండోలా టెర్రిఫిక్ సూపర్ రైడ్‌తో హరియాణా పుంజుకుంది. స్కోరు 22–20గా మారింది. ఇక్కడి నుంచి ఆటలో అసలు మజా ప్రారంభయింది. ఇరు జట్ల ఆటగాళ్ల పోటాపోటీగా పాయింట్లు సాధిస్తూ మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చివేశారు. దీం స్కోరు 23–23, 24–24, 25–25గా మారింది. అయితే చివరి నిమిషంలో 27–26 స్కోరుతో హరియాణా ఆధిక్యంలో వుంది. అయితే 24 సెకండ్లలో మ్యాచ్ ముగిస్తుందగా గుజరాత్ ఒక పాయింట్ సాధించింది. దీంతో మ్యాచ్ చివరికి 27–27తో ముగిసింది. హరియాణా జట్టులో సురేందర్ నాథా ఏడు రైడ్ పాయింట్లు సాధించగా, సుర్జీత్ సింగ్, వికాస్ ఖండోలా చెరో 6 పాయింట్లు సాధించారు. గుజరాత్ జట్టులో మహేంద్ర కుమార్ 5 పాయింట్లు సాధించాడు.

కాగా, గురువారంతో హైదరాబాద్ వేదికగా మ్యాచ్‌లు ముగుస్తాయి. శుక్రవారం నుంచి ఈ నెల 10 తేదీ వరకూ నాగ్‌పూర్ వేదికగా ప్రో కబడ్డీ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి.

నేటి మ్యాచ్
తెలుగు టైటాన్స్- పాట్నా పైరేట్స్
రాత్రి 9 గంటల నుంచి



జిఎస్టీలో మత్స్యకారుల 'వల'

- వలలపై 12 శాతం పన్ను వద్దు
- మంత్రులకు గంగపుత్రుల వినతులు



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

చేపల వేటతోనే జీవనం సాగించే వారిపై జిఎస్టీ భారంపడుతోంది. చేపల వేటకు వినియోగించే వలలకు గతంలో పన్ను లేదు. జిఎస్టీలో వలలను 12 శాతం పన్ను పరిధిలో చేర్చారు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిఎస్టీ నుంచి ఈ పన్నుకు మినహాయింపు ఇవ్వాలని వారు ఇప్పటికే నేరుగా రాష్ట్ర ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇతర మంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్తున్నారు. మత్స్యకారులపై పన్ను భారం గురించి కేంద్రంతో చర్చించాలని మంత్రులూ అభిప్రాయపడుతున్నారు.

సాధారణంగా మత్స్య కారులు వలలు కొనాలంటే వేలాది రూపాయలు వెచ్చించాలి. ఇందులో కొన్ని రకాలు కిలో 300 నుంచి 700 వందల రూపాయల వరకు ఉంటున్నాయి. నాణ్యతను బట్టి, వేటకు అవసరమైన స్థాయిని బట్టి వీటి ధర ఉంటుందని చెబుతున్నారు. కేవలం చిన్న చేపల కోసం కావాల్సిన వల కిలో ఏడు వందల రూపాయల వరకు ఉండగా, పెద్ద చేపల కోసం వాడే వల మూడు, నాలుగు వందల రూపాయల వరకు ఉంటుంది. నదుల్లో చేపలు పట్టే వారు కనీసం 40 కిలోల వలలు వాడుతున్నారు. సముద్రంలో ఫైబర్ బోట్ల ద్వారా ఫిషింగ్ చేసేవారు నాలుగు వందల కిలోల వలను, ఇంకా పెద్ద బోట్లలో వేటకు వెళ్లే వారు ఒక టన్ను సామర్థ్యం గల వలలనూ వాడుతుంటారు. ఇంత ఖరీదు పెట్టి కొన్న వలలు చేపల వేట సమయంలో కొన్ని పెద్ద చేపల కారణంగా చెడిపోతుంటాయి. ఈ సమయంలో మళ్లీ కొత్త వలలు కొనక తప్పనిసరి పరిస్థితి నెలకొంటోంది. లేకపోయినా ఏడాది తరువాత వలలను మార్చాల్సి ఉంటుంది. ఇటువంటి వలలపై ఇన్నాళ్లూ ఎటువంటి పన్ను లేకపోవడంతో మత్స్యకారులకు ఊరట లభించేది. తాజాగా జిఎస్టీతో 12 శాతం పన్ను పరిధిలోకి చేర్చడం తమకు భారంగా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై పలు దఫాలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వినతులు అందించామని వలల డీలర్ల సంఘం ప్రతినిధి రాంబాబు తెలిపారు.

గతంలో కూడా 1999, 2000 సంవత్సరాల్లో పన్ను వద్దంటూ అప్పటి ముఖ్యమంత్రిని కోరగా, అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో మత్స్య పరిశ్రమ వల్లే ఎక్కువ వృద్ధి ఉన్నట్లు గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు. మొత్తం వృద్ధి 20 శాతానికిపైగా ఉండగా, అందులో మత్స్య సంపద నుంచే 45 శాతం వరకు లభిస్తున్నట్లు గుర్తించారు. ఈ కీలకమైన రంగంపై జిఎస్టీ వడ్డింపుతో తమ జీవనోపాధికి ఆటంకం ఏర్పడగలదని మత్స్యకారవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

నియోజకవర్గానికొక బిసి గురుకులం

- త్వరలో మెస్ ఛార్జీలు పెంచుతాం
- బిసిలు, కాపులకు సమన్యాయం
  మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రానున్న రోజుల్లో ప్రతి నియోజక వర్గంలో ఒక బిసి గురుకులాన్ని ఏర్పాటు చేస్తామని బిసి సంక్షేమ శాఖా మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. బిసి సంక్షేమ శాఖ అధికారులు, ఫెడరేషన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఎండిలతో మంత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసి సంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అధికారులతో తొలిసారి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బిసి సంక్షేమ శాఖ, కాపు కార్పొరేషన్ ద్వారా ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాల అమలు తీరు పై చర్చించామన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో త్వరలో మెస్ ఛార్జీల్ని పెంచుతామన్నారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని విద్యా సంస్థల్లో బయోమెట్రిక్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. బ్యాంకుల సమస్యల వల్ల గతేడాది రుణాలివ్వలేకపోయామని, ఈ ఏడాదితో కలిపి రెండేళ్ల రుణాలు త్వరలో మంజూరు చేస్తామన్నారు. బిసిలు, కాపులకు సమన్యాయం జరిగే విధంగా రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదని కాపు నేతలే చెప్తున్నారని, మంజునాథన్ నివేదిక రాగానే శాశ్వత ప్రాతిపదికన విద్య, ఉద్యోగాల్లో కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పెడరేషన్లు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, ఎండిలు, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి ఉదయలక్ష్మి, డైరెక్టర్ హర్షవర్ధన్‌తో పాటు అన్ని జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

నేటి ధర్నాలను జయప్రదం చేయండి

- మున్సిపల్ టీచర్లకు ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలనే ప్రధాన డిమాండ్లతో నేడు అన్ని మున్సిపల్, నగరపాలక సంస్థల కార్యాలయాల ఎదుట ఫ్యాప్టో చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఛైర్మన్ పి.బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.హృదయరాజు కోరారు. అంతర్‌జిల్లా, అంతర్ పట్టణ బదిలీలు, అసంబద్ధంగా ఉన్న సర్వీసు రూల్స్‌లో సవరణ, పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్, పదోన్నతుల షెడ్యూల్‌ను జారీ చేయడం, జిపిఎఫ్ సౌకర్యం, పాఠ్య పుస్తకాల తక్షణ పంపిణీ, మున్సిపాలిటీలకు ఎంఇఒ, డివైఇఒ పోస్టుల మంజూరు, ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ పవర్ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

లిడ్‌క్యాప్‌కు రూ.2 కోట్లు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఎపి (లిడ్‌క్యాప్)కు రూ.2 కోట్లు మంజూరు చేస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియారాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బడ్జెట్‌లో లిడ్‌క్యాప్‌కు నిధులు కేటాయించనందు వల్ల అదనపు నిధుల పేరుతో ఈ మొత్తాన్ని మంజూరు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు భారత రత్న ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా గొల్లపూడిలోని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం పింగళి వెంకయ్య 141వ జయంతి వేడుకలు ఆ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిగురుపాటి మాట్లాడుతూ జాతీయ జెండాను రూపొందించడమే కాకుండా దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన పింగళికి రావలసినంత గుర్తింపు రాలేదన్నారు.

బ్రాహ్మణుల్ని ఆర్థికంగా ఆదుకుంటాం: ఛైర్మన్ ఆనంద సూర్య

బ్రాహ్మణులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని, దీని ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాల్ని చేపడుతున్నారని ఆ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరు ఆనంద సూర్య అన్నారు. దేశానికి ఎనలేని సేవలందించిన టంగుటూరి ప్రకాశం పంతులు, కెఎల్ రావు, పింగళి వెంకయ్య వంటి గొప్ప వ్యక్తుల జయంతి, వర్ధంతుల్ని ప్రభుత్వ పక్షాన నిర్వహిస్తూ, వారి విశిష్టతను సమాజానికి తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ పద్మ, జిఎం వెంకట శాస్త్రి, అఖిల భారత బ్రాహ్మణ సంఘం నాయకులు కోట శంకర శర్మ, కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫాతిమా వైద్య కళాశాలపై హైకోర్టు తీర్పు బాధాకరం

మంత్రి కామినేని శ్రీనివాస్



ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కడప జిల్లాలోని ఫాతిమా వైద్య కళాశాల విద్యార్థినుల విషయంలో హై కోర్టు తీర్పు బాధాకరమని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. విజయవాడలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలించలేదన్నారు. మూడు సార్లు ఢిల్లీకి వెళ్లి సమస్యను కేంద్రం దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. సాంకేతిక కారణాలు, ఎంసిఐ నిబంధనలు, కోర్టు తీర్పు కారణంగా ప్రభుత్వం ఇప్పుడు ఏమీ చేయలేని స్థితిలో ఉందన్నారు. విద్యార్థినులు చెల్లించిన ఫీజుల్ని కళాశాల యాజమాన్యం తిరిగి ఇస్తే కొంతైనా న్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థినులు కూడా పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68